

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 34 • పేజీలు:12+16 • వెల: రూ.5 | గురువారం • 4-1-2018 | www.manamnews.com | /manamnews



‘తలాక్’పై తకరారు

రాజ్యసభలో ప్రతిపక్షాల మూకుమ్మడి బ్రేక్

సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ డిమాండ్


7లో..



ఒత్తానంటే ఒడ్సిపోతవ్!

మా బటన్ మరీ శక్తిమంతమైనది..

ఉత్తరకొరియాకు ట్రంప్ హెచ్చరిక



రేవంత్ ‘రేస్’కు కళ్లెం?

కాంగ్రెస్‌లో చాపకింద నీరులా అంతర్గత పోరు

కుమ్ములాటలతో సతమతం.. అధిష్టానం గుర్తిస్తేనే అధికారం!

లేదంటే పుట్టి మునగడం ఖాయమంటున్న సీనియర్లు



హైదరాబాద్, జనవరి 3, మనం ప్రతినిధి : కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అధికారమే పరమావధిగా ఓ పక్క కాంగ్రెస్ జాతీయ నాయకత్వం పావులు కదుపుతుంటే మరోపక్క రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కుమ్ములాటల్లో మునిగిపోతున్నారు. తెలంగాణలో 2019లో అధికారం తమదేనంటూ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు, కానీ అంతర్గతంగా నేతల మధ్య నెలకొన్న విభేదాలపై దృష్టి సారించడం లేదు. ఇది పార్టీకి తీరని నష్టం కలిగిస్తుందని పలువురు సీనియర్లు హెచ్చరిస్తున్నారు. పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఎన్నికల్లో గెలిపిస్తానంటూ టీడీపీ నాయకుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినట్లు జరిగిన ప్రచారం విదితమే. టీపీసీసీ బాధ్యతలు ఇస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని నిన్నమొన్న కోమటిరెడ్డి బ్రదర్స్ మీడియా ద్వారా ప్రకటించడం వివాదాలకు తార్కాణంగా వారు చెబుతున్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అటు జిల్లాలోనూ, ఇటు రాష్ట్రస్థాయిలోనూ తనకు తలనొప్పిగా మారటంతో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌ను టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారే కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చారనే ప్రచారం ఉంది. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌ను ధీటుగా ఎదుర్కోనాలంటే పార్టీ ప్రధాన బాధ్యతలను తనకు అప్పగించాలంటూ కాంగ్రెస్‌లో చేరిన సమయంలో రేవంత్‌రెడ్డి రాహూల్‌తో పేర్కొన్నట్టు కూడా ప్రచారం జరిగింది. కేసీఆర్‌ను ఎదుర్కోవటంలో రేవంత్ అవసరాన్ని కాంగ్రెస్ అధిష్టానం గుర్తించింది. పార్టీలోకి రెడ్ కార్పెట్ వేస్తూ ఆహ్వానించింది. అయితే ప్రధాన బాధ్యతలను అప్పగించడంలో జాప్యం చేస్తుండడమే కాంగ్రెస్ మార్కు రాజకీయానికి నిదర్శనంగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ సముద్రం లాంటిదని, రేవంత్ కూడా అందరిలో ఒకరేననే భావన కలిగించేందుకే ఇప్పటి వరకు ఆయనకు ఏ బాధ్యతలూ అప్పగించలేదని సీనియర్లు పేర్కొంటున్నారు. గాంధీభవన్‌కు తొలిసారిగా వచ్చిన సందర్భంలో రేవంత్ భారీ ప్రదర్శనతో మిగతా 6లో..



జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం

కేంద్ర మంత్రికి ఎంపీ కవిత విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన అశోక్ గజపతిరాజు

- స్పైస్ పార్కుకు మరో 20 కోట్లు
- వచ్చే నెలలో ‘టర్మరిక్’ సెల్ ప్రారంభం
- కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): తెలంగాణను బంగారు తెలంగాణ చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సంకల్పాన్ని నెర వేర్చేందుకు టీఆర్ఎస్ ముఖ్యనేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ వంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర విమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతి రాజుకు ఎంపీ కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో ఆమె కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఓ కేంద్ర మిగతా 6లో..

ఇదీలోకం!



ఈ సారి జాతరకు ఎడ్లబండిలో కాదే.. హెలికాప్టర్‌లో తీస్కపోతా..!



జాతరకు రండి

ఉప రాష్ట్రపతి వెంకయ్యకు ఆహ్వానం

- సానుకూలంగా స్పందించారు
- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడి
- మేడారానికి జాతీయ హోదా
- కేంద్ర గిరిజన మంత్రికి విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): ఆసియా ఖండంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, గిరిజన కుంభమేళాగా పరిగణించే మేడారం సమక్క-సారక్క జాతరకు రావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి నివాసంలో ఈ మేరకు కలిసి మిగతా 6లో..

అందరికీ మేలు

నిరంతర విద్యుత్‌తో చిన్నపరిశ్రమలకూ ఊరట

- దేశంలోనే తొలి రాష్ట్రం.. తెలంగాణ చరిత్రలో కీలకం
- సీఎం కేసీఆర్ దూరదృష్టివల్లే ఇది సాధ్యం
- ‘ఉదయ్’కు, ఉచితానికి సంబంధం లేదు
- ‘మనం’ ఇంటర్వ్యూలో జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు



ఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ చేతుల మీదుగా సీబీఐపీ అవార్డును స్వీకరిస్తున్న జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): తెలంగాణలో మినహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ సాగుకు 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వట్లేదని జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ తెలంగాణ చరిత్రలోనే ఒక కీలక ఘట్టంగా మిగతా 6లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో గురువారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలోనూ స్వల్ప మార్పు చోటుచేసుకుంటుంది. రాత్రిపూట చలి తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు

గాలిలో తేమ: 45 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథిః తదియ రా. 9.32 తదుపరి చవితి; నక్షత్రం ః ఆశ్లేష తె. 3.51 తదుపరి మఖ; వర్జ్యం ః సా.5.42 - 7.09; దుర్ముహూర్తం ః మ.2.55 - 4.23; రాహుకాలం ః మ.1.44 - 3.06; అమృతఘడియలు ః రా.12.26 - 1.52; శుభసమయం ః మ.1.00-1.30;

సూర్యోదయం ః 6.51, సూర్యాస్తమయం ః 5.51

చిక్కుల్లో గజల్ శ్రీనివాస్

- మరిన్ని ఆధారాలు వెలుగులోకి
- ఆ వీడియో మరింత జుగుప్సాకరం
- వేధింపుల కేసుకు మరిన్ని ఆధారాలు
- ‘సేవ్ టెంపుల్’ నుంచి గజల్ తొలగింపు



హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): ఓ యువతిని లైంగికంగా వేధించారనే ఆరోపణల నేపథ్యంలో అరెస్టయిన గజల్ శ్రీనివాస్ మరిన్ని చిక్కుల్లో పడ్డారు. వేధింపులకు సంబంధించి బాధిత మహిళ మరిన్ని ఆధారాలను బుధవారం విడుదల చేసింది. ఆ వీడియోల్లో ఆ యువతి పట్ల గజల్ శ్రీనివాస్ మరింత జుగుప్సాకరంగా వ్యవహరించినట్లువెలుగులోకి వచ్చింది. కాగా, ఆరోపణల నేపథ్యంలో ‘సేవ్ టెంపుల్’ నుంచి గజల్ శ్రీనివాస్‌ను తొలగిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమ సంస్థ మహిళలపట్ల గౌరవ భావంతో ఉంటుందని, వారిపై మిగతా 5లో..





జనజీవనం ‘బంద్’

మహారాష్ట్రలో ఆందోళన హింసాత్మకం

- రెండు రోజుల్లో 42 బస్సులు ధ్వంసం
- హిందుత్వ సంస్థలవల్లనే హింస: కాంగ్రెస్
- ఆర్వే బదులు ఆజ్యం పోస్తున్నారు: బీజేపీ

7లో..

సంక్రాంతి స్పెషల్ 3262 బస్సులు

- రద్దీని తట్టుకునే ఏర్పాట్లలో టీఎస్ఆర్టీసీ
- దూరప్రాంతాలకు 50% అదనపు చార్జీ
- శివార్ల నుంచి బస్సులు ప్రారంభం
- రంగారెడ్డి ఆర్ఎం యాదగిరి వెల్లడి



హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారికోసం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టీఎస్ఆర్టీసీ ప్రకటించింది. పండుగ రద్దీని తట్టుకునేందుకు ప్రస్తుతం ఆయా మార్గాల్లో నడిచే బస్సులకు అదనంగా 3262 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈమేరకు బుధవారం నగరంలోని మహాత్మ గాంధీ బస్ స్టేషన్(ఎంజీబీఎస్)లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్టీసీ రంగా రెడ్డి రీజనల్ మేనేజర్ యాదగిరి మాట్లాడుతూ.. పండగ రద్దీ దృష్ట్యా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఈ నెల 10 నుంచి 13 వరకు ప్రత్యేకంగా బస్సులను నడుపుతామని చెప్పారు. మొత్తం 3262 బస్సుల్లో.. 1910 బస్సులు తెలంగాణలోని పలు ప్రాంతాలకు, మిగతా 1352 ఏపీలోని ప్రాంతాలకు నడపనున్నట్లు వెల్లడించారు. దూర ప్రాంతాల బస్సుల్లో మిగతా 6లో..

మంచు ఖండాలుగా మారణాయుధాలు

- **ఉత్తర కొరియాలో మంచు శిల్పకళా ఉత్సవం**

సియోల్, జనవరి 3: దేశీయంగా సంపాదించుకున్న ఆయుధ సంపత్తికి ఉత్తర కొరియా మంచుతో ప్రతిరూపమిచ్చింది. చిన్నా పెద్ద క్షిపణులను మంచుతో రూపొందించి ప్యాంగ్‌యాంగ్‌లో ప్రదర్శనకు పెట్టింది. మంచుతో శిల్పాలను రూపొందించి, ప్రదర్శించే పోటీలో ఎటుచూసినా ఇటీవలి క్షిపణులు కన్పించేలా ఏర్పాటు చేసింది. దీంతో ప్యాంగ్‌యాంగ్‌లో జరుగుతున్న మంచు శిల్పాల ఉత్సవానికి కొరియన్లు పోటెత్తుతున్నారు. ఈమేరకు ఉత్తర కొరియా అధికారిక పత్రిక రోడాంగ్ సిన్ మున్ ఓ కథనం ప్రచురించింది. ఇందులో మంచు శిల్పాలను చూడడానికి ఎగబడిన చిత్రాలనూ ప్రచురించింది.

ఈ మంచు శిల్పాలలో ఇటీవలి ఖండాంతర క్షిపణి హ్వాస్వాంగ్-15 నమూనా కూడా ఉండడం విశేషం! నవంబర్‌లో దేశవ్యాప్తంగా ఎదుర్కొన్న ఉత్కంఠ పరిస్థితిని ఈ శిల్పాలు మరోసారి గుర్తుకుతెచ్చాయని ఈ కథనంలో పేర్కొంది. కాగా, కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా నార్త్ కొరియన్ల నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ అగ్రరాజ్యం అమెరికాకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే! ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. అణు బాంబు బటన్ ఎల్లప్పుడూ తనకు అందుబాటులోనే ఉంటుందని ట్రంప్‌ను హెచ్చరించారు. అదేసమయంలో దక్షిణ కొరియా రాజధాని సియోల్‌తో స్నేహ సంబంధాలు కొనసాగించేందుకు మొగ్గు చూపారు. ఇరు దేశాల మధ్య సంబంధ బాంధవ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కొత్త సంవత్సర వేడుకలలో భాగంగా సియోల్‌కు స్నేహ హస్తం సాచారు. సియోల్, ప్యాంగ్‌యాంగ్ మధ్య హాట్‌లైన్ ఏర్పాటుకు కొత్త మార్గం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ కొరియాలో జరగనున్న వింటర్ ఒలంపిక్స్‌కు హాజరయ్యే విషయమై చర్చలు జరిపేందుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు.

తాజ్‌మహల్ సందర్శకులపై ఆంక్షలు

- **రోజుకు 40 వేల మందికి పరిమితం!**



న్యూఢిల్లీ, జనవరి 3: ప్రపంచ ప్రఖ్యాత కట్టడమైన తాజ్‌మహల్‌ను సందర్శించే పర్యటకులపై భారత పురావస్తు శాఖ ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. పురాతన కట్టడాన్ని కాపాడేందుకు రోజువారీ పర్యటకుల సంఖ్యను 40వేలకు పరిమితం చేయాలని భావిస్తున్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి రవింద్ర సింగ్ పురావస్తు శాఖ అధికారులు, ఆగ్రా జిల్లా యంత్రాంగం, సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది, తదితరులతో సమావేశం నిర్వహించి తాజ్‌మహల్ సందర్శకులపై ఆంక్షలు విధించే అంశంపై చర్చించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి 40వేల టిక్కెట్లు మాత్రమే అమ్మాలని, అలాగే ప్రతి టిక్కెటుపై తాజ్ సందర్శనకు మూడు గంటల కాల పరిమితి విధించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం తాజ్ పర్యటకులపై ఎలాంటి ఆంక్షలు లేవు. ఏటా పర్యటకుల సంఖ్య 10 నుంచి 15శాతం పెరుగుతూనే ఉంది. పర్యటకులు ఎక్కువగా ఉండే సమయంలో రోజుకు 60వేల నుంచి 70వేల మంది కూడా తాజ్ వద్ద ఉంటున్నారు. తాజ్‌లో పర్యటకుల సంఖ్య పరిమితం చేసే అంశంపై నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నివేదిక ప్రకారం తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుతో డిపాజిటర్లకు చేటు

- **ఆ బిల్లును ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలి**
- **రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

హైదరాబాద్, జనవరి 3 (మనం న్యూస్): ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు విషయంలో నిజాలు చెప్పకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.రాంబాబు అన్నారు. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుపై రిటైర్డ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రివ్వా) ఆధ్వర్యంలో ఏఐటీయూసీ భవన్‌లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బిల్లులోని 49, 52, 53 క్లాజులు డిపాజిటర్ల హక్కులు హరించేవిగా ఉన్నాయన్నారు. బ్యాంకుల రుణాలు ఎగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా ఇప్పుడు కొత్తగా ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం తేవడంలో కుట్ర ఉన్నదని ఆయన ఆరోపించారు. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారే పార్లమెంటులో ఉన్నారని వారు ఏ రకంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తారో వేచి చూడాలన్నారు. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు భయంతో బ్యాంకుల్లో దాచుకున్న సుమారు రూ. 25 లక్షల కోట్ల డిపాజిట్లను ప్రజలు విరమించుకున్నారని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో జరుగుతున్న అవకతవకలపై పరిశీలించడానికి 'డిపాజిట్, ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, 1961' చట్టం ఉండగా ఇప్పుడు కొత్తగా ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం తీసుకురావడంలో అర్థం లేదన్నారు. ఈ చట్టాన్ని నిలువరించకపోతే బ్యాంకులపై ప్రజలకు నమ్మకం పోయి ఆర్థిక సంక్షోభం నెలకొనే పరిస్థితి ఉందన్నారు. 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని, ఈ నేపథ్యంలోనే జీ 20 దేశాల భేటీలో బ్యాంకుల్లోని డిపాజిటర్ల సొమ్మును 'బెయిల్ ఇన్ క్లాజ్' పేరుతో వినియోగించుకొని నష్టాలు పూడ్చుకోవాలని నిర్ణయించినట్టు ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు వెల్లడించారు.

ప్రజాధనం వృథా!

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచార ఆర్భాటం

- **ప్రణాళిక ఊసులేని విద్యుత్ ఒప్పందాలు**
- **ప్రజానీకం నెత్తిన అనవసర ఆర్థిక భారం**
- **పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ్**

హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారంతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. 'కరెంటుపై కేసీఆర్ అబద్ధాలు-విద్యుత్ వాస్తవాలు' పేరిట బుధవారం గాంధీభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను ప్రారంభించి టీఆర్‌ఎస్ పాలకులు గొప్పలు చెప్పుకొంటున్నారని దుయ్యబట్టారు. మూడున్నరేళ్ల పాలనలో ఒక్క మెగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసిన దాఖలాలు లేవన్నారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టులను రెండేళ్లలో ప్రారంభిస్తామని శాసనసభ సాక్షిగా సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. కానీ, మూడున్నరేళ్లు గడుస్తున్నా పనులే ప్రారంభం కాలేదన్నారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంటుపై దేశంలోని పలు భాషా పత్రికలకు ప్రకటనలిచ్చి సీఎం ప్రజాధనాన్ని దుర్వినియగం చేశారని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ప్రణాళిక లేకుండా చేసుకున్న విద్యుత్ ఒప్పందాలతో రూ.వేల కోట్ల భారం ప్రజలపై పడుతోందన్నారు. జెన్‌కో సామర్థ్యాన్ని తగ్గిస్తూ, ప్రైవేటు విద్యుత్ సంస్థలనుంచి అధిక ధరకు ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు చేస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో డిస్కంలు రూ.13వేల కోట్ల అప్పుల్లో మూలుగుతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా మిగులు విద్యుత్ ఉందని, ఇదంతా యూపీఏ హయాంలో చేపట్టిన ప్రణాళికల ఫలితమేనని పేర్కొన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ పనులు ఇండియా బుల్స్-బేల్ ఆధ్వర్యంలో సాగుతున్నాయని ప్రభుత్వం చెబుతున్నదని తెలిపారు. ఇండియా బుల్స్ చేపడుతున్న సబ్-క్రిటికల్ టెక్నాలజీ తెలంగాణకు శాపంగా మారిందని చెప్పారు. ఈ టెక్నాలజీతో నష్టమేనని ఇంధనశాఖ అధికారి అరవింద్‌కుమార్ చెప్పినందుకు ఆయనను ప్రభుత్వం బదిలీ చేసిందని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల ప్రజలపై కరెంటు చార్జీల భారం పడుతుందని చెప్పారు. గత ప్రభుత్వం కృష్ణపట్నం నుంచి యూనిట్‌ను రూ.3.58 వంతున కొనుగోలు చేయగా ఈ ప్రభుత్వం రూ. 4.15 చొప్పున కొనుగోలు చేయటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ, పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి శ్రావణ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, మల్లు రవి, సునీతా లక్ష్మారెడ్డి, కార్తీక్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సుబ్బులక్ష్మి కుమార్తె కన్నుమూత

- **శ్వాసకోస వ్యాధితో రాధా విశ్వనాథన్ మృతి**
- **తల్లితో పాటు సుప్రభాతం, విష్ణు సహస్రనామాల గానం**

బెంగళూరు, జనవరి 3: కర్ణాటక సంగీత కళాకారిణి, గాయకురాలు రాధా విశ్వనాథన్ (83) మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఈమె దివంగత సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి కుమార్తె. శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్న రాధా విశ్వనాథన్ మంగళవారం ఉదయం బెంగళూరులోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించారని ఆమె కుమారుడు శ్రీనివాసన్ తెలిపారు. 1982 నుంచి ఆమె క్షయతో ఇబ్బందిపడుతున్నారని, 36 ఏళ్లు శారీరక అనారోగ్యంతో పోరాడుతున్నా ఆమె ఏనాడూ గొంతు నొప్పి గురించి తమతో చెప్పి బాధపడేవారు కాదని శ్రీనివాసన్ చెప్పారు. తమిళనాడులోని గోబిచెట్టిపాళ్యంలో 1934 డిసెంబరు 11న రాధా విశ్వనాథన్ జన్మించారు. ప్రముఖ సంగీత కళాకారిణి, భారతరత్న అవార్డు గ్రహీత ఎంఎస్ సుబ్బులక్ష్మితో పాటు రాధా విశ్వనాథన్ ఎన్నో కచేరీల్లో పాల్గొన్నారు. విదేశాల్లోనూ తల్లితో పాటు పలు ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీవెంకటేశ్వర సుప్రభాతం, విష్ణు సహస్రనామం, భజగోవిందం కీర్తనల ఆలాపనలోనూ ఎంఎస్ సుబ్బులక్ష్మితో పాటు రాధా విశ్వనాథన్ కూడా గాత్రదానం చేశారు. ఈ కీర్తనల ద్వారా వారిరువురూ ఎన్నటికీ కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిపోతారని శ్రీనివాసన్ అన్నారు. రాధా విశ్వనాథన్‌కు కుమారులు చంద్రశేఖర్, శ్రీనివాసన్, కుమార్తె శుభలక్ష్మితో పాటు ఇద్దరు మనమరాళ్లు ఉన్నారు. కాగా, ఎంఎస్. సుబ్బులక్ష్మి 88 ఏళ్ల వయసులో 2004లో మరణించారు.

పవన్‌కు రాజకీయ అవగాహన శూన్యం

- **వాస్తవంగా చూస్తే విషయమే లేదు**
- **తెలంగాణ రాజకీయాల్లో కల్పించుకోకు**
- **పవన్‌కు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరిక**

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేవలం సినీ నటుడు మాత్రమేనని, రాజకీయాలపై ఆయనకు ఏమాత్రం అవగాహనలేదని కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. వాస్తవంగా చూస్తే అసలు పవన్ దగ్గర విషయమే లేదని ఎద్దేవా చేశారు. ఏపీలో ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్లను చూస్తే.. సమయం, సందర్భంలేకుండా కుల ప్రస్తావన తీసుకొస్తూ ఆవేశంగా ఏదేదో మాట్లాడతారని అన్నారు. మళ్లీ అంతలోనే నవ్వుతారని అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 2009 ఎన్నికలలో భాగంగా వరంగల్ సభలో ఇదే కేసీఆర్‌ను బట్టలిప్పి కొడతామంటూ పవన్ పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా కోమటిరెడ్డి గుర్తు చేశారు. దాంతో కేసీఆర్‌పై ప్రజలకు సానుభూతితో కొన్ని ఓట్లు కూడా పడ్డాయన్నారు. ఇంతలోనే ఆయనకు కేసీఆర్ అంతగా నచ్చేశారా? అని ప్రశ్నించారు. పవన్ 'అజ్ఞాతవాసి' సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకే కేసీఆర్‌తో భేటీ అయ్యారని ఆరోపించారు. ఏదో పెద్ద పనికోసమే కేసీఆర్‌ను కలిశారని.. అందులో ఏదో కుట్ర దాగి ఉండవచ్చని అనుమానించారు. తెలంగాణ ప్రజల పాలిట, అమాయకుల పట్ల పవన్ ఓ పురుగులా తయారయ్యాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏ రాష్ట్రంలో జరగనన్ని స్కామ్‌లు తెలంగాణలో జరుగుతుంటే.. సీఎం కేసీఆర్‌ను పవన్ పొగడడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసలు పవన్ కళ్యాణ్ తెలంగాణ రాజకీయాల్లో కల్పించుకోవద్దని.. ఆయన మరొసారి ఇక్కడి రాజకీయలపై కామెంట్ చేస్తే సహించబోమని కోమటిరెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.

ఎక్సైజ్ శాఖలో అవినీతికి తావులేదు

- మంత్రి పద్మారావుగౌడ్

హైదరాబాద్, జనవరి 03 (మనం ప్రతినిధి) : అవినీతికి తావు లేకుండా ఎక్సైజ్ శాఖ విజయవంతంగా పని చేస్తోందని ఆ శాఖ మంత్రి పద్మారావు గౌడ్ అన్నారు. తెలంగాణ స్టేట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పెట్టుబడి లేకుండా ఆదాయం తీసుకవచ్చే రంగంలో ఎక్సైజ్ శాఖ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. గుడుంబా రహిత తెలంగాణ కోసం కృషి చేస్తోన్న అధికారులను ఆయన అభినందించారు.

ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేష్‌కుమార్ మాట్లాడుతూ హరితహారంలో ఎక్సైజ్‌శాఖ పనితీరు ప్రశంసనీయమన్నారు. ఈ ఏడాది మద్యం దుకాణాల టెండర్ల ద్వారా ఎక్సైజ్‌శాఖకు రూ. 412 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌బీసీఎల్ చైర్మన్ దేవీప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

హద్దు మీరి.. సరిహద్దు దాటి..

భారత భూభాగంలోకి చైనా బలగాలు

అడ్డుకున్న భారత సైనికులు.. 'అరుణాచల్'కు గుర్తింపు లేదు: చైనా



బీజింగ్, జనవరి 3: చైనా మరోసారి హద్దు మీరింది. ఆ దేశ బలగాలు సరిహద్దు దాటి అరుణాచల్ ప్రదేశ్‌లోపలికి 200 మీటర్ల మేర చొచ్చుకువచ్చారు. రాష్ట్రంలోని సియాంగ్ జిల్లాలో ఉన్న ఓ గ్రామం సమీపంలోకి చైనా సైనికులు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డు వేయడానికి కావాల్సిన సామాగ్రితో వచ్చారని వివరించారు. సిక్కింలోని డోక్లామ్‌లో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ముగిసిన 4 నెలల తర్వాత చైనా మరోసారి హద్దు దాటింది. వెంటనే అక్కడున్న భారత బలగాలు వాళ్లను అడ్డుకున్నారు. అయితే డోక్లామ్‌లోలాగా ఇక్కడ రెండు దేశాల సైనికుల మధ్య ఘర్షణ ఏమీ జరగలేదని, రోడ్డు కోసం తీసుకొచ్చిన సామాగ్రిని వాళ్లు అక్కడే వదిలేసి వెళ్లారని ఆర్మీకి చెందిన ఓ అధికారి వెల్లడించారు.

ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను చైనా వేగవంతం చేసిందన్నారు. బైసింగ్ అనే గ్రామం దగ్గర భారత బలగాలు.. చైనా సైనికులను అడ్డుకున్నాయని స్థానికులు తెలిపారు. వాళ్ల దగ్గర ఉన్న సామాగ్రిని భారత బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఢిల్లీలో పది రోజుల కిందట ఇండియా, చైనా ఉన్నత స్థాయి అధికారుల మధ్య సమావేశం జరిగిన సమయంలోనే ఈ చొరబాటు జరిగినట్లు తెలిసింది. సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ సమావేశం జరిగింది. అదే సమయంలో మరోవైపు ఇలా డ్రాగన్ తోక జాడించడం గమనార్హం. అయితే ఇలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని సియాంగ్ డిప్యూటీ కమిషనర్ దులి కాందుక్ చెప్పారు.

అరుణాచల్ ప్రదేశ్‌ను మేం గుర్తించలేదు..

అరుణాచల్ ప్రదేశ్‌ను తామెన్నడూ గుర్తించలేదని చైనా స్పష్టంచేసింది. ఈమేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి జెంగ్ షువాంగ్ మాట్లాడుతూ.. భారత్, చైనాల మధ్య సరిహద్దులకు సంబంధించి స్పష్టత ఉందన్నారు. సరిహద్దులకు సంబంధించి న్యాయబద్ధంగా, ఎలాంటి అస్పష్టతకు తావివ్వని రీతిలో ఒప్పందాలు ఉన్నాయని చెప్పారు. భారత్ చెబుతున్నట్లు అరుణాచల్ ప్రదేశ్ అనే ప్రాంతమేదీ లేదని, దానిని చైనా ఎన్నడూ గుర్తించలేదని షువాంగ్ స్పషం చేశారు. ఇక, తాజాగా జరిగిందని చెబుతున్న చొరబాటు సంఘటన విషయంపై తనకు సమాచారం అందలేదని విలేకరులకు వెల్లడించారు.



కూలిన మిగ్-29కే విమానం

- గోవా నావల్ బేస్‌లో ప్రమాదం

పణజీ, జనవరి 3: భారత నేవీకి చెందిన మిగ్-29కే యుద్ధ విమానం రన్‌వే పైనుంచి టేకాఫ్ అవుతుండగా కూలిపోయింది. గోవాలోని ఐఎన్‌ఎస్ హన్సా నావల్ బేస్‌లో ఈ ఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం శిక్షణలో ఉన్న పైలట్ మిగ్-29కే విమానాన్ని టేకాఫ్ చేస్తుండగా అదుపుతప్పి కూలిపోయింది. విమానంలో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది వాటిని అదుపు చేశారు. వెంటనే అప్రమత్తమైన పైలట్ దానిలో నుంచి తప్పించుకుని క్షేమంగా బయటపడ్డాడు. అయితే గోవా విమానాశ్రయం నావల్ బేస్‌లోనే ఉండడంతో పౌర విమానాల రాకపోకలకు ఆటంకం కలిగింది. రన్‌వేను దాదాపు గంటకు పైగా మూసేసినట్లు విమానాశ్రయ అధికారులు చెప్పారు.

జనసేన కాదు భజనసేన: శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 3 (మనం న్యూస్) : ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీపై విమర్శలు పెరుగుతున్నాయి. జనసేన పార్టీ పేరును భజనసేనగా మారిస్తే మంచిదని బీజేపీ అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితి, విద్యుత్ రంగంపై అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారన్నారు. సినిమా నటుడు కాబట్టి పవన్ కల్యాణ్ ఎవరినైనా కలవొచ్చు కానీ సామాన్యులకు కనిపించని నాయకులు భజన బ్యాచ్‌ను చూడగానే అపాయింట్‌మెంట్ ఇచ్చారన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాకు సంబంధించి కేస్ స్టడీ కావాలని పవన్ మాట్లాడడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. దేశంలోని 19 రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ పథకం అమలవుతోందన్నారు. కేసీఆర్‌ను పొగడటం పవన్ అవగాహన లేమిని తెలియజేస్తుందని, ఇది అతని స్థాయిని తగ్గిస్తోందని శ్రీధర్ వ్యాఖ్యానించారు.

వర్గీకరణపై టీఆర్ఎస్ వైఖరేంటి ?

- **మంద కృష్ణను విడుదల చేయండి**
- **టీటీడీపీ నేత మోత్కుపల్లి డిమాండ్**

హైదరాబాద్, జనవరి 3 (మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణపై టీఆర్ఎస్ తన వైఖరిని స్పష్టం చేయాలని టీటీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో సీఎం కేసీఆర్ దళితులను మభ్యపెడుతున్నారన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని, వర్గీకరణ ఉద్యమంలో బలైన భారతికి రూ.20 లక్షలు ఇస్తామని కేసీఆర్ ప్రకటించి 45 రోజులు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదన్నారు. వర్గీకరణ కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న మందకృష్ణను అరెస్టు చేయడం దారుణమని, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని మోత్కుపల్లి డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని కేసీఆర్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.


మంద కృష్ణ అరెస్టును ఖండిస్తున్నాం

- **బేషరతుగా విడుదల చేయాలి: కోదండరాం**

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): ప్రజాస్వామ్య పద్ధతిలో హక్కుల సాధనకోసం పోరాడుతున్న సామాజిక ఉద్యమకారులు, హక్కుల కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత ధోరణి ప్రదర్శిస్తోందని టీజేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అరెస్టును ఖండిస్తున్నామని అన్నారు. మందకృష్ణ మాదిగ అరెస్ట్‌తో రాష్టంలో నెలకొన్న నిరంకుశ వాతావరణం బయటపడిందని అన్నారు. మంద కృష్ణను భేషరతుగా వెంటనే విడుదల చేయాలని కోదండరాం డిమాండ్ చేశారు. మాదిగల డిమాండ్ల సాధనకోసం శాంతియుత ఆందోళన కార్యక్రమం నిర్వహించుకుంటామని ప్రభుత్వ అనుమతి కోసం మంద కృష్ణ ప్రయత్నించారని చెప్పారు. ఈ ప్రయత్నంలో డీజీపీని, సీపీని కలిసినా ఫలితం దక్కలేదన్నారు. చివరకు తమ సంస్థ కార్యాలయంలోనే దీక్ష చేయాల్సిన దుస్థితి ఎదురైందని చెప్పారు. వాస్తవానికి ప్రైవేటు స్థలంలో నిరసన తెలపడానికి అనుమతి అవసరంలేదన్నారు. కానీ, పోలీసులు మంద కృష్ణ కార్యాలయంలోకి వెళ్లి ఆయనను అరెస్టు చేశారని కోదండరాం మండిపడ్డారు. కాగా, అరెస్టు చేసిన ఎమ్మార్పీఎస్ నేతలు అందరినీ వెంటనే విడుదల చేయాలంటూ టీజేఏసీ పక్షాన కోదండరాం డిమాండ్ చేశారు.

నేటి నుంచి టీడీపీ కార్యకర్తలకు శిక్షణ

హైదరాబాద్, జనవరి 3 (మనం న్యూస్): తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు గురువారం నుంచి రాజకీయ నాయకత్వ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, రైతులు, యువకులు, కార్మికులు, మహిళల సమస్యలపై కార్యకర్తలకు ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తారు. అంతేకాక సోషల్ మీడియాపై అవగాహన, వ్యక్తిత్వ వికాసం తరగతులు నిర్వహిస్తారు. అదేవిధంగా ఈనెల 18వ తేదీ నుంచి పల్లెపల్లెకూ టీడీపీ కార్యక్రమం ప్రారంభమవుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.



నిరంతర విద్యుత్ ఘనత బీజేపీదే : లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 3 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఘనతే అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ అన్నారు. 2018 వరకు తెలంగాణలో నిరంతర విద్యుత్ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఉదయ్ పథకంలో రాష్ట్రాన్ని చేర్చడం, నార్త్ సౌత్ గ్రిడ్ అనుసంధానం, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లకు కేంద్రం అనుమతులు ఇచ్చిందన్నారు. ఒక్క మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి పెరగకుండా తెలంగాణ రాష్టం విద్యుత్‌ను ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. మోదీ సర్కారు వచ్చాక 19 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇది తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



'మనం' దినపత్రిక నంబర్ వన్ కావాలి

- క్యాలెండర్ ఆవిష్కరణలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

హన్మకొండ టౌన్, జనవరి 3, మనంన్యూస్: అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన మనం తెలుగు దినపత్రిక నంబర్‌వన్ పత్రికగా ఎదగాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆకాంక్షించారు. 'మనం' వరంగల్ అర్బన్ జిల్లా సిబ్బంది బుధవారం కడియం శ్రీహరిని ఆయన నివాసంలో కలిశారు. మనం తెలుగు దినపత్రిక 2018 క్యాలెండర్‌ను ఆయనతో ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ అనేక అంశాలతో పత్రిక బాగుందని, ప్రజలను ఆకర్షించే విధంగా ఉందని ప్రశంసించారు. పత్రిక నాణ్యతకు కారణమైన యాజమాన్యానికి, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. వార్తలతో పాటు వెలువడుతున్న కథనాలు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 'మనం' వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ ఎం.రజనీకాంత్, వరంగల్ ఎసిఎం మట్టెవాడ సురేందర్, హన్మకొండ ఆర్‌సి అంకేశ్వరపు కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్: పోచారం

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీని మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ శాఖ ఎంతో ముఖ్యమైందని, వ్యవసాయ రంగం అభివృద్ధికి ఆయన నిరంతరం తపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యవసాయ శాఖను గాడిన పెట్టేందుకు రూ.1.50 లక్షల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల కోరికలను సైతం బడ్జెట్‌లో పొందుపరుస్తున్నామని తెలిపారు. బడుగు బలహీన వర్గాల మద్దతుతోనే తాను ప్రజాప్రతినిధిగా ఎన్నికవుతున్నానని చెప్పారు. 'పుట్టుకను కులం నిర్ణయించదు.. మనం చేసే మంచి పనులు, సేవా కార్యక్రమాలతోనే మనకు గుర్తింపు దొరుకుతుంది' అని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్య, మార్క్ ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, ప్రజాకవి గోరేటి వెంకన్న, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు 11 వరకు రిమాండ్

- చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు నాంపల్లి కోర్టు ఈ నెల 11 వరకు రిమాండ్ విధించింది. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరుతూ మంగళవారం 48 గంటల ఉపవాస దీక్షకు దిగడంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం మంద కృష్ణను అరెస్టు చేసిన పోలీసులు తొలుత హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి చిలకలగూడ పీఎస్‌కు తీసుకెళ్లారు. అనంతరం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లి మంద కృష్ణకు వైద్య పరీక్షలు చేయించారు. ఆ తర్వాత నాంపల్లి కోర్టుకు తీసుకెళ్లి న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. మంద కృష్ణపై 501, 505, 506, 341, 143 సెక్షన్ల కింద పలు అభియోగాలను నమోదు చేశారు. దీంతో కోర్టు ఆయనకు ఈ నెల 11వరకు రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.



జనసేనది ద్వంద్వ వైఖరి

- పవన్.. గోడ మీద పిల్లి
- ఆయనకు ఇక్కడి ప్రజల కష్టాలు తెలియవు
- నిరంతర విద్యుత్ కేసీఆర్ ఘనతకాదు
- ప్రజలపై నెలకు రూ.2వేల కోట్ల భారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, చాడ వెంకటరెడ్డి


హైదరాబాద్, జనవరి 3 (మనం న్యూస్): జనసేన పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తెలంగాణ ప్రజల కష్టాలు తెలియవని, ఆయన గోడ మీద పిల్లిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు 24 గంట విద్యుత్ ఇవ్వడంపై కేసీఆర్‌ను పవన్ ప్రశంసించిన నేపథ్యంలో బుధవారం చాడ విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పవన్ తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా పాల్గొనలేదని, ఇక్కడి ప్రజల కష్టాలపై ఆయనకు అవగాహన లేదని చాడ అన్నారు. 24 గంటల విద్యుత్ కేసీఆర్ ప్రభుత్వంలో ఇస్తున్నట్లు టీఆర్‌ఎస్ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అది కేసీఆర్ ఘనత ఎంత మాత్రం కాదని, ఛత్తీస్‌గడ్ నుంచి యూనిట్‌కు రూ.5 పెట్టి కొనుగోలు చేస్తూ రాష్ట్ర ప్రజలపై నెలకు రూ. 2 వేల కోట్ల భారం మోపుతున్నారని చాడ ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమంలో దళితులు క్రియాశీలక పాత్ర పోషించారని, అటువంటి వారికి న్యాయం చేయాల్సింది పోయి జైళ్లలో పెడుతారా? అని కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంద కృష్ణను అరెస్ట్ చేయడం సరికాదని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు విద్యావంతులు కావాలి: ఐలయ్య

హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): మహిళలు విద్యావంతులుగా మారితేనే స్వేచ్ఛాయుత జీవితం లభిస్తుందని టీ-మాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన సావిత్రిభాయి పూలే 187వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా విద్యకోసం సమాజంతో పోరాడినా వీర వనిత సావిత్రిభాయి పూలే అని అన్నారు. ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ సామాజిక అసమానత్వాన్ని రూపుమాపాలంటే ప్రతి బాలిక ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. పూలే అంబేడ్కర్ జాతర కమిటీ సభ్యుడు సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ... శూద్రులకు రాజ్యాధికారం లభించిందంటే అందకు కారణం పూలే అని అన్నారు. టీఎస్‌పీకే కన్వీనర్ రాములు మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీ-మాస్ నేతలు జాన్‌వెస్లీ, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌కు రెండు పురస్కారాలు

- విద్యార్థికి వీసీ వేణుగోపాల్ రెడ్డి అభినందన




హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) విభాగంలో కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం విద్యార్థులను రెండు అవార్డులు వరించాయి. 2016-17 సంవత్సరానికి సంబంధించి కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అందించిన ఎన్‌ఎస్‌ఎస్ అవార్డులో జేఎన్‌టీయూహెచ్‌కు రెండు పురస్కారాలు దక్కాయి. ఉత్తమ వాలంటీరు పురస్కారం విభాగంలో జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు చెందిన లలిత్ ఆదిత్య, ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్ విభాగంలో అనురాగ్ గ్రూప్‌నకు చెందిన సి.మల్లేశ్‌లు అవార్డులను అందుకున్నారు. వీరితో పాటు జేఎన్‌టీయూ ఐఎస్‌టీకి చెందిన ఏ.ఉమాశంకర్ అనే విద్యార్థికి జాతీయ యువ పురస్కార అవార్డును కేంద్రం ప్రకటించింది. ఈ అవార్డును జైపూర్‌లో జరగబోయే జాతీయ యువజనోత్సవంలో ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను జేఎన్‌టీయూ వీసీ ఏ.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ డాక్టర్ పి.సమ్మూలాల్, ప్రోగాం ఆఫీసర్ పి.ప్రసన్నలు పాల్గొన్నారు. కాగా, వర్సిటీ క్యాంపస్‌లో బుధవారం వీసీ ఏ.వేణుగోపాల్‌రెడ్డి యూనివర్సిటీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, నాన్ టీచింగ్, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయే 8 నెలలు కీలకం

ప్రతి గంటా.. ప్రతిరోజూ విలువైనదే.. ఉద్యోగం కాదు-సామాజిక బాధ్యత

- మరింత పట్టుదలతో పనిచేయాలి
- గడువులోగా పనులు పూర్తిచేయాలి
- ప్రజలు, రైతులను నిరాశ పరచొద్దు
- తెలంగాణ రైతుల గోస తీర్చాలి
- సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టాలి
- జలసౌధలో మంత్రి హరీశ్ రావు

హైదారాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): రాబోయే ఎనిమిది నెలల కాలం ఇరిగేషన్ శాఖకు అత్యంత కీలకమని హరీశ్ రావు అన్నారు. ప్రతి గంట విలువైనదని, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తిచేయాల ని ఇరిగేషన్ అధికారులను కోరారు. బుధవారం నాడు జలసౌధలో తెలంగాణ నీటిపారుదల శాఖ 2018 క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. పదహారు నెలల్లో చేయవలసిన పనులను 8 నెలల్లో చేయడానికి ఇరిగేషన్ అధికార యంత్రాంగం నడుం బిగించాలని కోరారు. మూడున్నరేళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న ఇంజనీర్లు ఈ ఏడాది ఇంకా పట్టుదలతో పని చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సాగునీళ్లొస్తాయని, ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు భావించారన్నారు. ప్రజలను, రైతులను నిరాశకు గురిచేయొద్దని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టవలసిన బాధ్యత ప్రతి ఇంజనీరుకు ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఇంత విస్తృతంగా, సంపూర్ణంగా అవగాహన ఉన్న సీఎం దేశంలో మరెవరూలేరని హరీశ్‌రావు తెలిపారు. భవిష్యత్తులో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించే అవసరం, అవకాశం రాదనీ కాళేశ్వరం ప్రాజెక్టులో పనులు జరుగుతున్న వేగాన్ని స్ఫూర్తిగా తీసుకొని మిగతా ప్రాజెక్టులనూ తొందరగా పూర్తి చేయాలని హరీశ్ రావు సూచించారు. లక్షలాదిమంది రైతుల జీవితాల్లో వెలుగు నింపే జల సంకల్పంలో భాగస్వాములైనందుకు ప్రస్తుత ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లంతా గర్వపడాలని అభిప్రాయపడ్డారు.



సెలవులు పెట్టొద్దు..

ఒక ఉద్యోగంలా కాకుండా సామాజిక బాధ్యతగా డ్యూటీ చేయాలని మంత్రి కోరారు. ఈ ఎనిమిది మాసాలు వీలైనంతవరకు సెలవులు, పండుగదినాలలోనూ పనిచేసి జిల్లాల వారీగా, ప్రాజెక్టుల వారీగా టార్గెట్లను పూర్తి చేయాలని ఇంజనీర్లకు విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటన తర్వాత ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ పై ప్రజల్లో విశ్వాసం కనిపిస్తోందని చెప్పారు. మూడు బ్యారేజీలు, మూడు పంప్‌హౌజ్‌ల పనులు అత్యంత వేగంగా జరుగుతుండడం పట్ల అధికార యంత్రాంగంలోనూ ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమష్టిగా, సమన్వయంతో పనిచేయడంవల్లే కాళేశ్వరం ప్రాజెక్టులో ఆటంకాలను అధిగమించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రాజెక్టు కోసం 8 వేల ఎకరాల భూసేకరణ జరిగిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. పదహారు జిల్లాల్లో కాళేశ్వరంపై ప్రజాభిప్రాయసేకరణ సజావుగా సాగిందన్నారు. డిజైన్ల రూపకల్పనకు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సి.డి.ఓ) సిబ్బంది రాత్రిపగలూ కష్టపడ్డారని హరీశ్ రావు ప్రశంసించారు.

ఈ ఏడాది 312 మంది ఏఈఈలు..

టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి రెండేళ్ళు మిషన్ కాకతీయ కార్యక్రమం, మైనర్ ఇరిగేషన్ విభాగంలో జరిగిన పనుల వల్ల మంచి పేరు వచ్చిందన్నారు. ఇరిగేషన్ శాఖలో గత ఏడాది 382 మంది ఏఈఈలను నియమించగా.. ప్రస్తుతం 312 మంది ఏఈఈలను నియమించబోతున్నట్లు హరీశ్ రావు తెలియజేశారు. తొలి ఏడాదిన్నర కాలం కొత్త రాష్ట్రం బాలారిష్టాలను ఎదుర్కొందని గుర్తుచేశారు. 2019లో ఎన్నికలు జరగనున్నందున సాగునీటి పథకాలకు సంబంధించి 2018 కీలకమన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జోషీ ఒక్కోసారి టైపిస్టుగా, సెక్షన్ క్లర్క్ గాకూడా అవతారమెత్తి పనిచేసుకుపోతున్నారని, ఆయన పనితీరును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జోషి, ఇరిగేషన్ ఈఎన్‌సీలు మురళీధరరావు, నాగేందర్ రావు, అనిల్, లిఫ్ట్ పథకాల సలహాదారు పెంటారెడ్డి, పలువురు సీఈలు, ఎస్‌ఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బుద్వేల్‌లో ఐటీ క్లస్టర్



- త్వరలో సీఎం కేసీఆర్ శంకుస్థాపన
- 30 కంపెనీలతో సర్కారుల చర్చలు
- క్లస్టర్‌తో 1.25 లక్షల మందికి ఉద్యోగాలు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 3 (మనం ప్రతినిధి): హైదరాబాద్లో మరో ఐటీ క్లస్టర్ ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత ముమ్మరం చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ త్వరలో ఏర్పాటు కానున్న బుద్వేల్, రాజేంద్రనగర్ ఐటీ క్లస్టర్ ప్రాంతాల్లో మంత్రి ఈరోజు ఉదయం పర్యటించారు. క్లస్టర్ ఏర్పాటు కోసం సేకరించనున్న పలు స్థలాలను మంత్రి అధికారులతో కలిసి పర్యటించారు. బుద్వేల్ ఐటి క్లస్టర్‌ను, ప్రభ్వుం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, త్వరలోనే



ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయునున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్లస్టర్ లో కంపెనీలను స్థాపించేందుకు ఇప్పటికే 30కిపైగా సంస్థలు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. ఇందులో ఐటీపరిశ్రమలో పేరున్న దేశీయ కంపెనీలతోపాటు అంతర్జాతీయ స్థాయి బహుళజాతి కంపెనీలు రానున్నాయన్నారు. కంపెనీల విజ్ఞప్తి మేరకు వాటి వివరాలను ఇప్పుడే పూర్తిగా చెప్పడం లేదన్నారు. త్వరలోనే అయా కంపెనీలో లాంఛనంగా పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు చేసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటి పరిశ్రమలను నగరంలోని నలు మూలలకు విస్తరించాలన్న దీర్ఘకాలిక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ముందుకు పోతుందన్న మంత్రి.. కొత్త క్లస్టర్ ద్వారా ఐటీ పరిశ్రమ మరింత విస్తరిస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న ఈ క్లస్టర్లో అన్ని మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు. ఇందుకు సంభందించి అత్యుత్తమ మాస్టర్ ప్లాన్ తయారు చేయాన్నారు. ఈ కంపెనీలు పూర్తి స్థాయిలో ఎర్పడ్డాక సూమారు లక్షా పాతిక వేల ఉద్యోగాలు నూతనంగా అందుబాటులోకి వస్తాయన్నారు. రాబోయే 5 ఏళ్లలోపే ఈ కంపెనీలు తమ పూర్తి స్థాయి కార్యకలాపాలను ప్రారంభిస్తాయన్నారు. ప్రస్తుతం రాజేంద్రన గర్లో ఉన్న పలు కార్యకలాపాలులేని పలు ప్రభుత్వ సంస్థలు తమ భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని, వాటి భూయాజమాన్య మార్పులను త్వరలోనే పూర్తిచేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్లస్టర్ పనులను వేగవంతం చేసేందుకు ఐటీ శాఖ, రెవెన్యూ శాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, టీఎస్‌ఐఐసీలతో కలిపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఒక సమావేశం నిర్వహించనున్నారని మంత్రి తెలిపారు.

సానుకూలతే పనిచేసేందుకు స్ఫూరి

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): ప్రభుత్వ విధానాలపై పారిశ్రామిక వర్గాల నుంచి వచ్చే సానుకూల స్పందనలే పనిచేసేందుకు తమకు స్ఫూర్తినిస్తాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ద్వారా ఉద్యోగాల కల్పన లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడుతాయని వివరించారు. టీఎస్ ఐపాస్ పనితీరుపై డెల్ ఎక్సెల్ ఫార్మా సీఈవో రఘుపతి కందారపు బుధవారం కేటీఆర్‌కు ఒక సందేశం పంపారు. ఈ సందేశం ద్వారా గతంలో పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన ప్రయత్నాల్లో వివిధ ప్రభుత్వాలతో తమ అనుభవాలను పంచుకున్నారు. 2016 జూన్‌లో టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు అందుకుని ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేసి, లైసెన్స్‌కోసం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను కలిసినట్టు తెలిపారు. గతంతో పోలిస్తే ఈ డ్రగ్ లైసెన్సింగ్ విధానం అత్యంత సులభంగా, పారదర్శకంగా ఉందన్నారు. కందారపు సందేశానికి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

మరోసారి ఔదార్యం చాటుకున్న మంత్రి

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ముందుంటారు. ఇప్పటికే పలు సార్లు ఈ విషయం నిరూపితమైంది. కేటీఆర్ మరోమారు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రెండేళ్ల చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండగా హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. నిరుపేద కుటుంబం అయినా చిన్నారి ఆరోగ్యం కోసం ఇప్పటికే లక్షా యాభై వేల రూపాయలు ఖర్చు చేశారు. కానీ ఆ చిన్నారి ఆరోగ్యం కుదుట పడలేదు. మరిన్ని అత్యవసర వైద్యసేవలు అందించాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న వినాయకరావు అనే నెటిజన్ .. మంత్రి కేటీఆర్‌కు ఆ వివరాలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు. ఆ చిన్నారిని ఆదుకోవాలని మంత్రిని కోరారు. కేటీఆర్ వెంటనే స్పందించి వివరాలు తెలుసుకొని సాయం అందించారు. మంత్రి గారు ఆదుకోండి అంటూ ఒక ట్వీట్ చేస్తే చాలు.. నేనున్నానంటూ కేటీఆర్ వారికి భరోసా ఇస్తున్నారు. ఇటీవలే మూవీ ఆర్టిస్టులు గుండు హనుమంతరావు, పొట్టి వీరయ్యలను ఆదుకోవాలన్న ట్వీట్‌కు మంత్రి స్పందించిన విషయం తెలిసిందే!

జీవాలకు సేవ చేయడం అదృష్టం

- పశువైద్య సేవలను మెరుగుపరుస్తాం
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): జీవాలకు సేవ చేయడం అభినందనీయమని, రూ.5 వేల కోట్లతో చేపట్టిన గొర్రెల పంపిణీని విజయవంతం చేయడంలో అధికారుల కృషి మరువలేనిదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు. సచివాలయంలో బుధవారం పశుసంవర్ధక శాఖ అధికారుల నూతన డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాలకు సకాలంలో వైద్యం, గ్రాసం అందించాలన్నారు. గొర్రెలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్‌లను పశువైద్యశాలలకు అందించడంతో పాటు జీవాల వద్దకే వెళ్లి వైద్యం అందించేందుకు సంచార పశు వైద్యశాలలను ప్రారంభించుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో పశుసంవర్ధక శాఖ మరింత అభివృద్ధి సాధిస్తుందని మంత్రి దీమా వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషిచేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పశుసంవర్ధక



శాఖలో నూతన నియామకాలు, పదోన్నతులను చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. పశువైద్య సేవలను మెరుగుపర్చడం, ఆస్పత్రుల్లో మౌలిక వసతులను కల్పించేందుకు సీఎం కేసీఆర్ దృష్టి సారించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుతో పశుసంవర్ధక శాఖ ఉన్నతమైన గుర్తింపును సాధించిందని చెప్పారు. ఇటీవల బదిలీ అయిన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్ చందా పశుసంవర్ధక శాఖ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శి రేణుకాదేవి, టీఎస్‌ఎల్‌డీఏ సీఈఓ మంజు వాణి, పశుసంవర్ధక శాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బేరీ బాబు, వీఏఎస్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెంటయ్య, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలో సరుకుల పంపిణీ

- రేషన్ పంపిణీ తేదీల్లో మార్పులు
- జేసీలు పర్యవేక్షణ చేయాలి: సీవీ ఆనంద్

హైదరాబాద్, జనవరి 3(మనం ప్రతినిధి): ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో లబ్దిదారులకు సరుకులు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం సోమాజీగూడలోని ఎర్రమంజిల్ సివిల్ సప్లై భవన్‌లో కమిషనర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఇకపై తెలంగాణలో రేషన్ సరుకుల పంపిణీ తేదీలలో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల 1 నుంచి 15 వరకు లబ్దిదారులకు కచ్చితంగా సరుకులను పంపిణీ చేయాలని అధికారులకు ఆయన నిర్దేశించారు. ఆపై 16 నుంచి 18వరకు రేషన్ డీలర్ల నుంచి డీడీలు స్వీకరించాలని చెప్పారు. సమీక్ష అనంతరం సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి నెల 1 నుంచి రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సరుకులను అందజేసేలా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇందుకోసం భారీ కసరత్తుతో శాఖపరంగా కీలక మార్పులు చేసినట్లు తెలిపారు. రేషన్ సరుకుల పంపిణీలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ పాస్ అమలవుతున్న 25 జిల్లాల్లో ఈ విధానం తక్షణం అమల్లోకి వస్తుందన్నారు. సరుకుల పంపిణీ పూర్తయ్యాక ప్రతీ నెల 16న పౌరసరఫరాల శాఖ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లాలకు సరుకుల కేటాయింపులు జరుపుతామని వివరించారు. ఈ క్రమంలో 16వ తేదీ నుంచి 18 వరకు డీడీలు కట్టడానికి డీలర్లకు గడువు విధించామని అన్నారు. ఈ తేదీల్లో డీడీలు కట్టిన డీలర్ల రిలీజ్ ఆర్డర్లను స్థానిక ఏసిఎస్ఓ/ఎంఆర్ఓలు సంబంధి త మండల స్థాయి నిల్వ కేంద్రానికి వెంటనే పంపించాలన్నారు. రిలీజ్ ఆర్డర్లు అందుకున్న వెంటనే గోదాం ఇన్‌చార్జీలు సరుకుల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తారని తెలిపారు. దీని ప్రకారం 16 నుంచి 30వ తేదీలోపు స్టేజ్-2 రవాణాదారులు మండల స్థాయి నిల్వ కేంద్రాల నుంచి రేషన్ షాపులకు చేరవేస్తారని తెలిపారు. ఈ విధానం సక్రమంగా అమలయ్యేలా జిల్లా జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షించాలని సీవీ ఆనంద్ సూచించారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, జనవరి 4

ఇరాన్‌లో అంతర్యుద్ధం

'నియంతను ఉరితీయండి', 'ముల్లాలు దేవుళ్లలా జీవిస్తుంటే ప్రజలు బికారుల్లా మారారు' అనే నినాదాలతో ఆర్యుల భూమి ఇరాన్ అట్టుడికిపోతోంది. స్వేచ్ఛ కోసం ప్రజా ఉద్యమంతో ప్రస్తుతం ఇరాన్ వణికిపోతోంది. ఇంతవరకు మతరాజ్యంలో ఉన్న ప్రజలు ప్రజాస్వామ్య ఇరాన్ కోసం ఉద్యమిస్తున్నారు. హసన్ రౌహానీ ప్రభుత్వంతో విసుగెత్తడంతో ప్రారంభమైన ఉద్యమానికి అనుకున్నంత ఊపు లేకపోయినా భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. 1979లో అధికారంలో ఉన్న షా మొహమ్మద్ రజాను విప్లవం ద్వారా పదవీచ్యుతుడిని చేసి ఆయతొల్లా రుహల్లా ఖొమైనీ అధికారంలోకి వచ్చి ఇరాన్‌ను మతపరదేశంగా (ఇస్లామిక్ స్టేట్) ప్రకటించారు. దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం దేశవ్యాప్తంగా మళ్లీ స్వేచ్ఛ కోసం ఉద్యమం మొదలైంది. ఈ ఉద్యమంపై భద్రతాదళాలు కఠినవైఖరి అవలంభిస్తున్నాయి. దేశంలో ఇంటర్నెట్, సమాచార వ్యవస్థలను కట్టడిచేయడంతో మిగిలిన ప్రాంతాల్లో ఉద్యమ ప్రభావం గురించి తెలియరాలేదు. ఈ ఉద్యమం స్వేచ్ఛ పట్ల ఇరాన్ ప్రజల ఆకాంక్షలకు నిదర్శనంగా నిలుస్తోంది. 'ఖమేనీ హంతకుడు, ఆయన ప్రభుత్వం పోవాలి' అని తీవ్రస్థాయిలో ప్రజలు నినదించడం గమనించవలసిన అంశం. కుర్దిష్‌ల ప్రాబల్యం కలిగిన ప్రాంతంలో ఉద్యమం మరింత ఉధృతస్థాయిలో జరుగుతోంది. గత కొద్దిరోజులుగా ఇక్కడ కొట్లాటలు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో ఇటీవల భూకంపం సంభవించిన నేపథ్యంలో యంత్రాంగం వైఫల్యం, అవినీతి ఆరోపణలు తలెత్తాయి. ఫలితంగా ఆగ్రహావేశాలతో ఉన్న కుర్దిష్‌లను ఉద్యమం బాటపట్టించాయి. 'ముల్లాల పాలనను వ్యతిరేకించండి' అనే నినాదాలతో టెహ్రాన్ అట్టుడుకుతోంది. ఈ ఉద్యమంలో మహిళలు కూడా పాలుపంచుకుంటున్నారని సమాచారం. వేలాది మంది మహిళలను వేశ్యావృత్తిలో మగ్గిపోతున్నారనే ఆరోపణలున్నాయి.

టెహరాన్ తరువాత పెద్ద నగరమైన మాషాద్ ఇప్పటికే ఉద్యమం హోరులో మునిగిపోయింది. ఎప్పటి నుంచో మాషాద్ నగరం కరుడుగట్టిన మతపర రాజకీయ శక్తులకు అనుకూలంగా ఉన్నది. గత కొద్దికాలంగా ఈ నగర పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చింది. సమాజంలోని అన్ని వర్గాలవారూ ఈ ఉద్యమానికి అనుకూలంగా ఉండడం విశేషం. సంప్రదాయంగా మతాధిపతులున్న ఖోమ్ పవిత్ర నగర ప్రజలు రోడ్డుపెకి వచ్చేశారు. వారు చేస్తున్న నినాదాలను చూస్తుంటే ఇరాన్‌లో మత చాందసవాదులు బెంబేలెత్తుతున్నారు. 'హెజ్‌బుల్లాకు మరణశిక్ష విధించాలి', 'సయద్ ఆలీ (ఖమేనీ) పదవి నుంచి వైదొలగాలి', 'ఇస్లామిక్ రిపబ్లిక్‌కు స్వస్తిచెప్పాలి' వంటి నినాదాలు మిన్నంటుతున్నాయి. ఉద్యమంలో టెహరాన్ యూనివర్శిటీ విద్యార్థులు, యువకులు భాగస్వాములవుతున్నారు. నిరుద్యోగం, పేదరికం ప్రజలను నిరాశా నిస్పృహలకు గురిచేస్తున్నాయి. మరణించైనా పాత ఇరాన్‌ను సాధిస్తామంటూ ప్రజలు వేలాదిగా వీధుల్లోకి వస్తున్నారు. మొత్తం 27 ప్రావిన్స్‌లోని 52 నగరాల్లో ప్రజలు రోడ్డెక్కారు. ఈ ఉద్యమంలో ఇరవైమంది మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. చాలారోజుల తరువాత అధ్యక్షుడు హసన్ రౌహానీ బయటకు రాకతప్పలేదు. ఆయన టెలివిజన్‌లో ప్రసంగిస్తూ, విమర్శించే హక్కు ప్రజలకున్నదని, అదే సమయంలో హింసకు పాల్పడితే ఉద్యమాన్ని అణచివేసేందుకు వెనకాడమని హెచ్చరించారు. మార్పు తీసుకొస్తాననే హామీతో ఐదేళ్ల క్రితం రోహానీ అధికారంలోకి వచ్చారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ పహారా మధ్య జీవించాల్సి రావడం, అడుగడుగునా తలెత్తే ఆంక్షల నుంచి తమను బయటపడేయగలరని ఆయనపై విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలికారు. రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని, మరిన్ని ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తామని, ప్రపంచదేశాల్లో ఒంటరైన ఇరాన్‌ను మళ్లీ పట్టాలెక్కిస్తామని హామీ ఇచ్చిన ఆయన అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచాయి. ఇంతవరకు ఆ హామీలు అమలుకు నోచుకోలేదు. నిరుద్యోగం పెరుగుతోంది; ద్రవ్యోల్బణం అదుపులో ఉందని చెప్పుకుంటున్నా జీవన వ్యయం పెరిగింది. నిత్యావసరాలపై సబ్సిడీలను ఎత్తివేయాలని, పేదల్లో పేదలకు అందుతున్న రాయితీలను రద్దుచేయాలని రౌహని ప్రభుత్వం ఆలోచిస్తోంది.


ఈ పరిణామాలను పశ్చిమ దేశాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఈ ఉద్యమానికి సౌదీ అరేబియా, ఇజ్రాయిల్, అమెరికా మద్దతు పలుకుతున్నాయి. ఇటీవల ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో సామ్రాజ్యవాద పశ్చిమ దేశాల నేరాలను అంత త్వరగా ఇరాన్ ప్రజలు మరిచిపోతారనుకోవడం భ్రమే కాగలదు. ఫలితంగా ఇరాన్‌లో తమ ప్రాబల్యం పెంచుకోవడం ద్వారా తమ పెత్తనాన్ని మరింత బలపరుచుకోవలనుకుంటున్న ట్రంప్ ఆశలు నెరవేరే సూచనలు లేవు. ఇరాన్‌లో తలెత్తిన ఉద్యమ ఉధృతి తగ్గినా మొలకెత్తిన స్వేచ్ఛా నినాదం మాత్రం అంత తేలిగ్గా సమసిపోదు. ఇరాన్ సంక్షోభంలో మునిగిన సమయంలో కొత్తతరం స్వేచ్ఛకోసం నినదించడం ప్రారంభమే అయినా విస్మరించదగినది కాదు. ఒక్క అడుగే కోట్లాది మందికి మార్గదర్శకం కాగలదు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు రద్దు చేయాలి

ఎఫ్ఆర్‌డీఐ బిల్లు విషయంలో ప్రభుత్వం ప్రజలకు నిజాలు చెప్పకుండా మోసం చేస్తున్నదని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.రాంబాబు చెప్పారు. వి.యస్.బోస్ అధ్యక్షతన రిటైర్డ్ ఇండిస్ట్రియల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రివ్వా) ఆధ్వర్యంలో ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం ఎఐటియుసి ఆఫీసు, ఎస్.ఎన్.రెడ్డి భవన్‌లో బుధవారం జరిగింది. బిల్లులోని 49, 52, 53 క్లాజులు డిపాజిటర్ల హక్కులు హరించేవిగా ఉన్నాయని, ప్రమాదకరమైనవని చెప్పారు. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా ఇప్పుడు కొత్తగా ''ఎఫ్ఆర్‌డీఐ'' చట్టం తేవటంలో కుట్ర ఉన్నదని, బ్యాంకు రుణాలు ఎగ్గొట్టినవారే పార్లమెంటులో ఉన్నారని వారు ఏ రకంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తారో వేచి చూడాలని అన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, బ్యాంకుల విలీనం లాంటి చర్య లతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయటమేకాక మన డబ్బు ను మనం వాడుకోవటానికి బ్యాంకుల నుండి తీసుకునే అవకాశం లేకుండా చేసి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నదని, బ్యాంకులలో జరుగుతున్న అవకతవకలు పరిశీలించటానికి ప్రస్తుతం ''డిపాజిట్, ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, 1961'' చట్టం ఉండగా దాని స్థానంలో కొత్తగా ఎఫ్ఆర్‌డిఐ చట్టం తీసుకురావటంలో అర్థంలేదని అన్నారు. ఈ చట్టాన్ని నిలువరించకపోతే బ్యాంకులపై ప్రజలకు నమ్మకాలుపోయి సమాజంలో ఆర్థిక సంక్షోభం నెలకొనే పరిస్థితి ఉందని చెప్పారు.

ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు మాట్లాడుతూ ప్రపంచంలో 2008 సంవత్సరంలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ఇంకా కొనసాగుతూనే ఉన్నదని, దాని నుంచి బయటపడే పరిస్థితి లేక పెట్టుబడిదారులు అనేకమార్గాలు వెతుకుతున్నారని చెప్పారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ, బ్యాంకు డిపాజిటర్ల హక్కులు కాపాడటానికి ఎఐటియుసి ముందుండి పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు. సమావేశం ఈ తీర్మానాలు చేసింది. 1) డిపాజిటర్ల డబ్బుపై వారికే హక్కు ఉండాలని, 2) డిపాజిట్లకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని, 3) విశ్రాంతి కార్మికుల డిపాజిట్లకు 12% వడ్డీ చెల్లించాలని, 4) విశ్రాంతి కార్మికులకు ఆరోగ్య కార్డు పంపిణీ చేసి వైద్య సౌకర్యం కల్పించాలని, 5) డిపాజిట్లు హరించే ఎఫ్ఆర్‌డీఐ చట్టాన్ని రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించింది.

- వి.యస్.బోస్
ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ



మంచిమాట



'అన్నింటికీ మించిన తప్పు.. అన్యాయం, అక్రమాలతో రాజీపడటమే...'

- నేతాజీ

సామాజిక వర్తమానమే కర్తవ్యం!



'ఆలోచనలమీద నిఘా వేసే లఫంగులు, పోలీసుల కొత్తపేరు పుస్తకాల దొంగలు...' పోలీసులు విరసం రచయితల ఇళ్లమీద దాడిచేసి, పుస్తకాలెత్తుకుపోయి, తీవ్రవాద సాహిత్యం అనే పేరుతో కేసులు పెట్టిన రోజుల్లో (డబ్భై దశకం) శ్రీశ్రీ రాసిన కవితా పదాలివి! శ్రీశ్రీ కేవలం పోలీసుల్నే లఫంగులన్నట్టుగా రాసారు. అయితే పోలీసులు, న్యాయ మూర్తులు, కార్య నిర్వాహక బురాక్రాట్లు, రాజకీయవేత్తలూ కట్టగలసి పాలకవర్గమనే దోపిడీవర్గానికి ఊడిగం చేస్తారు. వీరికి వత్తాసుగా పెట్టుబడికీ, కట్టుకథలకూ పుట్టిన పుత్రికలు పత్రికలు సైతం పాలక వర్గాలకు భావజాలపరంగా సేవలందించి ఊడిగం చేస్తాయి! తమ దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎక్కడన్నా ప్రజాసమూహాలు తిరుగు బాటు చేస్తే పాలకవర్గం ఆ తిరుగుబాట్లను పోలీస్ బలగాలతో దుర్మా ర్గంగా, పాశవికంగా అణచివేయడమూ, ఆ అణచివేత రాజ్యాంగ బద్ధమెన దేనని మిగిలిన తన అంగాల ద్వారా ప్రచారం చేసుకోవడమూ జరుగు తోంది! అనాదిగా రాజ్యవ్యతిరేక శక్తులమీద, ఆ శక్తులకు మద్దతిచ్చే భావజాల శక్తుల మీదా ఈ దాడి జరుగుతున్నదే! హిందూమతోన్మాద ఆరెస్సెస్ గుంపు! పోలీసులు చేయలేని పనుల్ని లేదా త్వరితంగా చేయలేని పనుల్ని ఈ గుంపు చేస్తుంది. దీని వలన అదనపు ప్రయోజనమే మంటే రాజ్యాంగబద్ధంగా వుండాల్సిన, వున్నట్టు నటించాల్సిన ప్రభుత్వా లకు ఒకింత ఇబ్బందనిపించే పనులను, ఈ గుంపు చేయడం వలన రాజ్యం మీద బురద పడదు (పడదని కనీసం అనుకోవడం, పడినా దబాయించడం చేయొచ్చు). గతంలోని కమలనాథులకు భిన్నంగా, రాజ్యాన్ని నడపగలిగే ధీరుడిగా నరేంద్ర మోదీ దర్శనమయ్యాడు. మేకిన్ ఇండియా, స్వచ్ఛ భారత్, నోట్లరద్దు, జీఎస్టీ, భూసేకరణ చట్ట సవరణ, కార్మికచట్టాల సవరణ, గ్యాస్‌సబ్సిడీ రద్దు ఏవేవో చేస్తూ, అదంతా దేశాభివృద్ధి కోసమేనని నమ్మ బలుకుతున్నాడు. దేశంలోని వనరులను (ప్రకృతి వనరులు, మానవ వనరులు) కార్పొరేట్ శక్తుల పళ్లాలలో వడ్డిస్తున్నాడు!

ఇంకోవైపు గ్రామాల్లో పాతకాలపు విలువలకు కొత్త అర్థాలను కల్పిస్తూ, అంటరానితనం, మూఢనమ్మకాలు, స్త్రీలకు పాతివ్రత్య విలువలు, సాంప్రదాయ వస్త్రధారణ, కుల కట్టుబాట్లు, హిందూ మతోన్మాదం, పరమత వ్యతిరేకత వంటి వాటిని ఆరెస్సెస్ గుంపుతో ప్రబలంగా ప్రచారం చేస్తూ భూస్వామ్య విధానాన్ని గ్రామాల్లో బలీయం చేస్తున్నాడు! మోదీ అధికారంలోకి వచ్చాక, ఒకవైపు కార్పొరేట్లకు వనరుల అప్పగింత చర్యలు వేగవంతమయ్యాయి! ఇంకోవైపు వీటినుంచి దృష్టి మళ్లించే గోమాత, గొడ్డు మాంసం, ముస్లిం ఉగ్రవాదం, దేశభక్తి, సరిహద్దులో యుద్ధం, కాశ్మీర్ లోయలో హింస, జనగణమన గీతాలాపన, భారతమాత, హిందూ పురాణాల విశిష్టతలూ వగైరాల్లో తమదైన ఆలోచనలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలతో పాటు సోషల్ మీడియా లోనూ పూనకమెత్తిన ప్రచారం విజృంభిస్తోంది! ఒకటేమో...కార్పొరేట్ శక్తి, మరొకటేమో ఫ్యూడల్ భావజాల ఆరెస్సెస్ శక్తీ! ఈ రెండు ఆయుధాలతో మోదీ అధికారంలో కొనసాగాలని భావిస్తున్నాడు.

ప్రపంచీకరణ భూమికగా సామాజిక విలువలూ, నీతులూ కొత్త అర్థాలను ప్రబోధించసాగాయి. కార్పొరేట్ విద్యాలయాలూ, ఆసుపత్రులూ, స్టార్ హెటళ్లూ...వెలిసాయి! సేవారంగం పెద్ద వ్యాపార రంగమయ్యింది! ఉత్పత్తేతర సంపాదనా మార్గాలతో విలువల రాహిత్య సంపన్న వర్గమొకటి యేర్పడింది! సమాజంలో పోటీతత్త్వం నెలకొంది. పక్కవాడిని జయించడమనేది గెలుపుగా, ఎదుగుదలగా అర్థాన్నిస్తోంది! గెలిచినవాడు, ఎదిగినవాడూ పక్కవాడి మీద, సాటి మానవుడి మీద, పర మతమ్మీద, పరభాషమీద, పర ప్రాంతమ్మీద అసహనంతో రగిలిపోవడమారంభించాడు! ఈ సామాజిక స్థితి మోదీకి ఉపకరించింది! కేంద్రంలో మోదీ, ఎక్కువ రాష్ట్రాల్లో మోదీ మద్దతుదారులూ పాలన సాగిస్తున్నారు. ఏ కొద్ది రాష్ట్రాల్లో మోదీకి వ్యతిరేకులు అధికారంలో వున్నా వాళ్లు కార్పొరేట్లకు వ్యతిరేకులు కారు, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకులు కారు! గనక మోదీకి భిన్నమయిన పాలనేదీ ఏ రాష్ట్రంలోనా లేదు! ఆరెస్సెస్‌కు భిన్నమయిన భావజాలమేదీ యే ప్రాంతంలోనా బతికి బట్ట కట్ట వీలులేదు! ఇదీ నడుస్తోన్న చరిత్ర!

సంపాదనాపరులూ, అధికారంలోనున్నవారూ, పాలక వర్గాలూ యే చిన్నపాటి అసమ్మతినిగూడా సహించలేని అసహనంతో వుండడాన్ని వర్తమానంలో అనేక ఘటనలు ఎత్తిచూపుతున్నాయి. నిజాయితీగా పనిచేసే ఉద్యోగులు, అధికారులూ వేధింపులకు గురవడం, నిజాయితీగా వార్తలు రాసే జర్నలిస్టులు, రాజ్యాంగాన్ని ధిక్కరించే చర్యలు చేయొద్దని చెప్పే ప్రజాస్వామికవాదులు దాడులకు గురవడం, ఆధిపత్యవర్గాల అసహనపూరిత, అహంకారపూరిత ధోరణలే! కలాల మీదనూ,



> భౌతిక ఘర్షణలూ, దాడులూ చరిత్ర నిండా! విశ్వాసాలకోసం, అభిప్రాయాల కోసం ఎందరో తమ విలువయిన ప్రాణాలనర్పించేరు! ఇప్పటికీ అర్పించక తప్పటంలేదు! నిన్నటికి గౌరీ లంకేష్! ప్రకృతివనరుల సంరక్షణ, అభివృద్ధి పేరిట జరిపే విస్థాపన వ్యతిరేకతా; తిండీ, బట్టా, మతం వంటి వ్యక్తిగత హక్కులమీదా, స్వేచ్ఛ మీదా జరిగే దాడుల, మతోన్మాదచర్యల వ్యతిరేకతా లక్ష్యాలుగానూ నిర్దేశించుకొని రచయితలు ప్రాంతాలవారీ నిర్మాణాలతో దేశవ్యాప్త ఐక్యనిర్మాణం ఒకటి యేర్పాటు చేయాల్సిన సందర్భమిది.

భావజాలమ్మీదనూ మాత్రమే దాడులుగా వీటిని పరిమితం చేసి చూడడం, మాట్లాడడం పాక్షికమవుతుంది! ఈ నేపథ్యంలో రచయితల వర్తమాన పాత్రను నిర్దేశించుకోవాలి. అక్షరాలను హత్య చేయలేవు, భావాలను అరికట్టలేరు, భేరీని జోకొట్టలేరు వంటి కవిత్వ నినాదాల కంటే, వాస్తవ స్థితిని విశ్లేషించుకొని ఐక్యసంఘటన కోసం ప్రయత్నించాలి. కనీసం భావజాల రంగంలో యీ ఐక్యసంఘటన యిప్పటి తక్షణావసరం! రచన అనేది వైయక్తిక వ్యవహారంగా యీ దేశంలోనే కాదు అన్ని దేశాల్లోనా గుర్తించుతున్నారుగానీ, ఆదిలో సాహిత్యం, కళలూ సామూహికమే!

సామూహిక తత్త్వమేనాడయితే తొలగి, వ్యక్తిగత ఆస్తి ప్రవేశించిందో అప్పుడే ఏ మేరకో రచన వైయక్తికమై ఉండొచ్చు. అచ్చుయంత్ర సదుపాయమొచ్చాక, పత్రిక వచ్చాక అది మరింతగా వైయక్తిక వ్యవహారమయినాది! కానీ రచనకు సంబంధించిన వస్తువు, భాష, పాత్రలూ, సంభాషణలూ సమూహంలోంచీ, సమాజంలోంచీ మాత్రమే లభిస్తాయి! సమూహం నుంచీ, సమాజం నుంచీ స్వీకరించి రచయిత వ్యక్తిగా సాహిత్యీకరిస్తాడు. సారాంశంలో రచననేది... సమూహానిదీ, సమాజానిదీ! గనక యే సమూహాలనూ, సమాజాలనూ రచయిత చిత్రిస్తాడో ఆ సమూహాలనూ, సమాజాన్నీ రచయిత అనుసంధానించుకోవాలి. సమూహాలు వేరూ...రచయిత వేరూ అన్నట్టుండగూడదు! రచన వరకే తన బాధ్యతా రచనకు సంబంధించిన జీవితం, ఆ జీవితం పడే సంఘర్షణ, పోరాటం తనకు సంబంధం లేదనుకుంటే, నిబద్ధత కోల్పోవడమేకాదు, సమూహానికి అలీనంగా వుంటానన్న పేరుతో ఒంటరవుతాడు! అప్పుడు రచనల్లోని భావజాలాన్ని వ్యతిరేకించే శక్తులు రచయిత మీద సులువుగా దాడి చేస్తాయి! అయితే ఇంకోవైపు సమూహాలతో నిమగ్నత పేరుతో సమూహాలను ఉద్యమింపజేసే రాజకీయ పార్టీల కార్యాచరణ తమ కార్యాచరణగా, రాజకీయ క్షేత్రం తమ కార్యక్షేత్రంగా రచయితలు వుంటున్నారు. ఫలితంగా ప్రజా ఉద్యమాలలో నిమగ్నమయే రచయితలు గూడా రాజకీయపార్టీల్లా గ్రూపులుగా వుంటున్నారు. నిజానికి దేశంలోని అనేకప్రాంతాల్లో పాలకుల విధ్వంసక అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా, కొన్ని చోట్ల రాజకీయాతీతంగా, కొన్ని చోట్ల ప్రతిపక్ష పార్లమెంటరీ పార్టీ పార్టీల నాయకత్వంలో, మరికొన్ని చోట్ల సీపీఐ నుంచి ఎంఎల్‌దాకా గల వామపక్షపార్టీల నాయక త్వంలో ప్రజలు పోరాడుతున్నారు. గనక ఈ అన్ని పోరాటాలకు సమ ర్థనగా, ప్రజలకు అండగా సాహిత్య, కళాక్షేత్రాలే తమ కార్యక్షేత్రాలుగా రచయితలు సాహిత్య, కళారంగాలను నిలపాల్సివుంది.

భౌతిక ఘర్షణలూ, దాడులూ చరిత్ర నిండా! విశ్వాసాలకోసం, అభిప్రాయాల కోసం ఎందరో తమ విలువయిన ప్రాణాలనర్పించారు! ఇప్పటికీ అర్పించక తప్పటంలేదు! నిన్నటికి గౌరీ లంకేష్! ముఖ్యంగా దేశంలోని ప్రకృతివనరులున్న అటవీప్రాంతాన్నీ, తీర ప్రాంతాన్నీ, సారవంత మైదాన ప్రాంతాన్నీ, ఖనిజాల వెలికితీతకు, గనుల దొలిచివేతకూ, సెజ్‌లకూ, రోడ్ల వెడల్పుకూ, స్మార్ట్ నగరీకరణకూ రకరకాల అభివృద్ధి పథకాల పేరిట, అచ్ఛేదిన్ పేరిట, భారత్ మే బనాయే పేరిట కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పుతున్నాడు మోదీ! ప్రజల బాధలకు, సమస్యలకు గతపాలకుల పాలన కారణమని ఒకవైపు నమ్మిస్తూ, మరోవైపు ప్రజలను పక్కదారి పట్టించే సమస్యలను ముందుకు తెస్తున్నాడు. దేశభక్త, హిందూ రక్షక ఘర్షణలుగా సామాన్య జనాన్ని నమ్మిస్తున్నాడు. మితిమీరిన ఆరెస్సెస్ హింసను సమాజం ప్రశ్నిస్తే.. మౌనం వహిస్తున్నాడు! ఈ మౌనాన్ని ప్రశ్నించినా, కపటపు సుద్దుల్ని యెత్తిచూపినా దాడులు జరుగుతున్నాయి! పాలక వర్గాలాడుతున్న పాచికలాటలివి!

పాలక వర్గాలు ఏ మౌళిక సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించాలని చూస్తున్నాయో రచయితలు సరిగ్గా ఆ మౌళిక సమస్యల మీద కలాలను కదిలించాలి! అదీ సమష్టిగా కదిలించాలి. ఖనిజాలకూ, గనులకూ ఆదివాసీ ప్రాంతాన్ని, తీర ప్రాంతాన్ని, మైదాన ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్ప జెప్పడంలో ప్రజలకు, దేశానికీ జరిగే నష్టాన్నీ; కార్పొరేట్లకు కలిగే లాభాల్నీ వివరించే సాహిత్యం సమష్టిగా సృష్టించాలి. నగరీకరణ పేరిట నగరంలోని పేదలను నగరాలకు దూరంగా తరిమేసే దుర్మార్గం మీద, నగరాన్ని విలాస జీవుల ఆవాసం చేయడమ్మీద సాహిత్య సృష్టి జరగాలి.

ప్రకృతివనరుల సంరక్షణ, అభివృద్ధి పేరిట జరిపే విస్థాపన వ్యతిరేకతా; తిండీ, బట్టా, మతం వంటి వ్యక్తిగత హక్కులమీదా, స్వేచ్ఛ మీదా జరిగే దాడుల, మతోన్మాదచర్యల వ్యతిరేకతా లక్ష్యాలుగానూ నిర్దేశించుకొని రచయితలు ప్రాంతాలవారీ నిర్మాణాలతో దేశవ్యాప్త ఐక్యనిర్మాణం ఒకటి యేర్పాటు చేయాల్సిన సందర్భమిది. అదిమాత్రమే పాలకవర్గ హింసనూ, దోపిడీనీ, ఆరెస్సెస్ హింసోన్మాదాన్నీ అడ్డుకొనడం, నివారించడం చేయగలదు!

◆ అట్టాడ అప్పల్నాయుడు
9440031961

ప్రతిపక్షాల తీరు మారితేనే పురోగతి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు లక్ష్యమే నీళ్లు, నిధులు, నియామకాలు. కేసీఆర్ నాయకత్వంలో 14 ఏండ్ల సుదీర్ఘ మలిదశ ఉద్యమం మూలంగా నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఏర్పడింది. వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన సమయంలోనే కేసీఆర్ తన లక్ష్యాన్ని విస్పష్టంగా చాటి చెప్పారు. దురదృష్టవశాత్తు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన మూడోరోజు నుంచే విపక్షాలు రాజకీయం మొదలుపెట్టాయి. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాల కోసం పక్కనున్న ఆంధ్రప్రదేశ్, కేంద్రంలో ఉన్న ఎన్డీఎ ప్రభుత్వాలను నిలదీయడం మానేసి కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలంటూ చిత్రీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. కేసీఆర్ ప్రభు త్వం ఏర్పాటైనప్పటి నుంచే ఓ పార్టీ రైతుల ఆత్మహత్యలంటూ రోడ్డెక్కితే ఇంకో పార్టీ విద్యుత్ ఏదంటూ కదనానికి సిద్ధమైంది. ఆంధ్రా నుంచి తెలంగాణకు రావాల్సిన వాటా ఇవ్వనని చంద్రబాబు అంటే ఆయనను అడగడం మానేసి తెలంగాణలో ఉన్న ఆయన పార్టీశాఖకు చెందిన నేతలు తెలంగాణ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయడం మొదలుపెట్టారు. ఇక కేంద్రం నుంచి తెలం గాణకు సహకారం అందకుండా ఎవరికి తోచిన విధం గా వారు పావులు కదిపారు. 14 ఏండ్ల సుదీర్ఘ ఉద్య మంలో అనేక ఎత్తు పల్లాలు చవిచూసిన కేసీఆర్ వీట న్నింటిని ఎదుర్కొంటూనే ప్రణాళికాబద్ధంగా ముందు కు వెళ్లారు. కేంద్రానికి అంశాలవారీ మద్దతు ప్రకటించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు.

60 ఏండ్లు అధికారం అనుభవించిన విపక్షాలు ఇన్నేండ్లు తెలంగాణ వెనుకబాటుతనానికి కారణమైనందుకు ప్రజలకు సమాధానం చెప్పాల్సింది పోయి కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ పోతుంటే వారి వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తూనే కేసీఆర్ తెలంగాణ భవిష్యత్‌ను నిర్మిస్తూ వెళ్తున్నారు. దురదృష్టం ఏమిటంటే తెలంగాణ అభివృద్ధికి సహకరించాల్సిన విపక్షాలు మోకాలడ్డేందుకు ప్రయత్నిస్తుండడం గమనార్హం. కానీ ఆ ప్రయత్నంలోనూ వారు పరాజయం పాలవడం తెలంగాణ విజయంగా చెప్పాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ 60 ఏండ్ల పాలనలో నిర్లక్ష్యం చేయబడ్డ చెరువులను మిషన్ కాకతీయతో పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఐదేండ్లలో తెలంగాణలోని 46,531 చెరువులను మిషన్ కాకతీయ ప్రాజెక్టులో భాగంగా పునరుద్ధరించనున్నారు. ఇప్పటికే మూడు దశలు పూర్తిచేసుకున్న ఈ పథకం నాలుగో దశ పనులు త్వరలో మొదలుకానున్నాయి. మిషన్ కాక తీయ ఫలితాలు తెలంగాణలో అప్పుడే కనిపిస్తున్నాయి. పునరుద్ధరించిన చెరువులకు వర్షాలు, గత ప్రభుత్వాలలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి నీటితో నింపుతున్నారు.


> ప్రణాళికాబద్ధంగా తెలంగాణలోని అనేక పథకాలకు దేశంలోని మరే రాష్ట్రమూ సాధించలేని విధంగా గత మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ రెండువేలకుపైగా అనుమతులు సాధించి రికార్డు సృష్టించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి పథకాలకు వ్యతిరేకంగా విపక్షాలు కోర్టుల నుంచి అడ్డుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి కేంద్రం నుంచి అనుమతులు సాధించడం ప్రతిపక్షాలకు అతి పెద్ద పరాభవం.

దీంతో రైతులు గత రెండేళ్లుగా యాసంగి సాగు మొదలు పెట్టారు. వనపర్తి జిల్లా గత ఏడాది దేశంలోనే వేరుశనగ పంట అత్యధికంగా పండించిన జిల్లాగా నిలిచింది. ఈసారి నాగర్ కర్నూలు, వనపర్తి జిల్లాలు ఈ రికార్డు కొరకు పోటీ పడుతుండడం విశేషం. సమైక్య పాలనలో తాగునీరు అందక నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ బారినపడింది. దశాబ్దాల పాటు ప్రభుత్వాలు ఫ్లోరోసిస్ భూతాన్ని కేవలం ఎన్నికల హామీగా ఓట్లు దండుకున్నాయి తప్పితే నీళ్లిచ్చిన పాపాన పోలేదు. సగటు మనిషి కనీస అవసరాలు కూడు, గూడు, నీరు, విద్య, వైద్యం. ఈ క్రమంలో భాగంగా కేసీఆర్ మిషన్ భగీరథకు శ్రీకారం చుట్టారు. ఫ్లోరోసిస్ బారినపడిన నల్లగొండనే కాదు, తెలంగాణ మొత్తానికి స్వచ్ఛమైన తాగునీరు లక్ష్యంగా రూ .42,000 కోట్ల రూపాయలతో కృష్ణ, గోదావరి నదులతో పాటు ఇతర జలాశయాలను కలిపి, 1.30 లక్షల కిలోమీటర్లు పైపులైన్లతో రాష్ట్రంలోని 24,000 గ్రామాలు, 65 పట్టణాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ ప్రారంభించారు. వచ్చే ఏడాది ఈ పథకం ఫలి తాలు తెలంగాణలోని గ్రామాలకు అందనున్నా యి. ఇలాంటి పథకం ఇప్పటివరకు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చేపట్టలేదు. విద్యారంగంలో విప్లవా త్మక మార్పులకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. వసతిగృహాలలో విద్యార్థులకు సన్నబియ్యం అన్నం ప్రారంభించారు. కార్పొరేట్ విద్యా వ్యవస్థను ధీటుగా ఎదుర్కొనేందుకు వ్యూహాత్మ కంగా గురుకుల పాఠశాలల సంఖ్య పెంచారు. ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు రూ. 80,500 కోట్ల అంచనా వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. దక్షిణ తెలంగాణ సస్యశ్యా మలం చేయడం లక్ష్యంగా 35 వేల కోట్ల రూపాయలతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణమవుతోంది. గత మూడున్నరేళ్లలో కేసీఆర్ రెండువేలకు పైగా అనుమతులు సాధించి రికార్డు సృష్టించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ రాష్ట్రమూ ఇంత తక్కువ సమయంలో ఇన్ని అనుమతులు సాధించిన దాఖలాలు లేవు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి పథకాలకు వ్యతిరేకంగా విపక్షాలు కోర్టుల నుంచి అడ్డుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి కేంద్రం నుంచి అనుమతులు సాధించడం ప్రతిపక్షాలకు అతి పెద్ద పరాభవం. తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న కేసీఆర్‌తో పోటీపడలేక విపక్షాలు విలువలు వదిలి రాజకీయాలు చేస్తున్నాయి. వారి తీరులో మార్పు రాకుంటే ప్రజాక్షేత్రంలో ఘోర పరాభవం ఖాయం.

◆ సందీప్ రెడ్డి కొత్తపల్లి

సృష్టికర్త

పద్మనయన వికసిత
పున్నమి వెన్నెలతో వికసించిన
మనోనేత్ర మహానుభావుడిగా
తల్లి అలజడి అల్లర్లతో
నీ కేరింతలు కలుపుతూ
లోకంలో కాకుల కూతల మధ్య
వెలిసినావోయి... లూయీ...!
నువ్వే అంధుల వెలుగుకు దారివోయి
లూయీ..!
బతుకంత అసురుల వర్షం మధ్య
అందం ఆనందం తెలియకుండా చేసిన
లోకానికి నీ గుణపాఠం
జీవిత సాగర సారమోయి లూయీ..!
నువ్వే అంధులకు వెలుగు జ్యోతివోయి
లూయీ..!



కవిత

ఆ ఆరు చుక్కలే
నవతరానికి యువదీపాలోయి లూయీ..!
లోకమలుపుల మల్లెల మార్గాలోయి లూయీ..!
ఈ ఆరుచుక్కలేనోయి లూయీ...!
అందుకే గర్వంగా అంటున్నానోయి
అంధుల వెలుగు ప్రధాత సృష్టికర్తవోయి
లూయీ..!
అందుకే అంటున్న అంధుల ఆరాధ్య దైవమనోయి లూయీ..!

- చిక్క హరీష్ కుమార్
9885159138

మనం
కుటుంబం
గురువారం, 4 జనవరి 2018
www.manamnews.com

మెట్రో నగరాల్లో బైక్ ట్యాక్సీలు రయ్ రయ్‌మని దూసుకు పోతున్నాయి. అందునా 'ఫర్ వుమెన్, బై వుమెన్ బాక్సీస్' పేరుతో అందుబాటులోకి వచ్చిన ట్యాక్సీ బైకులు మహిళలను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. పిలియన్ రైడర్‌ను గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చి, ఇందుకు ప్రతిఫలంగా డబ్బును వసూలుచేసే బైక్ ట్యాక్సీలనే బాక్సీ పేరుతో పిలుస్తున్నారు.





బాక్సీలతో భద్రత

ఓవైపు ఒంటరిగా టూ వీలర్‌పై ఒంటరిగా వెళ్లే అమ్మాయికి రక్షణగా పిలియన్ రైడర్‌గా మరో అమ్మాయి తోడు ఉండటం ఉభయకుశలోపరిగా ఉంటోంది. పైపెచ్చు ఈ ట్రాఫిక్ చక్రబంధంలో కారుపైకంటే బైక్‌పై సులువుగా ప్రయాణించే ఛాన్స్ ఉండటంతో వీటికి తక్కువ సమయంలోనే మంచి ఆదరణలభిస్తోంది.



24/7 వీల్స్

వుమెన్స్ బైక్ ట్యాకీలు రేయింబవళ్లు అందుబాటులో ఉండటంవల్ల మహిళలు ఏ సమయంలోనైనా వీటిని వినియోగించుకునే సౌలభ్యం ఉంటోంది. పైపెచ్చు ట్యాక్సీతో పోల్చితే టూ వీలర్ ట్యాక్సీ చార్జీలు చాలా చవకకావడంతో ఈ పింక్ బాక్సీలను నమ్ముకునే అమ్మాయిల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. రాజధాని న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కతాతోపాటు చెన్నై, త్రివేంద్రంతో పాటు ఇతర నగరాల్లోనూ బాక్సీ సర్వీసులున్నాయి. ఓలా, ఉబర్‌తో సంస్థలు బ్యాక్సీ సర్వీసులను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చాయి.

ఎకో ఫ్రెండ్లీ

సాధారణంగా ఇలా నడుస్తున్న బాక్సీల్లో అత్యధిక వాహనాలు ఈ-బైకులే కావడంతో ఎలక్ట్రానిక్ బైకులతో ఎటువంటి కాలుష్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం లేదు. అంటే ఇవి ఈ-బైకులు కావడంతో ఎకో ఫ్రెండ్లీగా ఉంటాయి. వీటిని స్వయం ఉపాధి పథకాలకిందకూడా తీసుకునే అవకాశం ఉండడంతో మధ్యతరగతి అమ్మాయిలు బాక్సీలపట్ల మొగ్గుచూపుతున్నారు. కచ్చితంగా ఇన్ని గంటలని కాకుండా ఓపిక ఉన్నంతసేపు బండిని నడుపుకుంటూ కళ్లచూస్తున్న లాభాలు బాక్సీ డ్రైవర్లకు సంతృప్తినిస్తున్నాయి.



చక్రాలే జీవనం

చక్రం అంటే ప్రగతికి చిహ్నం. అలాంటి ఈ చక్రంతో మహిళా సాధికారతకు ఎంతో అవినాభావ సంబంధముంది. స్వయంగా తమకాళ్లపై తాము నిలదొక్కుకుని, కుటుంబాలకు ఆర్థిక అండదండలు అందించేందుకు ఇలాంటి బాక్సీలు దిగువ, మధ్యతరగతి ప్రజలకు తోడ్పడుతున్నాయి. ఆర్థికంగా మహిళా స్వావలంభన చేకూరాలంటే, ఆర్థికంగా పరిపుష్టి కావడానికి ఇలాంటి ఉపాధిమార్గాలు చాలా అవసరం. ఫర్ వుమెన్ బై వుమెన్ అంటూ నగరాల్లో అందుబాటులోకి వచ్చిన సర్వీసులు ఆధునిక అమ్మాయిలకు ఆసరాగా ఉంటున్నాయి. అందుకే ప్రొఫెసర్ మధు పూర్ణిమా కిష్వర్ లాంటి ప్రముఖులంతా షీ బైకులను ఆదరిస్తున్నారు. వుమెన్ ఆన్ వీల్స్‌లో భాగంగా ఎమర్జెన్సీ హెల్త్ కిట్‌తోపాటు, జీపీఎస్ సిస్టంతో ఉన్న బాక్సీలతో మన మహిళలు సురక్షితమైన ప్రయాణం చేస్తుండడం అభినందనీయం కదూ.

బతుకు 'బండి'

ఈ వుమెన్ ఆన్ వీల్స్ కాన్సెప్ట్‌తో పెద్దగా చదువురాని మహిళలుకూడా ఉపాధి పొందుతున్నారు. కొంతమంది వాహన తయారీదారులు నిరుపేద మహిళలను ఎంపికచేసి, శిక్షణనిచ్చి, వాహనం కొనేందుకు సబ్సిడీతో కూడిన లోన్ ఇచ్చి, ఉపాధి కల్పిస్తున్నాయి. దీంతో తమకు వెసులుబాటున్న సమయంలో వీరు బండి నడుపుతూ, బతుకుబండిని లాగిస్తున్నారు. ఇక డ్రైవింగ్ అంటే ఇష్టపడేవారి పాలిట ఇది సాక్షాత్తూ అందివచ్చిన అవకాశమే. 'వృత్తి, ప్రవృత్తి రెండూ ఒకటే అయితే వచ్చే ఆనందం డబ్బుతో కొనలేనిది కదా' అంటుంది 8వ తరగతితో చదువు ఆపేసిన బర్మన్ అనే ఢిల్లీ అమ్మాయి. 'కనీసం నాకు వివాహం అయ్యేవరకైనా ఈ బండిని నడుపుతూ, మా కుటుంబానికి అదనపు ఆదాయాన్ని సంపాదించిపెట్టడంలో నాకు చెప్పలేనంత ఆనందం దక్కుతోంది' అని గర్వంగా చెబుతున్న బర్మన్ లాంటి అమ్మాయిలు మనదేశంలో చాలామందే ఉన్నారు.






కిలోమీటరుకు 5 రూపాయలే!





82528-82528 అనే నంబరుకు డయల్ చేస్తే చాలు ఢిల్లీ మహానగరంలో క్షణాల్లో టూవీలర్ ట్యాక్సీ మీరున్నచోటికి వచ్చి వాలిపోతుంది. లేదంటే ఏ బస్టాండు, రైల్వే స్టేషన్, మెట్రో స్టేషన్‌లోనైనా మీకు ఒక రింగ్ చేస్తే చాలు రెప్పపాటులో బాక్సీలు దొరుకుతాయి. ఇక్కడ కిలోమీటరుకు 5 రూపాయలు చొప్పున వీరు వసూలు చేస్తున్నారు. అంటే ఓ 15 రూపాయలిచ్చేస్తే చాలు మూడు కిలోమీటర్ల దూరంలోని గమ్యాన్ని ఇట్టే చేరుకోవచ్చన్నమాట. ఇక్కడ 2016లో 60 బ్యాటరీ ఆపరేటెడ్ బైక్ ట్యాక్సీలతో ప్రారంభమైన సర్వీసులపై స్థానికులు చాలా సంతోషంగా ఉన్నారు. కరోల్‌బాగ్ ప్రాంతం నుంచి ఝుండేవాలన్ వరకూ ఉన్న 5 కిలోమీటర్ల పరిధిలో వీటి సేవలు చాలా ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. దీంతో చిన్నా చితకా అవసరాలకు ఆటోలు, ట్యాక్సీలు తీసుకోకుండా స్థానికులంతా నిత్యం బాక్సీలపైనే ఆధారపడుతున్నారు.

సహజత్వం ఉట్టిపడే ముగ్గు

18 చుక్కలు ఆరు వరుసలు పెట్టి, అటువైపు ఒక చుక్క ఇటువైపు ఒక చుక్క వదులుతూ 6 చుక్కలు వచ్చేవరకూ పెట్టి, ఫోటోలో చూపించినట్టు ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ముగ్గు వేయాలి. వీటికి సరిపోయే రంగులు వేస్తే ఈ ముగ్గు సహజత్వం ఉట్టిపడేలా చూడచక్కగా ఉంటుంది.









నయాగరా హిమపాతం!

కెనడా, అమెరికా దేశాలను ఓ ఐస్ బ్రిడ్జ్ కలిపేది.. అడ్వెంచర్ టూరిజం లవర్స్ ఈ ఐస్ బ్రిడ్జిపైన నడుచుకుంటూ ఒక దేశంనుంచి మరోదేశానికి వెళ్లేవారు. 1912లో ఇలా ఐస్ బ్రిడ్జ్‌ను నడుచుకుంటూ సరిహద్దులు దాటిన మూడు డజన్ల మందిని తీసిన ఈ ఫోటో ఇప్పటికీ అందిరినీ ఆశ్చర్యపరుస్తుంటుంది. ఈ హిమసేతువు ఉన్నట్టుండి కుప్పకూలడంతో కొంతమంది ప్రాణాలు పోవడంతో అప్పటినుంచీ దీనిపై నడిచేందుకు ఎవ్వరినీ అనుమతించడంలేదు. ఇదంతా ప్రపంచంలో అతిపెద్ద జలపాతంగా పేరుగాంచిన నయాగరా గురించే! ఒక సెకనుకు సుమారు 3000 టన్నుల నీరు దూకే నయాగరా ప్రస్తుతం గడ్డకట్టుకుపోయి హిమపాతంగా అలరిస్తోంది. 1880 ప్రాంతంలో చిన్నారులంతా తమ స్లెడ్జ్ బండ్లను గడ్డకట్టిన నయాగరా జలపాతం మీదుగా సరదాగా తీసుకెళ్లేవారట!

మేడారం జాతరకు రండి

మొదటిపేజీ తరువాయి

ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేడారం జాతర విశేషాలను ఉపరాష్ట్రపతికి వెంకయ్యనాయుడు వివరించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 31 నుంచి 3 వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఉప రాష్ట్రపతికి వివరించామని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొలిఏడాది మేడారం జాతర కు దాదాపు 90 లక్షల మంది హాజరయ్యారని, ఈ సంవత్సరం దాదాపు కోటి మంది భక్తులు మేడారం జాతర లో పాల్గొనే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గిరిజన బిడ్డలు భక్తి , శ్రద్ధలతో జరుపుకునే మేడారం జాతరను జాతీయ పండుగ గా గుర్తించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచించాలని ఉప రాష్ట్రపతిని కోరినట్లు మంత్రి తెలిపారు. తమ విజ్ఞప్తులపై వెంకయ్యనాయుడు సానుకూలంగా స్పందించారని, సమక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు మేడారం జాతరకు వస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఇప్పటికే మేడారం ఉత్సవాలు జరిగే ప్రాంతానికి నాలుగు లైన్ల రోడ్లు, అన్ని విధాల మౌలిక వసతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా ఈ సారి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. వీవీఐపీ లు రోడ్లు మార్గంలో రావడం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వివిఐపీల రాక కోసం రెండు హెలిప్యాడ్లను సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. ఫ్రీ వైపై, మంచినీరు, స్వచ్ఛతా అంశాలను ముఖ్య అంశాలుగా పరిగణిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమ్మక్క, సారలమ్మలకు ప్రీతి పాత్రమైన బెల్లం ప్రసాదం కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతన్నట్లు మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి తెలిపారు. సౌకర్యాలు, మౌలిక వసతులు, బెల్లం కొరతపై జిల్లా కలెక్టర్ తో సమావేశం నిర్వహిస్తామని మంత్రి వివరించారు. ఈ నెల 18న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి చందూలాల్, తాను మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. కేంద్ర గిరిజన శాఖ మంత్రిని మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని కోరామని చెప్పారు. ఉపరాష్ట్రపతిని కలిసినవారిలో ప్రభుత్వం వేణుగోపాలచారి, ఎంపీలు నగేశ్, సీతారాం నాయక్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.





చిక్కుల్లో గజల్ శ్రీనివాస్

(మొదటిపేజీ తరువాయి)

దాడులను ఖండిస్తుందని తెలిపారు. మహిళా ఉద్యోగి పట్ల లైంగిక వేధింపులకు గురి చేసిన గజల్ శ్రీనివాస్‌ను తక్షణమే తొలగిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు వెలగపూడి ప్రకటించారు. ఇక, రిమాండ్ రిపోర్టులో కూడా అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో గజల్ శ్రీనివాస్‌ను ఏ1గా, ఆయన వద్ద పని చేస్తున్న మహిళ పార్వతిని ఏ2గా చేర్చారు.

సంక్రాంతికి 3262 ప్రత్యేక బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

యాభై శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తామని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా శివారు ప్రాంతాల నుంచి బస్సులు ప్రారంభమవుతాయని వివరించారు. విజయవాడ, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు ఎంజీబీఎస్ నుంచే ప్రారంభమవుతాయన్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాపులలో టీఎస్ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటారని యాదగిరి తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలకు రోజువారీగా నడిచే బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తయ్యాయని, ప్రత్యేక బస్సులకోసం ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించామని వివరించారు. ఈ సౌకర్యాన్ని రెండు రాష్ట్రాల ప్రయాణికులు వినియోగించుకోవాలని యాదగిరి సూచించారు.

జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం

(మొదటిపేజీ తరువాయి)

కమిటీని రాష్ట్రానికి పంపాలని సూచించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఎయిర్‌పోర్టు రాకతో నిజాబాద్ జిల్లా ముఖచిత్రమే మారిపోతుందని, వివిధ ప్రాంతాలతో నిజామాబాబాద్‌కు వాయుమార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి సురేశ్‌ప్రభుతో బుధవారం కవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజక వర్గంలో స్పైస్ పార్క్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 42 ఎకరాల భూమిని కేటాయించి, రూ.30 కోట్లు మంజూరు చేసిందని కేంద్ర మంత్రికి తెలిపారు. పార్కు డీపీఆర్‌ను కేంద్ర స్పైస్ బోర్డ్ తయారు చేసిందని, దాంతో అక్కడ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఎంపీ కవిత విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి సురేశ్ ప్రభు రాష్ట్రానికి కేంద్ర తరపున మరో రూ.20 కోట్లు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి సూచన మేరకు ఫిబ్రవరి 3న స్పైస్ బోర్డ్ చైర్మన్, వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులు హైదరాబాద్‌కు వస్తున్నట్లు చెప్పారు. అదే రోజు హైదరాబాద్‌లో ఒక వర్క్ షాపును నిర్వహిస్తామని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో పసుపు పండించే రైతులతో పాటు పసుపును ఎగుమతి చేసే వ్యాపారులు, పసుపు పంటతో అనుబంధం ఉండే వారు ఈ వర్క్ షాపుకు హాజరుకానున్నట్లు ఎంపీ తెలిపారు. కాగా, తెలంగాణకు ప్రత్యేక టర్మరిక్ సెల్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సెల్‌ను ఫిబ్రవరిలో కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు ప్రారంభిస్తారని కవిత తెలిపారు.

హిందీకి ఐరాస హోదా సాధనకు కృషి

- అవసరమైతే రూ.400 కోట్లు ఖర్చు చేస్తాం
- విదేశాంగ శాఖ మంత్రి సుష్మస్వరాజ్


న్యూఢిల్లీ, జనవరి 3: ఐక్యరాజ్యసమితి అధికార భాషల్లో హిందీకి స్థానం కల్పించడానికి నిబంధనలు అడ్డుపడుతున్నాయని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు. హిందీకి ఐరాస గుర్తింపు కల్పించేందకు అవసరమైతే నాలుగు వందల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. హిందీకి ఐక్యరాజ్యసమితి అధికార భాషల్లో స్థానం దక్కాలంటే 193 సభ్య దేశాల్లో కనీసం 129 దేశాలు మద్దతు పలికాలి. హిందీని అధికార భాష చేసేందుకు అయ్యే ఖర్చును మద్దతు పలికిన దేశాలే భరించాలి. అయితే మద్దతు సంపాదించడం సులభమే కానీ, కొన్ని చిన్నదేశాలు ఖర్చు విషయంలో వెనకాడుతున్నాయని ఇదే అడ్డంకిగా మారిందని, ప్రయత్నాలు చేస్తున్నామని సుష్మ తెలియజేశారు. ఐరాసలో అధికారిక హోదా సాధనకు అవసరమైతే రూ.400 కోట్లు ఖర్చు చేయడానికి కూడా భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. హిందీ కోసం అవసరమైతే రూ.400 కోట్లు ఖర్చు చేస్తామంటూ సుష్మస్వరాజ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. భారతదేశంలో హిందీ అధికార భాష మాత్రమేనని, జాతీయ భాష కాదని, అలాంటి హిందీకి ఐక్యరాజ్య సమితి హోదా కోసం ప్రభుత్వం అంత శ్రమించాల్సిన అవసరం ఏంటని ఆయన ప్రశ్నించారు. భవిష్యత్తులో తమిళనాడు లేదా పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తి భారత ప్రధాని అయితే వారు ఐక్యరాజ్యసమితిలో హిందీలోనే మాట్లాడేలా చేయడం ఎందుకు అని అన్నారు. అంతేకాక హిందీ భారతదేశంలో తప్పా మరెక్కడా అధికార భాష కాదన్నారు. ఇందుకు స్పందించిన సుష్మ మాట్లాడుతూ ఫిజీ అధికార భాష హిందీ అని మంత్రికి తెలిసినట్లు లేదన్నారు. అంతేకాక మారిషస్, ట్రినిడాడ్ అండ్ టొబోగోతో పాటు మరికొన్ని దేశాల్లో హిందీ మాట్లాడే వారు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు.

భూదాన్ బోర్డుకు ప్రత్యేకాధికారి జీవో నిలిపివేత

హైదరాబాద్, జనవరి 3 (మనం లీగల్ ప్రతినిధి) : ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డుకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ జారీ చేసిన జీవో అమలును నిలిపివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఎంఎస్ రామచందర్‌రావు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ బోర్డు విధుల పర్యవేక్షణకు వీలుగా గత నెల 18న జారీ చేసిన జీవోను ఏపీ భూదాన్ బోర్డు అధ్యక్షుడు జి.రాజేందర్‌రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. కొత్త కార్యవర్గం ఏర్పాటు అయ్యే వరకు అధికారి అవసరం లేదన్నది పిటిషనర్ వాదన. జీవోను సస్పెండ్ చేస్తూ బుధవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చి ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

రేవంత్ 'రేస్'కు కళ్లెం?

(మొదటిపేజీ తరువాయి)



మద్దతుదారులతో తరలివచ్చి చూపిన దూకుడుకు కళ్లెం వేసేందుకు పార్టీలోని ఓ వర్గం తమదైన శైలిలో పావు కదుపుతున్నట్టు చెబుతున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ 24 గంటల ఉచిత కరెంటు, విద్యుత్తు కొనుగోళ్లు, ప్రాజెక్టులు, అక్రమాలపై బుధవారం పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడిస్తానని రేవంత్ మంగళవారం విలేకర్ల సమావేశంలో చెప్పారు. కాగా, గాంధీభవన్లో బుధవారం విద్యుత్ ప్రాజెక్టులు, టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారాలపై ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యనేతల సమక్షంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వటం రేవంత్‌కు అడ్డుకట్ట వేసేందుకేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో చేరాక కొద్ది రోజుల వరకూ రేవంత్ గాంధీభవన్‌కు రాలేదు. ఆయన్ను స్వాగతించేవిషయంలో నేతల మధ్య సమన్వయం కొరవడినందునే ఇలా జరిగిందని అప్పట్లో ప్రచారం సాగింది. ఇట్లా రేవంత్ తమను డామినేట్ చేయకుండా సీనియర్లు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్నారనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, కోమటిరెడ్డి బ్రదర్స్‌కు చెక్ పెట్టేందుకు రేవంత్‌ను పార్టీలోకి తీసుకువచ్చారన్న ఆగ్రహంతోనే గాంధీభవన్‌లో జరిగే కార్యక్రమాలకు వారు దూరంగా ఉంటున్నారని నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో రేవంత్ పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. పాదయాత్రకు కూడా కొందరు అడ్డుపడ్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. టీడీపీలో ఉన్న సమయంలో రేవంత్‌కు, కాంగ్రెస్ నేత డీకే ఆరుణకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. కాంగ్రెస్‌లో రేవంత్ ఎదుగుదలకు ఇది కొంత అవరోధం కాగాలదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామాలన్నీ రేవంత్ రేస్‌కు కళ్లెం వేసేందుకేనని వివరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమదే అధికారమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు పార్టీలోని అందరినీ కలుపుకుని పని చేయించుకోవడంలో అధిష్టానం విఫలమైందని ఆ పార్టీ వారే ఆరోపణలున్నాయి. ఒకరు ఎదుగుతుంటే మరొకరు కిందకు లాగటం పార్టీలో సర్వసాధారణంగా మారిందని, ఇలా అయితే పార్టీ అధికారంలోకి ఎలా వస్తుందని పలువురు సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలంటే నాయకులందరినీ ఏకతాటిపై తీసుకురావాల్సిన అవసరాన్ని అధిష్టానం గుర్తించాలని కార్యకర్తలు కోరుతున్నారు. కొత్తగా చేరుతున్న వారికి టికెట్లు ఇస్తే పార్టీనే నమ్ముకుని ఉన్న తమ పరిస్థితి ఏంటని పలువురు సీనియర్లు వాపోతున్నారు. అందుకే నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలోతమదే పై చేయి అని ప్రదర్శించుకోవడానికి ఎత్తులుపైఎత్తులు వేస్తూ, ఎవరి కుంపటి వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటున్నారు. వీటిని పరిష్కరించి, నాయకుల మధ్య సమన్వయం కుదిరిస్తేనే పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశముందని, లేదంటే పుట్టి మునుగుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

రాజస్థాన్‌లో రక్తమోడిన రోడ్లు

- రెండు ప్రమాదాల్లో 19 మంది మృతి
- మరో 18 మందికి గాయాలు

జైపూర్, జనవరి 3: రాజస్థాన్‌లో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం చెందారు. మరో 18 మంది గాయపడ్డారు. సికర్ జిల్లాలో ఫతేపూర్ సమీపంలోని 11వ జాతీయ రహదారిపై వెళ్తున్న రాజస్థాన్ ప్రజా రవాణా సర్వీసు (ఆర్‌పీటీఎస్) బస్సు మరో బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో 11 మంది మృతి చెందగా.. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో జైపూర్‌లోని ఆస్పతికి పంపారు. సికర్ కలెక్టర్ నరేష్ కుమార్, ఎస్పీ వినిత్ కుమార్ వెంటనే సంఘటనా స్థలికి చేరుకుని బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఇదిలా ఉండగా, జైపూర్ జిల్లా రెన్వాల్ ప్రాంతంలో బంధువుల పెళ్లికి వెళ్లి టెంపోలో తిరుగుప్రయాణమైన వారిని లారీ ఢీకొట్టింది. దీంతో టెంపోలోని ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.



నేడు లాలుకు శిక్ష ఖరారు

- వాయిదా వేసిన సీబీఐ కోర్టు
- దాణా కుంభకోణం కేసు

న్యూఢిల్లీ, జనవరి 3: దాణా కుంభకోణం కేసులో దోషిగా తేలిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు గురువారం సీబీఐ ప్రత్యేక కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. బుధవారమే శిక్షను ఖరారు చేయాల్సి ఉండగా.. న్యాయవాది విందేశ్వరి ప్రసాద్ మరణించడంతో వాయిదా వేస్తున్నట్లు రాంచీ ప్రత్యేక సీబీఐ కోర్టు తెలిపింది. ఈ కుంభకోణంలో లాలుతో పాటు 15 మందిని కోర్టు దోషులుగా ప్రకటించింది. గురువారం వీరందరికీ శిక్ష ఖరారు చేయనున్నట్టు సీబీఐ ప్రత్యేక కోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దాణా కుంభకోణం రెండో కేసులో వీరందరిని గతేడాది డిసెంబరు 23న దోషులుగా తేలుస్తూ సీబీఐ కోర్టు తీర్పు ప్రకటించిన సంగతి తెలిసిందే.

అందరికీ మేలు

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిరంతరం వి ద్యుత్ 23 లక్షల మంది రైతులకే కాకుండా.. చిన్న పరిశ్రమలకూ మేలు చేస్తుందని పేర్కొ న్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ దూరదృష్టివల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. సాగుకు 24 గంటల కరెంటును అందించడంలో కీలక పాత్ర పోషించిన ప్రభాకరరావు బుధవారం 'మనం'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశే షాలు ఆయన మాటల్లోనే.. '' విద్యుత్ రంగం పై సీఎం కేసీఆర్ సారించిన దూరదృష్టివల్లే నిరంతరం విద్యుత్ సాధ్యమైంది. ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై ప్రధానంగా దృష్టిపెట్టాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఎ టువంటి వనరులు కావాలన్నా ఏర్పాటు చేస్తా మని హామీ ఇచ్చిన అండగా నిలిచారు. ఆ ఆదే శాల ప్రకారం మొదట ట్రాన్స్‌మిషన్ డిస్ట్రి బ్యూషన్ వ్యవస్థపై దృష్టి సారించాం. ఆ ప్రకా రం రూ.12 వేల కోట్లతో ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ పనులు చేపట్టి అభివద్ధి చేశాం. మొదట వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందించాలని ప్రణాళిక రచించాం. కానీ రానున్న యాసంగికి రైతులకు 24 గంట ల విద్యుత్పత్తిని అందించేలా చర్యలు చేపట్టా లని సీఎం కేసీఆర్ సూచించారు. ఆయన ఆదే శాల మేరకు విద్యుత్పత్తిపై దృష్టిని కేంద్రీకరిం చాం. విద్యుత్పత్తి ఫలితంగా రైతులకే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి చిన్నపాటి రైస్ మిల్లులు, ఫ్లోర్ మిల్లుల వంటి ఇతర ఇండస్ట్రీస్ నడుపుకుంటున్నవారికి కూడా ఉప యోగకరంగా ఉంటుంది. దీంతో పాటు గ్రామీ ణాదాయం కూడా పెరుగుతుందని సీఎం కేసీ ఆర్ చెప్పారు. ఆయన సలహా మేరకు పవర్‌ను విభాగాలుగా విభజించుకోవడం జరిగింది. సంస్థ కూడా అహర్నిశలు కషి చేసింది. ఆ ఫలితంగానే ఈ 24 గంటల విద్యుత్పత్తిని సంస్థ ద్వారా అందించకలుగుతున్నాం. మన రాష్ట్రం ఏర్పడేనాటికి మనస్థాపిత విద్యుత్పత్తి 6573 మెగావాట్లుగా ఉంది. ప్రస్తుతం మన విద్యుత్పత్తి 15వేల మెగా వాట్ల విద్యుత్పత్తికి చేరుకుంది. ఇందులో సౌరవిద్యుదుత్పత్తివాటా 3 వేల మెగావాట్లు. దాంతో దేశంలోనే మన రాష్ట్రం తొలిస్థానంలో ఉన్నాం. ఇదంతా సీఎం కేసీఆర్ దూరదృష్టి వల్లే సాధ్యపడింది. ఈ ఏడాది 18వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంతో కార్యాచరణ అమలు చేస్తున్నాం. విద్యుత్ సంస్థ ఉద్యోగులు చేసిన కృషిని గుర్తించి, ఇంక్రిమెంట్ పెంచినందుకు సీఎం కేసీఆర్‌కు మరోసారి కృతజ్ఞతలు. నిరంతరం కరెంట్‌తో ఈ ఏడాది మార్చి నాటికి విద్యుత్ వినియోగం 11,500 మెగావాట్లకు చేరుకునే అవకాశముంది. అయితే కొందరు అంటున్నట్లుగా కేంద్ర ప్రభుత్వ ఉదయ్ స్కీమ్‌కు, ఉచిత విద్యుత్‌కు సంబంధంలేదు. విభజన చట్టంలో కొన్ని వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. వాటిని సామరస్యంగా చర్చించుకుంటే పరిష్కార మవుతాయి. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ముందుకురావాల్సిన అవసరం ఉంది. ఏపీ, తెలంగాణ మధ్య కొన్ని అభిప్రాయ భేదాలున్నాయన్నది వాస్తవం. ఉద్యోగుల విషయం అలాగే ఉండిపోయింది. కోర్టులో విచారణ జరుగుతోంది. త్వరలోనే తీర్పు వస్తుందని ఆశిస్తున్నాను. సమస్య కూడా తొందరలోనే తీరుపోతుందని భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు.

ట్రాన్స్‌కోకు సీబీఐపీ అవార్డు

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డును ఈ ఏడాదికి తెలంగాణ ట్రాన్స్ కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు అందుకున్నారు. ఢిల్లీలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రుల సమక్షంలో సీబీఐపీఅధ్యక్షుడు రవీంద్రకుమార్ వర్మ ఈ ఆవార్డును ప్రభాకర్ రావుకు అందించారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సిబిఐపి) జ్యూరీ ఇటీవలనే ప్రభాకర్ రావును ఈ ప్రతిష్టాత్మక అవార్డు కోసం ఎంపిక చేసింది. విద్యుత్ సరఫరా రంగంలో విశేష కృషి చేసి దేశంలోనే తెలంగాణ ట్రాన్స్‌కోను పలు రంగాల్లో అగ్రగామిగా నిలిపినందుకు ఈ అవార్డుకు ప్రభాకర్ రావును ఎంపిక చేసినట్లు బోర్డు ప్రకటించింది.

టికెట్లతో రైల్వేకు 47వేల కోట్ల ఆదాయం

2016-17 లెక్కలను వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 3: టికెట్ల అమ్మకాల ద్వారా భారతీయ రైల్వేకు 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ.47,678.09 కోట్ల ఆదాయం సమకూరింది. 2015–16తో పోలిస్తే రూ.2వేల కోట్లుపైగా ఆదాయం పెరిగిందని రైల్వే శాఖ సహాయ మంత్రి రాజన్ గొహైన్ లోక్‌సభలో తెలిపారు. 2015–16 ఆర్థిక సంవత్సరంలో ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం ద్వారా రూ.17,204.06 కోట్లు, కౌంటర్లలో అమ్మకాల ద్వారా రూ.28,119 కోట్లు రాగా, 2016–17లో ఆన్‌లైన్ విక్రయాల ద్వారా రూ.19,209.28 కోట్లు, కౌంటర్లలో అమ్మకాల ద్వారా రూ.28,468.81 కోట్లు వచ్చాయని ఆయన తెలిపారు. 2015–16కు గాను మొత్తం రూ.45,323.93 కోట్లు ఆదాయం రాగా, తర్వాత ఏడాది మరో రూ.2354.16 కోట్లు అదనపు ఆదాయం సమకూరిందని తెలిపారు.

రైలు ఇంజన్లకు ఉపగ్రహ అనుసంధానం!


రైలు కచ్చితంగా ఎక్కడ ఉందో తెలుసుకోవడంతో పాటు డ్రైవర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడేందుకు వీలుగా రైలు ఇంజన్లను ఇస్రో ఉపగ్రహంతో అనుసంధానించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పక్రియను 2018 డిసెంబరు కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. రైలు కచ్చితంగా ఎక్కడ ఉందో తెలుసుకోవడంతో పాటు డ్రైవర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది. రైల్వే ఆధీనంలో ఉన్న మొత్తం 10,800 ఇంజన్లలో యాంటినాలు అమర్చుతామని, వీటికి సంబంధించిన పర్యవేక్షక వ్యవస్థ డ్రైవర్ క్యాబిన్‌లో ఉంటుందని రైల్వే సీనియర్ అధికారులు తెలిపారు. ఇప్పటికే పది ఇంజన్లలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి పరీక్షించామని రైల్వే బోర్డు సభ్యుడు ఒకరు తెలిపారు. న్యూఢిల్లీ – గువహటి, న్యూఢిల్లీ–ముంబై మార్గాల్లో నడిచే ఆరు ఎలక్ట్రిక్ ఇంజన్లలో ఇప్పటికే దీనికి సంబంధించిన పరీక్షలు పూర్తయ్యాయని వెల్లడించారు. రైలు కదలికలను పసిగట్టేందుకు తెలుసుకోవడం ద్వారా కాపలా లేని రైల్వే క్రాసింగ్ వద్ద ప్రమాదాలు నివారించేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడనుందన్నారు.



యూపీ మదర్సాలకు సెలవుల కోత

- పనిదినాలుగా ఇస్లామేతర పండుగలు
- రాష్ట్రంలో 2300 'నకిలీ' మదర్సాలు!
- నెలాఖరు కల్లా చర్యలు: మైనారిటీ శాఖ

లఖ్‌నవ్, జనవరి 3: ఉత్తరప్రదేశ్‌లోని ముస్లిం మత విద్యాసంస్థలైన మదర్సాలకు సెలవుల్లో కోత విధిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్రిస్మస్, దీపావళి, దసరా, మహావీర్ జయంతి, బుద్ధ పూర్ణిమ, రక్షాబంధన్ వంటి ఇస్లామేతర పండుగలను పనిదినాలుగా పరిగణిస్తూ 2018కి సంబంధించిన సెలవుల క్యాలెండర్‌ను యూపీ మదర్సా బోర్డు విడుదల చేసింది. ఇప్పటి వరకు ఉన్న 92 సెలవులను 86కు తగ్గించింది. మరోవైపు రంజాన్ పర్వదినం సందర్భంగా అన్ని మదర్సాలకు ఇప్పటి వరకు 46 రోజుల పాటు సెలవులు ఇస్తుండగా.. వాటిని 42కు తగ్గిస్తూ యూపీ మైనారిటీ శాఖ నిర్ణయం తీసుకుంది. అలాగే మదర్సా మేనేజర్ లేదా ప్రిన్సిపాల్‌కు 10 రోజుల పాటు సెలవులు ప్రకటించే ప్రత్యేకమైన అధికారాన్ని తొలగించింది. విద్యార్థుల మేలు చేసే ఆలోచనతోనే తమ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మైనారిటీ శాఖ మంత్రి లక్ష్మీ నారాయణ్ చౌదరి తెలిపారు. అయితే మదర్సా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన బాటపట్టాయి. సెలవుల కోతపై మరోసారి పునఃసమీక్షించాలని కోరుతూ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ మదరిస్ అరబియా డిమాండ్ చేస్తోంది. అలాగే రంజాన్ సెలవులను 47 రోజులకు పెంచాలని కోరుతూ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు లేఖరాసినట్లు ఆ సంఘం తెలిపింది. ఇదిలా ఉండగా, యూపీలో 19,108 మదర్సాలు ఉండగా, వాటిలో 2300 సంస్థలు వాటి వివరాలను మదర్సా బోర్డుకు అందజేయలేదని ఆ రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి



లక్ష్మీ నారాయణ్ చౌదరి తెలిపారు. ఈ నెలాఖరు లోపు వివరాలు అందించకపోతే వాటిని నకిలీ మదర్సాలుగా ప్రకటించనున్నట్లు హెచ్చరించారు.

అవి 'బ్లూ వేల్'మరణాలు కావు: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 3: దేశంలో ఎవరూ బ్లూవేల్ వీడియో గేమ్ ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఆధారాలేవీ లేవని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ తెలిపారు. ఈ మేరకు ఆయన లోక్‌సభకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో బ్లూవేల్ గేమ్ ఆడుతూ అందులో ఇచ్చే చాలెంజ్‌లకు అనుగుణంగా పిల్లలు, విద్యార్థులు ఆత్మహత్యలు చేసు కున్నట్లు కేసులు నమోదయ్యాయని ఆయన చెప్పారు. ఈ కేసుల్లో సమగ్ర విచారణ జరపాలని ఆయా ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల దర్యాప్తునకు ఓ నిపుణుల కమిటీని కూడా నియమించామని, ఆత్మహత్యలకు పాల్పడిన వారి ఇంటర్నెట్ వాడకం, వారు ఉపయోగించిన మొబైల్, సామాజిక వెబ్‌సైట్లలో వారి పోస్టులతో పాటు ఇతర ఆధారాలను కమిటీ పరిశీలించిందని తెలిపారు. ఈ ఆత్మహత్యల వెనుక బ్లూ వేల్ గేమ్ ఉన్నట్లుగా ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆయన పేర్కొన్నారు.






31న అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం

150 ఏళ్లలో ఇదే తొలిసారి: పరిశోధకులు

వాషింగ్టన్, జనవరి 3: అత్యంత అరుదైన సంపూర్ణ చంద్ర గ్రహణం ఈ నెలాఖరున చోటుచేసుకోనుందని ఖగోళ పరిశోధకులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆకాశంలో ఎన్నో వింతలు చోటుచేసుకోనున్నాయని చెప్పారు. సాధారణ రోజులలో కన్నా పౌర్ణమి రోజు నిండుగా కనిపించే చంద్రుడు.. వరుసగా మూడు లేదా నాలుగు పున్నముల తర్వాత మరింత పెద్దగా కనిపిస్తాడు. ఇది ఒకే (క్యాలెండర్) నెలలో వచ్చే రెండో పౌర్ణమి. శాస్త్ర పరిభాషలో ఈ పౌర్ణమి నాటి చంద్రుడిని బ్లూ మూన్ అంటారు. బ్లూమూన్ గ్రహణం ఏర్పడడం అత్యంత అరుదైన విషయం. ఇంత అరుదైన సంఘటన ఈ నెలాఖరున చోటుచేసుకోనుందని ఖగోళ పరిశోధకులు చెబుతున్నారు. 2018లో భారత ఉపఖండంపై ఇదే తొలి గ్రహణమని చెప్పారు. ఇక ఇదే నెలలో మంగళవారం(2వ తేదీన) నిండు జాబిల్లి, బుధవారం(3న) సూర్యుడు భూమికి అతి దగ్గరగా వచ్చాయని తెలిపారు. 2017 డిసెంబరు 28 నుంచి 2018 జనవరి 12 వరకు ఉల్కాపాతం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ ఒక్క ఏడాదే 12 సార్లు ఉల్కాపాతం జరగడం విశేషమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

లోయలో పడ్డ బస్సు

పెరూలో 48 మంది దుర్మరణం





లిమా, జనవరి 3: పెరూ రాజధాని లిమాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అక్కడి రాకీ బీచ్ వద్ద ఉన్న లోయలో మంగళవారం ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 48 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ రెండు వాహనాలు పోటాపోటీగా వేగంతో ముందుకు వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రత్యేక హెలికాప్టర్ల ద్వారా మృతదేహాలను వెలికితీశారు.



బేడీ సేవలు భేష్

- పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి ప్రశంస

పుదుచ్చేరి, జనవరి 3: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా శాంతి భద్రతలు కాపాడటంలో లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ ఎంతో సహకరించారని ముఖ్యమంత్రి నారాయణ స్వామి ప్రశంసించారు. కొన్ని అంశాల్లో విభేదాలున్నా ఆమె సేవలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ''వేడుకలు చేసుకోవడానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలు కాపాడటంలో ప్రభుత్వానికి, పోలీసులకు కిరణ్ బేడీ సహకరించారు. ఆమె ఎంతో కీలకంగా వ్యవహరించారు. ఎవరు మంచి పనిచేసినా, విబేధాలను పక్కనబెట్టి అభినందించడం తమిళుల సంస్కృతి. నేను కూడా ఇదే పాటించా'' అని నారాయణ స్వామి అన్నారు. సీఎం వ్యాఖ్యలను కిరణ్ బేడీ స్వాగతిస్తూ ట్విటర్‌లో ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. మెడికల్ అడ్మిషన్లు, ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేల నియామకం సహా పలు అంశాల్లో సీఎం, లెఫ్టినెంట్ గవర్నర్ మధ్య విబేధాలు వచ్చాయి. విశ్రాంతి ఐపీఎస్ అధికారిణి అయిన కిరణ్ బేడీ 2016లో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు.

జనజీవనం 'బంద్'

మహారాష్ట్రలో ఆందోళన హింసాత్మకం



- పట్టాలపై నిరసనకారుల బైఠాయింపు
- సబర్బన్ రైళ్ల రాకపోకలకు ఆటంకాలు
- పలుచోట్ల బస్సులపై రాళ్లతో దాడులు
- రెండు రోజుల్లో 42 బస్సులు ధ్వంసం
- సేవలు నిలిపేసిన ముంబై 'డబ్బావాలా'
- హిందుత్వ సంస్థలవల్లనే హింస: కాంగ్రెస్
- ఆర్పే బదులు ఆజ్యం పోస్తున్నారు: బీజేపీ
- పార్లమెంటులో అధికార-విపక్ష ఆరోపణలు

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 3: భీమా కోరేగావ్ హింసాత్మక సంఘటనల అదుపులో ప్రభుత్వం విఫలమైందంటూ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన మహారాష్ట్ర బంద్ హింసాత్మక రూపుదాల్చింది. రాష్ట్ర రాజధాని ముంబైసహా పుణె, నాసిక్ తదితర నగరాల్లో బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఆఫీసులు, వాణిజ్య సంస్థలు, పాఠశాలలు, పలు ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలు మూతపడ్డాయి. నాసిక్‌లో ఆటోరిక్షాలు కూడా నడవలేదు. మన్మాడ్, లాసల్‌గావ్‌లలోనూ బంద్ పాటించారు. ముఖ్యంగా ముంబై నగరంలో దళిత ఆందోళనకారులు సిటీ బస్సులపై దాడి చేయడంతోపాటు సబర్బన్ రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో రోడ్డు, రైలు రవాణా స్తంభించి సామాన్య జనజీవనానికి అంతరాయం కలిగింది. ఈ ఆందోళన నేపథ్యంలో చివరకు ముంబై 'డబ్బావాలా' సేవలు కూడా నిలిచిపోవడం గమనార్హం. తమ ఖాతాదారులు అనేకమంది ఆఫీసులకు వెళ్లే పరిస్థితి లేకపోవడమే ఇందుకు కారణమని డబ్బావాలాల సంఘం ప్రతినిధి ఒకరు చెప్పారు. పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించకపోయినా బస్సు ఆపరేటర్లు వాహనాలను నడపలేదు. చెంబూర్, ఘట్కోపర్, కామ్‌రాజ్ నగర్, విక్రోలీ, దిన్డోషి, కందివాలి, జోగేశ్వరి, కాలానగర్, మాహిమ్ ప్రాంతాల్లో తెల్లవారేసరికి వందలాది ఆందోళనకారులు రోడ్లమీదకు వచ్చారని పోలీసులు తెలిపారు. వీరిలో కొందరు వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేని దిగ్బంధించేందుకు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాల్లో ఆందోళనకారుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. హార్బర్ మార్గంలో కొన్నిచోట్ల వారు రాళ్లు రువ్వినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా గోవాండి, మన్‌ఖుర్ద్, కుర్లా ప్రాంతాల్లో రైలు పట్టాలపై బైఠాయించి సబర్బన్ రైళ్లను అడ్డుకున్నారని చెప్పారు. థానె, భాండుప్, కంజూర్‌మార్గ్, విక్రోలీ, ఘట్కోపర్ రైల్వే స్టేషన్లలోనూ వారు ఆటంకాలు కల్పించడంతో ప్రయాణికులు పట్టాలపై నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది. బాంద్రా, ధారవి, కామ్‌రాజ్ నగర్, సంతోష్ నగర్, దిన్డోషి, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో 13 సిటీ బస్సులను ఆందోళనకారులు ధ్వంసం చేశారని ముంబై మహానగర పాలక సంస్థ అధికారి ఒకరు తెలిపారు. దీంతో ఇప్పటివరకూ ధ్వంసమైన బస్సుల సంఖ్య 42కు చేరిందన్నారు. నిరసనకారుల హింసాత్మక చర్యల ఫలితంగా సీఎస్ఎంటీ వైపు వచ్చే రైళ్లను వివిధ స్టేషన్లలో అధికారులు నిలిపివేశారు. బుధవారం నాటి హింసాత్మక సంఘటనలపై ముంబై పోలీసులు 9 కేసులు నమోదు చేయగా ఇప్పటివరకూ 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, గుజరాత్ దళిత ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ, ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్‌లపై తమకు ఫిర్యాదు అందిందని పుణె పోలీసులు చెప్పారు. పుణెలో డిసెంబరు 31న నిర్వహించిన ఓ కార్యక్రమంలో వీరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. రాష్ట్ర బంద్ ప్రభావం సినిమా, టీవీ షూటింగ్‌లపైన కూడా పడింది. ముందు జాగ్రత్త చర్యగా బుధవారం అంధేరి, జోగేశ్వరి ప్రాంతాల్లో చేపట్టాల్సిన కొన్ని చిత్రాల షూటింగ్‌ను రద్దు చేయగా, మరికొన్నిటికి అంతరాయం ఏర్పడింది. ఓ టీవీ సీరియల్ షూటింగ్ జరుగుతుండగా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఆపేశారు.



సమాజాన్ని చీలుస్తున్న ఆరెస్సెస్: ఖర్గే

మహారాష్ట్రలో హింసకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కారణమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. సమాజాన్ని కులమతాల పేరిట చీలుస్తున్నదని మండిపడ్డారు. ఈ సంఘటనలపై ప్రధాని మోదీ 'మౌన ముని' ముద్రను వీడి, ప్రకటన చేయాలని బుధవారం లోక్‌సభలో ఆయన డిమాండ్ చేశారు. దళితులను అణగదొక్కేందుకు కొన్ని ఫాసిస్టు శక్తులు కుట్రపన్నాయని ఆరోపించారు. మహారాష్ట్రలో అల్లర్ల సృష్టికి సంఘ్ పరివార్‌లోని వ్యక్తులే కారకులని పేర్కొన్నారు. భీమా కొరేగావ్ యుద్ధ 200వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో వారు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలన్నిటా దళితులకు అన్యాయం జరుగుతున్నదని ఆరోపించారు. మహారాష్ట్రలో హింసాత్మక ఘర్షణలపై సుప్రీం కోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అన్నిటికన్నా ముందు ప్రధాని సభకు వచ్చి ప్రకటన చేయాలని కోరారు. అయితే, ఖర్గే ఆరోపణలను అధికార బీజేపీ ఖండించింది. ఈ మేరకు 'విభజించి-పాలించే' సూత్రం కాంగ్రెస్ పార్టీదేనని సభా వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ ఎదురుదాడి చేశారు. హింసను ప్రేరేపిస్తున్నది రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీయేనని, దేశ ప్రజలు దీన్ని సహించబోరని హెచ్చరించారు. 'అందరి తోడ్పాటుతో అందరి అభివృద్ధి' నినాదంతో జాతిని ఏకతాటిపై నడిపేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



'తలాక్'పై తకరారు

- రాజ్యసభలో ప్రతిపక్షాల మూకుమ్మడి బ్రేక్
- సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ డిమాండ్
- అక్కడ ఆమోదం.. ఇక్కడ అభ్యంతరమా?
- రాజ్యసభ నాయకుడు జైట్లీ నిలదీత
- పరిశీలనకు సమయం లేదని వివరణ
- పట్టువీడని విపక్షాలు..సభ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 3: ముస్లిం మహిళల వైవాహిక హక్కుల రక్షణ బిల్లు-2017కు రాజ్యసభలో చుక్కెదురైంది. లోక్‌సభలో అధికార బీజేపీకి ఆధిక్యం ఫలితంగా ఆమోద ప్రక్రియ సజావుగా సాగిపోయింది. కానీ, బుధవారం ఎగువసభలో ప్రతిపక్షాలు మూకుమ్మడిగా బిల్లుకు బ్రేక్ వేశాయి. దీన్ని సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాల్సిందేనని పట్టుబట్టాయి. రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బిల్లును ప్రవేశపెట్టగానే గందరగోళం రేగింది. అయితే, ప్రతిపక్షాలు దీన్ని ఆమోదించేందుకు ససేమిరా అన్నాయి. ''లోక్‌సభలో ఈ బిల్లుకు ఆమోదం లభించినప్పటికీ మొరాదాబాద్‌లో కట్నం వేధింపులతో ఒక మహిళకు ఆమె భర్త తక్షణ (ముమ్మారు తలాక్) విడాకులిచ్చేశాడు. దీన్నిబట్టి ఈ బిల్లు చట్టంగా రూపొందడం అత్యవసరమన్న వాస్తవాన్ని గ్రహించండి'' అని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఒకవైపు ఈ గందరగోళం కొనసాగుతుండగానే ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే, విపక్షం వైఖరిపై సభా నాయకుడైన ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అసహనం వ్యక్తం చేశారు. ''లోక్‌సభలో మీరు దీన్ని ఆమోదించారు. ఇక్కడికొచ్చేసరికి అభ్యంతరాలు చెబుతున్నారు. మీ వైఖరిని దేశమంతా గమనిస్తోందని గుర్తించండి, ప్రతిపక్షం 'దేశ విచ్ఛిన్న శక్తుల'తో చేయి కలపరాదు'' అన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు మండిపడుతుండగానే- శతాబ్దాలనాటి తలాక్ సంప్రదాయం రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినట్లు జైట్లీ గుర్తుచేశారు. దీనిపై ఆరు నెలల్లోగా చట్టం తేవాలని ఆదేశించిందని, ఈ గడువు ఫిబ్రవరి 22తో ముగియనుందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సెలెక్ట్ కమిటీకి పంపితే ఆ గడువులోగా పరిశీలన పూర్తికాదని వివరించారు. అందువల్ల ప్రతిపక్షాలు తమవంతు బాధ్యతను గుర్తించి సహకరించాలని సూచించారు.

సిబల్ నిలదీత... మాటమార్చిన జైట్లీ

జైట్లీ వాదనను కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ తోసిపుచ్చారు. సదరు తీర్పు ఇచ్చిన ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులలో ముగ్గురు (3:2) దీనితో విభేదించారని గుర్తుచేశారు. అందువల్ల ఈ తీర్పును పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆయన ఇలా నిలదీయడంతో జైట్లీ మాటమారుస్తూ- సెలెక్ట్ కమిటీకి పంపే నోటీసును 24 గంటల ముందుగా సభాధ్యక్ష స్థానానికి సమర్పించాల్సి ఉంటుందని నిబంధనను ఉటంకించారు. ఈ సందర్భంగా మంత్రి రవిశంకర్ ప్రసాద్ జోక్యం చేసుకుంటూ- ముస్లిం పర్సనల్ లా బోర్డు తరఫు న్యాయవాదిగా ఉన్న సిబల్‌కు సభలో మాట్లాడే నైతిక హక్కులేదని ప్రతి విమర్శ చేశారు.

ఓటింగ్ కోరిన గులాంనబీ ఆజాద్

మరోవైపు ఈ అంశంపై ఓటింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ సభాపక్ష నేత గులాంనబీ ఆజాద్ డిమాండ్ చేశారు. కానీ, బీజేపీకి సభలో ఆధిక్యం లేకపోవడంతో అయోమయంలో పడింది. సభలోనే మెజారిటీ సభ్యుల వాదనను విననివారు ఇంకెక్కడైతే వింటారని ఆజాద్ ప్రశ్నించారు. దీన్ని మరింత బలోపేతం చేసేందుకే సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తున్నట్టు ఆ పార్టీల ఎంపీలు తెలిపారు. విపక్ష ఎంపీలంతా మూకుమ్మడిగా బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందేనని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ పి.జె.కురియన్ జోక్యం చేసుకుంటూ ప్రభుత్వ, ప్రతిపక్షాల వాదన సరైనదేనన్నారు. మంత్రి రవిశంకర్‌ను మొదట మాట్లాడనివ్వాలని ఆయన పదేపదే నచ్చజెప్పినా విపక్ష సభ్యులు వినకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు.

5369 కోట్లతో జల్ వికాస్ మార్గ్

- ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 3: నౌకాయానం అభివృద్ధి చేయడం కోసం 5,369 కోట్ల రూపాయల వ్యయంతో జల్ వికాస్ మార్గ్ ప్రాజెక్టు (జేవీఎంపీ)కు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసంది. ఈ పథకం కింద జాతీయ జలమార్గం-1 (ఎన్‌డబ్ల్యూ-1) హల్దియా-వారణాశి చేపట్టనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినట్టు కేంద్ర నౌకాయాన శాఖ వెల్లడించింది. ప్రపంచ బ్యాంకు ఆర్థిక, సాంకేతిక సహకారంతో ప్రాజెక్టును చేపట్టనున్నట్టు పేర్కొంది. ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లలో ప్రధాన జిల్లాలు వారణాశి, ఘాజీపూర్, బలయా, బక్సర్, ఛాప్రా, వైశాలి, పట్నా, బెంగసరాయ్, ఖాగరియా, ముంగెర్, సాహబ్‌గంజ్, ముర్షిదాబాద్, పాకూర్, హూగ్గి, కోల్‌కతాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తారు. 2023 మార్చి నాటికి ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. "ఈ ప్రాజెక్టులో గంగా నదిపై మల్టీ మోడల్, ఇంటర్ మోడల్ టర్మినల్ తదితర మౌలిక వసతులను కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 46 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 84 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

సావిత్రీబాయికి మోదీ నివాళి

న్యూఢిల్లీ, జనవరి 3: సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించాలి. పేదలు, వెనుకబడిన తరగతుల వారికి సాధికారత కల్పించాలన్న ఆమె ఆశయ సాధనకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మోదీ పేర్కొన్నారు. ''సావిత్రీబాయి సామాజిక వేత్త, కవయిత్రి. కుల, లింగ వివక్షను రూపుమాపేందుకు తన జీవితాన్ని అంకితం చేశారు. సంఘ సంస్కరకు, విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు'' అని మోదీ కొనియాడారు.

పాక్‌వి ద్వంద్వ విధానాలు

- ఉగ్రవాదంపై డబుల్ గేమ్ ఆడుతోంది
- ఐరాసలో అమెరికా విదేశాంగ మంత్రి హేలీ

ఐరాస, జనవరి 3: ఉగ్రవాదంపై పోరు విషయంలో గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ డబుల్ గేమ్ ఆడుతోందని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ అన్నారు. పాక్‌కు రూ.1700 కోట్ల(255 మిలియన్ డాలర్ల) సైనిక సహాయాన్ని అమెరికా నిలిపేసిందని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అమెరికా ఈ విధంగా చేయడానికి చాలా స్పష్టమైన కారణముందని, పాక్ కొన్నేళ్లుగా డబుల్ గేమ్ ఆడుతోందని పేర్కొన్నారు. పాక్ మాతో కలిసి పనిచేస్తున్నట్లే ఉంటూ.. అఫ్ఘానిస్థాన్‌లో తమ దళాలపై దాడులు జరుపుతున్న ఉగ్రవాదులకు అండగా ఉంటోందని ఆమె వెల్లడించారు. పాక్ ఆడుతున్న డబుల్ గేమ్‌ను అమెరికా యంత్రాంగం ఏమాత్రం ఒప్పుకోదన్నారు. ఉగ్రవాదంపై పోరు విషయంలో పాక్ నుంచి ఇంకా ఎక్కువ సహకారం కోరుకుంటున్నట్లు చెప్పారు. కాగా, ఐరాసలో నిక్కీ హేలీ ప్రకటన చేసిన వెంటనే ఉగ్రవాదంపై వ్యతిరేకంగా పాక్ చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తామని అమెరికా అధ్యక్ష భవనం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు పాక్ ఇంకా చర్యలు తీసుకోవచ్చని.. మేము అదే కోరుకుంటున్నామని శ్వేతసౌధం అధికార ప్రతినిధి సారా శాండర్స్ తెలిపారు.

నొక్కానంటే ఒడ్సిపోతావ్!

మా బటన్ మరీ శక్తిమంతమైనది.. అది నొక్కానంటే సర్వనాశనమే



- ఉత్తరకొరియాకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జనవరి 3: అమెరికా, ఉత్తర కొరియా అధ్యక్షుల మధ్య మాటల యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. ఇద్దరు నేతలూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. నువ్వెంతంటే నువ్వెంత అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. అమెరికాపై వేయడానికి న్యూక్లియర్ బాంబు స్విచ్ తన టేబుల్‌పైనే సిద్ధంగా ఉంటుందని నార్త్ కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ హెచ్చరించిన విషయం తెలిసిందే. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీటుగా సమాధానమిచ్చారు. ''మీ కన్నా పెద్దది, చాలా శక్తివంతమైన బాంబు నా దగ్గర ఉంది.. ఆ స్విచ్ కూడా నా టేబుల్‌పైనే ఉంటుంది. అంతేకాదు.. అది ఫెయిలయ్యే చాన్సే లేదు'' అని ట్రంప్ ట్వీట్ చేశారు. కొత్త సంవత్సరం రోజున జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చారు కిమ్. అమెరికా మొత్తం కవరయ్యేలా ఓ ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్ తమ దగ్గర ఉన్నదని, దానికి సంబంధించిన స్విచ్ తన టేబుల్‌పైనే ఉంటుందని కిమ్ అన్నారు.

పాలస్తీనాకూ సాయం నిలిపివేస్తామని హెచ్చరిక

పాకిస్థాన్‌కు సైనిక సాయం నిలిపేసిన అమెరికా అదే విధంగా పాలస్తీనాకు కూడా హెచ్చరికలు జారీ చేసింది. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పాక్ సరైన చర్యలు తీసుకోవడంలేదని అమెరికా.. పాక్‌కు 255 మిలియన్ డాలర్ల సైనిక సాయాన్ని నిలిపేసిన సంగతి తెలిసిందే. శాంతి చర్చలకు అంగీకరించకపోతే పాలస్తీనాకు కూడా సాయం నిలిపేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్విట్టర్‌లో వెల్లడించారు. పాలస్తీనాకు సాయం చేయడం వల్ల అమెరికాకు ఎలాంటి ప్రశంస గానీ, గౌరవం గానీ దక్కట్లేదని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ రాజధానిగా జెరుసలేంను గుర్తించే అంశంపై ఇబ్బంది ఎదురవుతున్న నేపథ్యంలో ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలస్తీనా కోసం ఏటా వందల మిలియన్ల డాలర్లు వెచ్చిస్తున్నాం.. కానీ ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలకు పాలస్తీనా సుముఖత చూపించడం లేదని .. ఇక భవిష్యత్తులో మేము ఎందుకు సాయం చేయాలని ట్రంప్ ట్వీట్ చేశారు. శాంతి చర్చలను పాలస్తీనా నిరాకరిస్తూ ఉంటే అమెరికా ఆ దేశానికి సాయం నిలిపేస్తుందని ఐక్యరాజ్యసమితిలోని అమెరికా రాయబారి నిక్కీ హేలీ కూడా స్పష్టంచేశారు. పాలస్తీనా చర్చలకు అంగీకరించేవరకూ అమెరికా నుంచి నిధులు ఇవ్వకూడదని ట్రంప్ భావిస్తున్నట్లు హేలీ ఐరాస కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. జెరుసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా ఇటీవల అమెరికా గుర్తించిన సంగతి తెలిసిందే. దీన్ని పాలస్తీనా వ్యతిరేకిస్తోంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలస్తీనాకు చేసిన హెచ్చరికపై పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ వద్ద అధికార ప్రతినిధి నబిల్ అబు రుడీనా తీవ్రంగా స్పందించారు. పాలస్తీనా రాజ్యానికి శాశ్వత రాజధాని జెరూసలేం అని స్పష్టం చేశారు. ఇది బంగారానికో, బిలియన్లకో అమ్మకానికి లేదని అన్నారు. అధ్యక్ష ఎన్నికల సమయం నుంచే అక్కడి ప్రముఖ మీడియా సంస్థలపై గుర్రుగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ త్వరలో 'అత్యంత నిజాయితీ లేని, అవినీతి మీడియా' అవార్డులు ఇస్తానని వెల్లడించారు.



రజినీకాంత్, ఎమీ జాక్సన్

సౌదీలో తొలి ఇండియన్ సినిమా

సౌదీ అరేబియాలోని ప్రజలకు 1980 నుండి సినిమా థియేటర్లు అందుబాటులో లేని విషయం తెలిసిందే. ఇస్లామిక్ మత సిద్ధాంతాలకు సినిమాలు విరుద్ధం అంటూ అక్కడ అన్ని థియేటర్లను మూసివేశారు. అయితే ఖోబార్‌లో ఐమాక్స్ థియేటర్ ఒక్కటే నడుస్తోంది. ఈ థియేటర్‌లో కేవలం సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన డాక్యుమెంటరీలను మాత్రమే ప్రదర్శిస్తారు. దాదాపు 35 సంవత్సరాల తర్వాత సినిమా థియేటర్లను ప్రారంభించాలని నిర్ణయించింది సౌదీ ప్రభుత్వం. అక్కడ థియేటర్లు ప్రారంభించిన తర్వాత ప్రదర్శించబోయే తొలి సినిమా సౌత్ ఇండియాది కావడం విశేషం. రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న '2.0' చిత్రం సౌదీలో విడుదలవుతున్న తొలి సినిమాగా చెప్పుకోవచ్చు. తమిళ నూతన సంవత్సరాది అయిన ఏప్రిల్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళ భాషలతో కలిపి మొత్తం 15 భాషల్లో '2.0' విడుదలవుతుంది.



20 నుంచి బృందావనంలో సందడి

ఎన్నో సినిమాలకు రచన చేసిన శ్రీధర్ సీపాన 'బృందావనమది అందరిది' చిత్రంతో దర్శకునిగా మారుతున్న విషయం తెలిసిందే. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రంలో నటిస్తున్న నటీనటుల వివరాలను ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీధర్ సీపాన మాట్లాడుతూ ''ఈ సినిమాని కొత్తవాళ్ళతో చెయ్యాలన్న ఉద్దేశంతో ఉత్సాహవంతులైన యువతీ యువకులను ఆడిషన్స్‌కి పిలిచాం. ఈ ఆడిషన్స్‌కి చాలా మంచి స్పందన వచ్చింది. చిత్రంలోని ప్రధాన పాత్రల్లో గుంటూరు టాకీస్ ఫేమ్ సిద్ధు, నిర్మాత లగడపాటి శ్రీధర్ తనయుడు విక్రమ్, శీరత్ కపూర్, పృథ్వీ నటిస్తారు. మిగతా పాత్రలకు కొత్తవారినే ఎంపిక చేయడం జరిగింది. సంక్రాంతికి ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తాం. జనవరి 20 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: సి.రాంప్రసాద్.



మెహ్రీన్



కీర్తి సురేష్, పవన్ కల్యాణ్, అనూ ఇమ్మాన్యుయేల్


అందమైన భామలతో 'అజ్ఞాతవాసి'



పూజా హెగ్డే

నితిన్ జోడీగా...

'ఒక లైలా కోసం', 'ముకుంద', 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రాల్లో మెప్పించిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. ఇప్పుడు బెల్లంకొండ శ్రీనివాస్, శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'సాక్ష్యం' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. నితిన్ హీరోగా దిల్‌రాజు నిర్మిస్తున్న చిత్రం 'శ్రీనివాస కల్యాణం'లో హీరోయిన్‌గా నటించనుంది పూజా హెగ్డే. 2017లో 'శతమానం భవతి' సినిమాను తెరకెక్కించిన దర్శకుడు సతీష్ వేగేశ్న ఈ సినిమాను రూపొందించనున్నారు. త్వరలోనే సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. అలాగే పూజా హెగ్డే.. మహేష్, వంశీ పైడిపల్లి సినిమాలో కూడా హీరోయిన్‌గా నటించనుందని సమాచారం.



ప్రభాస్

డార్లింగ్ 'దండా'

ప్రస్తుతం 'సాహో' చిత్రీకరణలో బిజీ బిజీగా ఉన్నారు ప్రభాస్. ఈ సినిమా తర్వాత ప్రభాస్ ఏ సినిమా చేస్తాడనే దానిపై ఇంకా పూర్తి క్లారిటీ లేదు. 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ఓసినిమా చేస్తాడని అంటున్నారు. అలాగే ఓ బాలీవుడ్ మూవీలో నటించబోతున్నట్లు ప్రభాస్ స్వయంగా ప్రకటించారు. ఇంత వరకు బాగానే ఉంది. ప్రభాస్ పెద్దనాన్న కృష్ణంరాజు..తన గోపీకృష్ణా మూవీస్ బ్యానర్‌పై 'దండా' అనే టైటిల్‌ను రిజిష్టర్ చేశారట. ఈ టైటిల్ ప్రభాస్ కోసమేనని అంటున్నారు. టైటిల్ వింటుంటే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లా ఉంది. మరి దర్శకుడు, హీరోయిన్ ఎవరనే దానిపై త్వరలోనే క్లారిటీ రానుంది. గతంలో కృష్ణంరాజు నిర్మాతగా 'బిల్లా' చిత్రం చేశారు ప్రభాస్.

విజయ్ 62కి ఎ.ఆర్.మురుగదాస్



విజయ్



ఎ.ఆర్.మురుగదాస్

విజయ్, ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'తుపాకి', 'కత్తి' ఎంత పెద్ద హిట్ సినిమాలుగా నిలిచాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం రాబోతోంది. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని హయ్యస్ట్ బడ్జెట్‌తో నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించి ఫోటో షూట్ జరిగింది. ఆ స్టిల్స్‌ను విడుదల చేసింది సన్ పిక్చర్స్. ఈ చిత్రంలో విజయ్ సరసన కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇది విజయ్ నటిస్తున్న 62వ సినిమా కావడం విశేషం. ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తుండగా, గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ, ఎ.శ్రీకర్‌ప్రసాద్ ఎడిటింగ్ సమకూరుస్తారు. ఫిబవరిలో షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తారు.



అడివిశేష్

బాలీవుడ్ రీమేక్‌లో...

ప్రముఖ రచయిత చేతన్ భగత్ రాసిన పుస్తకం '2 స్టేట్స్'. దీని ఆధారంగా బాలీవుడ్‌లో '2 స్టేట్స్' అనే సినిమాను తెరకెక్కించారు. అర్జున్ కపూర్, అలియా భట్‌లు ఇందులో జంటగా నటించారు. సినిమా పెద్ద విజయాన్ని సాధించింది. ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేయాలని అప్పట్లో అనుకున్నారు. నాగచైతన్య హీరోగా నటిస్తాడని కూడా వార్తలు వినిపించాయి. అయితే ఎందుకనో అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఆ సినిమాను తెలుగులో రీమేక్ చేయబోతున్నారు. ఇందులో హీరోగా అడివి శేష్ నటించబోతున్నారు. అధికారిక సమాచారం త్వరలోనే రానుంది. 'క్షణం' సినిమాతో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు శేష్. ప్రస్తుతం 'గూఢచారి' సినిమా చేస్తున్నారు.

మరో మెగా హీరోతో...

'కృష్ణగాడి వీర ప్రేమగాథ'తో తెలుగు చిత్రసీమలోకి ఎంట్రీ ఇచ్చిన పంజాబీ సొగసరి మెహరీన్. తర్వాత ఈ అమ్మడు నటించిన 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విజయాలను సొంతం చేసుకోవడంతో గోల్డెన్ హీరోయిన్‌గా పేరు వచ్చేసింది. దీంతో ఈ అమ్మడుకి వరుస అవకాశాలు వస్తున్నాయి. ముఖ్యంగా మెగా కాంపౌండ్ హీరోలతో మెహరీన్‌కు జత కట్టే అవకాశం వస్తుంది. గతేడాది 'జవాన్'లో సాయిధరమ్ తేజ్‌తో కలిసి నటించింది.

ఇప్పుడు ఆ ఫ్యామిలిలోని మరో హీరో వరుణ్ తేజ్ సరసన కూడా నటించే అవకాశాన్ని సొంతం చేసుకుందని ఫిలింనగర్ వర్గాల సమాచారం. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్, వరుణ్ తేజ్ హీరోలుగా తెరకెక్కబోతున్న మల్టీస్టారర్ 'ఎఫ్2'లో ఒక హీరోయిన్‌గా మెహరీన్‌ను ఎంపికైనట్లు తెలుస్తుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం.

జనవరి 5న 'సారథి'



ధను క్రియేషన్స్ పతాకంపై అల్లం భువన్ దర్శకనిర్మాణంలో రూపొందిన చిత్రం 'సారథి'. రేవంత్ జి. హెచ్, సమ్మోహిత్, అనిత రాఘవ, తేజా రెడ్డిలు హీరో హీరోయిన్స్‌గా నటించారు. ఈ చిత్రం జనవరి 5న గ్రాండ్ రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో.. చిత్ర దర్శక నిర్మాత అల్లం భువన్ మాట్లాడుతూ ''ఇది నా మొదటి సినిమా.. హీరో, హీరోయిన్స్ బాగా నటించారు. సినిమా చాలా బాగా వచ్చింది. నిజాయితీగా ఉండటమే రాజకీయ నాయకుల, పోలీసుల విధి అనేది కాన్సెప్ట్. ఈనెల 5న సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాసంతా సినిమాలపైనే...

నందమూరి బాలకృష్ణ 102వ చిత్రం 'జైసింహా'. ఇందులో బాలకృష్ణతో నటించిన హీరోయిన్స్‌లో మలయాళీ కుట్టి నటాషా దోషి ఒకరు. ఈ అమ్మడు పుట్టి పెరిగిందంతా ముంబైలోనే. 'చిన్నప్పటి నుండి నటన అంటే ఎంతో ఆసక్తి. చిన్నప్పుడే ఒపెరా అనే సోప్ యాడ్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించాను. 2010లో మిస్ కేరళగా ఎంపికయ్యాను. తర్వాత మలయాళంలో కొన్ని సినిమాలు చేశాను. నా ఫోటోలు చూసిన దర్శకుడు కె.ఎస్.రవికుమార్ గారు నన్ను ఆడిషన్‌కు పిలిచారు. ఆడిషన్‌లో ఎంపికయ్యాను. ఈ సినిమాలో నేను విదేశాల నుండి ఇండియా వచ్చే అమ్మాయి పాత్రలో కనపడతాను. సినిమాలో బాలకృష్ణగారు చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారని చాలా మంది అన్నారు. కానీ ఆయన సెట్స్‌లో ఎంతో జోవియల్‌గా ఉంటారు. తెలుగు డైలాగ్స్ చెప్పడంలో ఎంతో సహాయం చేశారు. నేను డెంటిస్ట్ కోర్సు చేశాను. అలాగే క్లాసికల్ డాన్స్ కూడా నేర్చుకున్నాను. అయితే ప్రస్తుతం నా ధ్యాసంతా సినిమాలపైనే' అంటూ చెప్పుకొచ్చింది నటాషా దోషి.



నటాషా దోషి



'మనం' ఉన్నత స్థానానికి ఎదగాలి

- **అందరి మన్ననలు పొందాలి: అమర్‌నాథ్ రెడ్డి**
- **దిన పత్రిక క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి**


తిరుపతి, జనవరి 3 (మనం న్యూస్ బ్యూరో): ఏ రాజకీయ పార్టీకీ కొమ్ముకాయకుండా.. ప్రజా సమస్యలే అజెండాగా.. ప్రజల పక్షాన నిలిచి అక్షర యజ్ఞం చేస్తూ.. మనం దినపత్రిక దిన దిన ప్రవర్ధమానంగా వెలుగొంది ఉన్నత స్థానానికి ఎదగాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం చిత్తూరు జిల్లా పలమనేరులోని ఆయన స్వగృహంలో మనం దినపత్రిక క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మనం దినపత్రిక అత్యధిక సర్క్యులేషన్‌తో అందరి మన్ననలు పొందాలని అన్నారు. ప్రజల సమస్యలను వార్తలుగా రాయాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని సూచించారు. తక్కువ కాలంలో ఎక్కువ ప్రజాదరణ పొందడం మనం దినపత్రికకు సాధ్యమైందని మంత్రి ప్రశంసించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మనం దినపత్రిక రీజినల్ మేనేజర్ చెంగల్రాయులు (గాంధీ), చిత్తూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ కోలా లక్ష్మీపతి, ఏడీవీటీ ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి, స్టాఫ్ రిపోర్టర్లు కె. శ్రీనివాస్, గంటా సురేష్, పలమనేరు ఆర్సీ ఇన్‌చార్జ్ భాస్కర్‌రెడ్డి, పుంగనూరు రిపోర్టరు మహేష్ పాల్గొన్నారు.



తొలిరోజు విజయవంతం

అంకితభావంతో సేవ చేస్తే.. ప్రజల్లో సానుకూలత: చంద్రబాబు

- **జన్మభూమిపై వీడియో కాన్ఫరెన్స్**
- **ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు**
- **అడ్డంకులు సృష్టిస్తే చర్యలు: సీఎం**



అమరావతి, జనవరి 3 (మనం ప్రతినిధి): ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం తొలిరోజు విజయవంతమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రజాసేవ చేయాలన్న అంకితభావం ఉంటే.. ఎప్పటికైనా ప్రజలలో మనపై సానుకూలత ఏర్పడుతుందని అన్నారు. బుధవారం తన నివాసం నుంచి 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ''ఐదో విడత జన్మభూమి-మాఊరు తొలిరోజు విజయవంతమైంది. ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం మనందరికీ స్ఫూర్తిదాయకం. గ్రామ, వార్డు సభలలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలి. కృష్ణా పుష్కరాలలో 90 శాతం సంతృప్తిని సాధించాం. జన్మభూమిలో కూడా అదే స్ఫూర్తి కనిపించాలి. అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా, సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఎంతో ఉంది'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

అవగాహన, చైతన్యంతోనే ప్రజారోగ్యం

తినే తిండి, తాగేనీరు, పరిసరాల పరిశుభ్రత, జీవన విధానంపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని సీఎం అన్నారు. అంటు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహారంలో పోషక విలువలు పెంచుతున్నామన్నారు. శారీరక వ్యాధులు చాలా వరకు నియంత్రిస్తున్నామని, మానసిక వ్యాధులపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడం, చైతన్యపరచడం ద్వారానే అధిగమించగలమన్నారు.

జన్మభూమిలో గ్రేడింగ్ విధానం

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహిస్తున్న జన్మభూమిపై రోజువారీ గ్రేడింగ్ విధానాన్ని ఇస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. రోజువారీ నివేదికలు వెంటనే పంపించాలని ఆయా జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నివేదికలు సకాలంలో పంపినందుకు 40%, గ్రామస్థాయిలో 40%, జిల్లాస్థాయిలో సెంటిమెంట్ అనాలిసిస్ విభాగానికి 20% మార్కులు ఇస్తున్నట్లు వెల్లడించారు. తొలిరోజు విజయనగరం, కడప, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలు 'ఏ' గ్రేడ్ సాధించాయని చెప్పారు. నెల్లూరు, విశాఖ, కర్నూలు, ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు 'బి' గ్రేడ్ వచ్చిందన్నారు. అన్ని జిల్లాలు ఏ గ్రేడ్ సాధించేందుకు పోటీ పడాలని సూచించారు. గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగా, పూర్తి క్రమశిక్షణతో జరపాలని సూచించారు. ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైనవి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు.

ప్రజాభిప్రాయం తీసుకుంటాం

అర్హులందరికీ ఫింఛన్లు సకాలంలో అందుతున్నాయా లేదా? రేషన్ సకాలంలో అందుతోందా? ఫిర్యాదులపరిష్కారం ఎలా ఉంది? బాగుందా? లేదా? చంద్రన్న భీమా మీ గ్రామంలో అమలు అవుతోందా? లేదా? ఉచిత వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలలో సేవలు ఎలా ఉన్నాయి? సంతృప్తిగా ఉన్నాయా? లేదా? వివిధ అంశాలపై జన్మభూమి అధికారుల అవగాహన కల్పిస్తున్నారా లేదా? అనే అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. గుంటూరు, పశ్చిమగోదావరి, నెల్లూరు, కృష్ణా, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో తొలిరోజు ప్రజల్లో 70% నుండి 80% వరకూ సంతృప్తి కలిగిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయని, అనంతపురం, విశాఖపట్నం, కడప, కర్నూలు జిల్లాల్లో 60-70% సంతృప్తి వ్యక్తం అయిందని చంద్రబాబు తెలిపారు. 80% శాతం సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు మార్గదర్శకం చేశారు.

అత్యున్నత సమాజం ఏర్పడాలి

''గ్రామాలు, మున్సిపల్ వార్డులు అత్యుత్తమంగా రూపొందాలి, అత్యున్నత సమాజం ఏర్పడాలి. 16 వేల గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో జరిగే అతిపెద్ద సామూహిక ప్రజాసేవా కార్యక్రమం జన్మభూమి. ప్రజా సంతృప్తి, అభి వృద్ధి, సంక్షేమం, అధికారుల పనితీరుకు కొల మానం. 80% సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలి. ప్రజల్లో అవగాహన, పోటీతత్వం పెంచడం మనందరి బాధ్యత. అత్యున్నత జీవన ప్రమాణాలున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలి'' అని చంద్రబాబు అధికారులకు సూచించారు.

బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.. ఆదాయంపై ఉన్న మక్కువ దేవుడిపై లేదు

- **ఆలయాలపై నేతలు, అధికారుల పెత్తనం వద్దు**
- **దుర్గగుడిని సమూలంగా ప్రక్షాళన చేయాలి**
- **తాంత్రిక పూజలపై ఆధ్యాత్మిక వేత్తల ఆగ్రహం**



విశాఖపట్నం, జనవరి 3 (మనం న్యూస్): విజయవాడ దుర్గ గుడిలో తాంత్రిక పూజల వ్యవహారంపై ఆధ్యాత్మిక గురువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గుడిలో తాంత్రిక పూజలు జరగడమంటే హిందూ ధార్మిక వ్యవస్థను దెబ్బతీయటమేనని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఈ అపచారానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఉత్తరాంధ్రా సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వామి, శ్రీరామ్ సేన అధ్యక్షుడు శ్రీరామ్ తురగా డిమాండ్ చేశారు. బుధవారం విశాఖపట్నంలో వారు ఈ సంఘటనపై విడివిడిగా మీడియాతో మాట్లాడారు. త్వరలో పీఠాధిపతుల సమావేశం ఏర్పాటు చేసి దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనంపై హైకోర్టులో కేసు వేస్తానని స్వరూపానందేంద్ర స్పష్టం చేశారు. దేవాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి స్వలాభం చూసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర పాలకపక్ష పెద్దలకు దేవాలయ ఆదాయంపై ఉన్న మక్కువ దేవుడిపై లేకపోవడం వల్లే ఇటువంటి దారుణాలు చోటు చేసుకొంటున్నాయని విమర్శించారు. దుర్గగుడిలో గత రెండేళ్లుగా జరిగిన అనేక అపచారాలు దేశానికే అరిష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఆలయంలో క్షుద్ర, తాంత్రిక పూజలు చేయడం శోచనీయమన్నారు. దుర్గగుడి ఈవోపై ఎన్నో ఆరోపణలున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తాంత్రిక పూజల విషయంలో బాధ్యులైన అధికారుల జోలికి వెళ్లకుండా అర్చకులను బాధ పెట్టడం సరికాదని స్వరూపానందేంద్ర అభిప్రాయపడ్డారు. దుర్గగుడిలో జరిగిన అపచారం క్షమించరానిదని శ్రీనివాసానంద సరస్వతి స్వామి అన్నారు. హిందూ ధర్మ రక్షణకు శతాబ్దాల క్రితం దాతలు ఇచ్చిన భూములతో వ్యాపారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో తాంత్రిక పూజలతో వ్యవస్థనే భ్రష్టు పట్టిస్తోందని ధ్వజమెత్తారు. హిందూ ధర్మ పరిరక్షకులు ఇప్పటికైనా మేల్కొని ప్రభుత్వం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా గళం విప్పాలని అన్నారు. ఆలయాలపై రాజకీయనేతలు, అధికారుల పెత్తనం తగ్గాలని అన్నారు. దుర్గ గుడిని సమూలం గా ప్రక్షాళన చేయాలని, ఆధ్యాత్మిక తప్పిదాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ముఖ్యమంత్రి నివాసానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఇంత అపచారం జరిగిందంటే ఇందులో రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న అనుమానాలు వస్తున్నాయని అన్నారు.

అంతర్గత విచారణ

- **త్వరలో ప్రభుత్వానికి నివేదిక**
- **తాంత్రిక పూజలు జరగలేదు**
- **దుర్గగుడి ఈవో సూర్యకుమారి**



విజయవాడ, జనవరి 3: దుర్గగుడిలో తాంత్రిక పూజలు నిర్వహించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అంతర్గత విచారణ చేస్తున్నట్టు ఆలయ ఈవో సూర్యకుమారి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎలాంటి తాంత్రిక పూజలు జరగలేదని చెప్పారు. తాంత్రిక పూజలు అంటే ఏంటో తనకు తెలియదని, దీనిపై అంతర్గత విచారణ జరుపుతున్నామని, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. డిసెంబరు 26వ తేదీ రాత్రి సాధారణంగా చేసే అలంకారమే జరిగిందని, అందుకు సంబంధించిన సామాగ్రిని మాత్రమే లోనికి తీసుకెళ్లారని వెల్లడించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా 14మందికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. అలాగే సీసీటీవీ ఫుటేజ్ ఇచ్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఈవో స్పష్టం చేశారు. బదిలీకి సంబంధించి తనకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని తెలిపారు. గుడిలో తనపై చాలామందికి కోపం ఉందని, పాలకమండలికి, తనకు మధ్య కొంత దూరం ఉందని చెప్పారు. నిబంధనల ప్రకారం పనిచేశానని, హుండీ ఆదాయం 20 శాతం, టికెట్ ఆదాయం 80 శాతం పెరిగిందని తెలిపారు. ఒక్క కార్తికమాసంలో కోటి రూపాయల ఆదాయం పెరిగిందని సూర్యకుమారి చెప్పారు.



ప్రజల వద్దకే వచ్చి సమస్యల పరిష్కారం

- **రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో మెరుగైన పాలన.. జన్మభూమిలో ఐటీ మంత్రి నారా లోకేశ్**

విజయవాడ, జనవరి 3 (మనం న్యూస్ బ్యూరో): 'జన్మభూమి -మా ఊరు' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వచ్చి ఆ ప్రాంతంలోని వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని పంచాయతీ రాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా మెరుగైన పాలన అందిస్తున్నామన్నారు. బుధవారం విజయవాడ సమీపంలోని పోరంకి గ్రామంలో జరిగిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీ సమస్యలను మీ ప్రాంతానికే వచ్చి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతున్నాం' అని అన్నారు. ఏదైనా ఒక ప్రాంతంలో సమస్యల గురించి ప్రజలు ఫిర్యాదులు చేయకముందే వాటి గురించి తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని లోకేశ్ చెప్పారు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాని సీఎం చంద్రబాబు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. గతంలో గ్రామాలలో విద్యుత్ సరిగా ఉండేది కాదని, ఇప్పుడు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని గుర్తు చేశారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, 157 మేజర్ గ్రామపంచాయతీల్లో భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అంతకుముందు జడ్పీ పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలను మంత్రి ప్రారంభించారు. అనంతరం స్థానిక రైతు ఎం.రాధాకృష్ణారావుకు ట్రాక్టర్‌ను అందజేశారు. మహిళలకు నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. మతి చేతుల మీదగా మహిళా సంఘాలకు వివిధ పథకాల కింద రూ.4,24,35,000 రుణాలు అందించారు. కాగా, ఈ కార్యక్రమంలో ఎంపీ కొనకళ్ల నారాయణ, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు, పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు విశేష స్పందన

- **ప్రతిభ గల విద్యార్థులకు సదావకాశం: ఎంకే మీనా**

అమరావతి, జనవరి 3 (మనం ప్రతినిధి): జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా పర్యాటక- సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న సాంస్కృతిక పోటీలకు విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సంగీతం, నృత్యం, ముఖాభినయం, కథలు చెప్పటం, పద్యాలు, శ్లోకాల పఠనం, చర్చ, వ్యాసరచన, పాటల రచన, కథా రచన, నినాదాల కూర్పు, కవిత్వం, చిత్రలేఖనం అంశాల్లో గ్రామ, వార్డు స్థాయిల్లో పోటీలు జరుగుతున్నాయని మీనా పేర్కొన్నారు. విద్యార్థులను మూడు కేటగిరిలుగా విభజించినట్టు చెప్పారు. 5 నుంచి 8వ తరగతి వరకు ఒక విభాగం, 9 నుంచి ఇంటర్మీడియట్ వరకు రెండో విభాగం, డిగ్రీ విద్యార్థులను మూడో విభాగంగా విభజించినట్టు తెలిపారు. ఈ నెల 9న గ్రామ స్థాయి పోటీలు ముగుస్తున్నాయని, విజేతలకు 10న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారికి 11న మండల స్థాయిలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ పరంగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. మండల స్థాయి విజేతలకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణ క్యాలెండర్‌ను త్వరలో విడుదల చేస్తామని, ఉగాది రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని మీనా వెల్లడించారు.

కూలిన వలస బతుకులు


- **లారీ బోల్తా.. ఏడుగురి మృతి**
- **మరో ఐదుగురికి తీవ్ర గాయాలు**
- **ఉపాధి కోసం నల్లగొండలో జీవనం**
- **కర్నూలు జిల్లా కొత్తపేటలో విషాదం**



ఆలూరు, జనవరి 3 (మనం న్యూస్ బ్యూరో): సొంత ఊరిలో కరువుతో ఉపాధి కోసం పక్క రాష్ట్రానికి చేరారు. అక్కడ వ్యవసాయ కూలీలుగా పొట్ట పోసుకుంటున్నారు. సంక్రాంతి దగ్గర పడుతోంది కదా.. కుటుంబ సభ్యులు బంధుమిత్రుల మధ్య సంబరంగా పండుగ జరుపుకోవాలని సొంత గూటికి తిరుగుప్రయాణమయ్యారు. కానీ విధి వెక్కిరించింది. ఊరికి మరి కొద్ది దూరం ఉందనగా.. మృత్యువు కబలించింది. లారీ బోల్తా పడి ఏడుగురు మరణించగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా ఆస్పరి మండల సమీపంలోని రైల్వే గేటు దగ్గర బుధవారం ఈ ఘోర ప్రమాదం జరిగింది. కర్నూలు జిల్లా హొళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన మూడు కుటుంబాలకు చెందిన 19 మంది తెలంగాణలోని నల్లగొండ జిల్లాలో వలస వెళ్లారు. అక్కడ మూడు నెలలుగా వరి, పత్తి పొలాల్లో కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్కడ పనులు ముగియడంతో పాటు సంక్రాంతి పండుగ దగ్గరపడడంతో తమ సొంత ఊరికి బయలు దేరారు. మూడు నెలలుగా సంపాదించిన డబ్బుతోపాటు బియ్యం, ఇతర సరుకులతో మినీ లారీలో ప్రయాణమయ్యారు. ఇక మరో గంటలో ఊరికి చేరుతారనగా.. ఆస్పరి రైల్వే ట్రాక్ వద్దకు మినిలారీ టైర్ పేలింది. దీంతో అదుపు తప్పి లారీ బోల్తా పడి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నరసమ్మ, గోవిందమ్మ, శేకమ్మ, హనుమంతమ్మ మృతి చెందారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్సులో ఆదోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. మార్గమధ్యంలో నారాయణ, ఈరమ్మ మృతి చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగమ్మ అనే మహిళ మరణించింది. నారాయణ భార్య, కుమార్తె స్రవంతి(10) పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. బాధితులంతా కొత్తపేటకు చెందిన వారు కావడంతో ఆ గ్రామం విషాదంలో మునిగిపోయింది. చిన్నప్పటి నుంచి తమ పాటు పుట్టి పెరిగి.. బతుకు గడవక దూర ప్రాంతాలకు వెళ్లి.. పండుగకు ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరగడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను పరిమర్శిం చారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఎస్పీ గోపినాథ్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాబుకు ఎందుకు ఓట్లేయాలి?

- **ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు**
- **చిత్తూరు పాదయాత్రలో జగన్**



చిత్తూరు, జనవరి 3: నాలుగేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ మేలు చేయని చంద్రబాబు నాయుడుకు ఓట్లేందుకు వేయాలని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. తనకు ఓట్లు వేయకపోతే ప్రజలు సిగ్గుపడాలన్న చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. ప్రజాసం కల్పయాత్రలో భాగంగా బుధవారం చిత్తూరు జిల్లా కిలికిరి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి పదవి కోసం చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పులివెందుల నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తే.. చంద్రబాబు అక్కడికి వెళ్లి ఫోజు కొడు తున్నారని విమర్శించారు. వైఎస్ పాలనలో దాదాపు 85 శాతం పనులు పూర్తి చేస్తే.. మిగతా పనులు పూర్తి చేయలేని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ప్రాజెక్టులు కట్టిన వారు గొప్పా? గేట్లు ఎత్తిన వారు గొప్పా అని ప్రశ్నించారు. ''చంద్రబాబుకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని అడుగుతున్నాను. నీ పాలనలో ఆర్టీసీ చార్జీలు మూడు సార్లు, కరెంటు చార్జీలు పెంచావు. ఇంటి పన్ను కూడా వదిలిపెట్టలేదు. పెట్రోలు ధరలు విపరీతంగా పెంచావు. ఇదే రేషన్ షాపుల్లో గతంలో 9 రకాల సరుకులు దొరికేవి. ఇవాళ ఒక్క బియ్యం తప్ప ఏమీ దొరకడం లేదు. అధికారంలోకి రాకముందు ఒక మాదిరి, అధికారంలోకి వచ్చాక మరో రకంగా ప్రవర్తిస్తున్నారు'' అని జగన్ అన్నారు.



బెజవాడ బుక్ ఫెస్టివల్‌లో ఆందోళన

- **తెలంగాణ రచయిత స్కైబాబా క్షమాపణకు భాషాభిమానుల పట్టు**
- **'సమైక్యాంధ్ర' సమయంలో ఆంధ్రులను కించపరిచారని నిరసన**

విజయవాడ, జనవరి 3: విజయవాడలో జరుగుతున్న బుక్ ఫెస్టివల్‌లో బుధవారం భాషాభిమానులు ఆందోళనకు దిగారు. సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో ఆంధ్రులను కించపరుస్తూ తెలంగాణ రచయిత స్కైబాబా రాసిన రచనలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించుకోవాలని, మా తెలుగు తల్లి పాట పాడాలని పట్టుబట్టారు. సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో స్కైబాబా రాసిన రచనలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని నిరసన తెలిపారు. స్కైబాబా రాసిన పుస్తకానికి సంబంధించి తాము ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయడం లేదని, ఉద్యమ సమయంలో ఆంధ్రులను ఉద్దేశించి ఆయన రాసిన అసభ్యకర రచనలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు.



పెరిగినవి	%	తగ్గినవి	%
అదాని పోర్ట్స్	2.78	డాక్టర్ రెడ్డీస్	-2.29
లార్సెన్	2.17	విప్రో	-2.59
ఐసీఐసీఐ బ్యాంక్	1.88	ఓఎన్‌జీసీ	-1.65
యస్ బ్యాంక్	1.33	బజాజ్ ఆటో	-1.61
కోల్ ఇండియా	0.72	మారుతీ సుజుకి	-1.35




పెరిగినవి	%	తగ్గినవి	%
అదాని పోర్ట్స్	2.58	డాక్టర్ రెడ్డీస్	-2.91
లార్సెన్	2.04	విప్రో	-2.75
ఐడియా సెల్యూలర్	1.99	ఓఎన్‌జీసీ	-1.73
ఐసీఐసీ బ్యాంక్	1.71	బజాజ్ ఆటో	-1.63
హిందాల్కో	1.69	మారుతీ సుజుకి	-1.44


టాప్ లూజర్స్ 3 జనవరి

33,793.38

పాయింట్లు	బి.ఎస్.ఇ	%
2336.20	డాక్టర్ రెడ్డీస్	-2.97%
310.65	విప్రో	-2.59%
193.70	ఓఎన్‌జీసీ	-1.65%
3241.00	బజాజ్ ఆటో	-1.61%
9416.75	మారుతీ సుజుకి	-1.35%
433.20	టాటా మోటార్స్	-1.29%
1852.65	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	-1.07%
1019.10	ఇన్ఫోసిస్	-1.01%
177.00	ఎన్‌టీపీసీ	-0.98%
569.25	సన్ ఫార్మా	-0.39%


బి.ఎస్.ఇ సెన్సెక్స్ -18.88





జోజిలా ప్రాజెక్టుకు ఆమోదం

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్‌లో రూ. 6,809 కోట్ల వ్యూహాత్మక జోజిలా కనుమ సొరంగ మార్గ నిర్మాణానికి ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. శ్రీనగర్, కార్గిల్, 'లె'ల మధ్య అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ రాకపోకలు సాగే విధంగా ఈ మార్గం వీలు కల్పిస్తుంది. శీతాకాలంలో భారీ హిమపాతం కారణంగా ఈ ప్రాంతానికి మిగిలిన ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. శ్రీనగర్- కార్గిల్- 'లె' నేషనల్ హైవేలో సముద్ర మట్టానికి 11,578 అడుగుల ఎత్తున జోజిలా కనుమ ఉంది. శీతాకాలంలో (డిసెంబర్-ఏప్రిల్ మధ్య) అధిక హిమపాతం, మంచు చెరియలు విరిగిపడడం కారణంగా ఈ దారి మూతపడుతుంది. దాంతో 'లె'-లడఖ్ ప్రాంతానికి కశ్మీర్‌తో సంబంధాలు తెగిపోతాయి. ''శ్రీనగర్-'లె' సెక్షన్‌ని నేషనల్ హైవే-1ఏని కలిపే ఎప్రోచ్ దారులు జమ్ము కశ్మీర్‌లో 95 కిలోమీటర్ల వద్ద, 118 కిలోమీటర్ల వద్ద రెండు ఉన్నాయి. వాటిని మినహాయిస్తూ, సమాంతర ఎస్కేప్ (ఈగ్రెస్) సొరంగంతోపాటు, వాహనాలు వెళ్ళేందుకు, వచ్చేందుకు 2 లేన్‌లతో జోజిలా సొరంగ నిర్మాణం, ఆపరేషన్-మెయింటినెన్స్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గల ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ ఉప సంఘం ఆమోదం తెలిపింది. ఇంజనీరింగ్, కొనుగోళ్ళు, నిర్మాణం (ఇ.పి.సి) మోడ్‌పై ఆమోదం తెలిపింది'' అని రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.







ఏడేళ్ళలో పూర్తి

జమ్ము కశ్మీర్‌లో జోజిలా కనుమ సొరంగ నిర్మాణానికి రూ. 4,899 కోట్లతో అత్యల్ప బిడ్డర్‌గా ఆవిర్భవించినట్లు ఐ.ఎల్ అండ్ ఎఫ్.ఎస్. ట్రాన్స్‌పోర్టేషన్ గత ఏడాది జూలైలో పేర్కొంది. ''ఎగువ పేర్కొన్న (జోజిలా సొరంగ) ప్రాజెక్టుకు కంపెనీ అత్యల్ప బిడ్డర్‌గా అవతరించిందని తెలుపడానికి సంతోషిస్తున్నాం. కంపెనీ రూ. 4,899.42 కోట్ల మొత్తాన్ని కోట్ చేసింది. నిర్మాణం 2,555 రోజుల్లో (7 ఏళ్ళలో) పూర్తవుతుంది'' అని ఐ.ఎల్ అండ్ ఎఫ్.ఎస్. ట్రాన్స్‌పోర్టేషన్ తెలిపింది. ''లె' లడఖ్ ప్రాంత వాసులు పడుతున్న కష్టాలను మేం అర్థం చేసుకోగలం. శీతాకాలాల్లో ఈ ప్రాంతానికి, మిగిలిన భారతదేశంతో సంబంధాలు ఆరు నెలలపాటు తెగిపోతున్నాయి. ఈ ప్రాజెక్టును మేం చేపట్టితీరుతాం'' అని రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇంతకుముందు చెప్పారు. ఈ ప్రాజెక్టును మొదట ఐ.ఆర్.బి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు కేటాయించారు. కానీ, రవాణా మంత్రిత్వ శాఖ 2016 మార్చి 1న ''రీ-బిడ్డింగ్'' నిర్వహించింది. ఈ కాంట్రాక్టును ప్రదానం చేసేటప్పుడు మార్గదర్శక సూత్రాలు ఉల్లంఘించారని కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ ఆరోపించడంతో, గడ్కరీ అధ్యక్షతన సాగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆ ''రీ-బిడ్డింగ్'' నిర్ణయం తీసుకున్నారు. అయితే, దిగ్విజయ్ ఆరోపణలను మంత్రిత్వ శాఖ ఖండించింది.

ఏడాది పొడవునా టూరిస్టులు

జమ్ము కశ్మీర్‌లో వ్యూహాత్మకంగా ముఖ్యమైన 'లె' ప్రాంతానికి అన్ని వాతావరణ పరిస్థితులలోనూ 'కనెక్టివిటీ' కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆశయం. కనుమలలో కురిసే హిమం, మంచు చెరియలు విరిగిపడే ప్రమాదం వల్ల ప్రస్తుతం ఈ ప్రాంతం మహా అయితే 6 నెలలు మాత్రమే అందుబాటులో ఉంటోంది. ''గగన్‌గిర్ వద్ద నిర్మిస్తున్న 6.5 కిలోమీటర్ల నిడివిగల జడ్-మార్హ్ సొరంగం, ఇతర ప్రాజెక్టులతోపాటు, ఈ ప్రాజెక్టు కశ్మీర్ లడఖ్‌ల మధ్య సురక్షితమైన, వేగవంతమైన, చౌకయైన 'కనెక్టివిటీ'ని కల్పిస్తుంది'' అని ఆ ప్రకటన తెలిపింది. స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సూచించింది. సొరంగ మార్గ నిర్మాణం పూర్తయితే, స్థానిక వ్యాపార సంస్థలు జాతీయ మార్కెట్‌తో అనుసంధానమవుతాయి కనుక ఉపాధి అవకాశాలు బ్రహ్మాండంగా పెరుగుతాయని, అందమైన ఈ ప్రాంతం ఏడాది పొడవునా టూరిస్టులను ఆకర్షించగలుగుతుందని ప్రభుత్వం పేర్కొంది.

సర్వతోముఖ అభివృద్ధి

శ్రీనగర్- కార్గిల్- 'లె' మధ్య అన్ని వాతావరణ పరిస్థితులలోనూ రాకపోకలు సాగడానికి మాత్రమే కాక, ఈ ప్రాంతాల మధ్య సర్వతోముఖ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమైక్యత సాధనకు ఈ ప్రాజెక్టు తోడ్పడుతుంది. ''ఈ ప్రాజెక్టుకి వ్యూహాత్మక, సామాజిక-ఆర్థిక ప్రాధాన్యం ఉంది. జమ్ము కశ్మీర్‌లో ఆర్థికంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇదొక సాధనం కానుంది'' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఏడేళ్ళు పట్టవచ్చు. ''ప్రాజెక్టు సివిల్ కన్‌స్ట్రక్షన్ వ్యయం రూ. 4,899.42 కోట్లు. ప్రాజెక్టు మొత్తం మూలధన వ్యయం రూ. 6,808.69 కోట్లు. దీనిలో భూసేకరణ, రిసెటిల్‌మెంట్, పునరావాసం, నిర్మాణానికి ముందు సాగే పలు కార్యకలాపాల వ్యయం కూడా ఇమిడి ఉంది. సొరంగ మార్గానికి నాలుగేళ్ళపాటు మెయింటినెన్స్, ఆపరేషన్ కయ్యే వ్యయం కూడా అందులో కలిపి ఉంది'' అని ఆ ప్రకటన వెల్లడించింది. రాష్ట్రంలోని బాల్‌తాల్, మీనామార్గ్‌లతో ఉన్న ఎప్రోచ్‌లను మినహాయించి 14.2 కిలోమీటర్ల నిడివిగల ఈగ్రెస్ సొరంగంతోపాటు, 14.15 కిలోమీటర్ల నిడివిగల రెండు లేన్‌ల బై-డైరెక్షనల్ సింగిల్ ట్యూబ్ సొరంగ నిర్మాణం ఈ ప్రాజెక్టు లక్ష్యం. జాతీయ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఎన్.హెచ్.ఐ.డి.సి.ఎల్) ద్వారా రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును అమలుజరుపుతుంది.

పేమెంట్ బ్యాంకింగ్‌లో పోస్టల్ సిబ్బందికి తర్ఫీదు

న్యూఢిల్లీ: పేమెంట్ బ్యాంకింగ్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ఆ సంస్థతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ (ఐ.ఐ.సి.ఏ) ఒప్పందం కుదుర్చుకుంది. ''ప్రవర్ధమాన రంగం పేమెంట్ బ్యాంకింగ్‌లో రిసెర్చ్ చైర్‌లను ఏర్పాటు చేయడం ద్వారా పరిశోధనకు మద్దతు కల్పించడంతోబాటు, అధికారులు/ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఐ.పి.పి.బి. సామర్థ్య నిర్మాణ కీలక బాధ్యతను ఈ ఒప్పందం కింద ఐ.ఐ.సి.ఏ.కి అప్పగించారు'' అని ఆధికారిక ప్రకటన ఒకటి వెల్లడించింది. ''హరిత విప్లవం, క్షీర విప్లవం తర్వాత, భారతదేశంలో ఫైనాన్షియల్ విప్లవం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను రూపాంతరం చెందించనుంది'' అని కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ చెప్పారు. పోస్టాఫీసుల భారీ నెట్‌వర్క్ ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐ.పి.పి.బి) భారతదేశంలో ఫైనాన్షియల్ సమ్మిళిత లేమి సమస్యను సమర్థంగా ఎదుర్కోగలదని శ్రీనివాస్ చెప్పారు. ''భారతీయ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని ఇస్తున్న కీలక అంశం కుటుంబాల పొదుపు మొత్తాలను సమీకరించడం. ఈ పనిని తపాలా శాఖ ఏనాటి నుంచో నిర్వహిస్తోంది'' అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ కార్యదర్శి ఏ.ఎన్. నందా చెప్పారు. దేశ జనాభాలో ఒక మేజర్ వర్గం నియత బ్యాంకింగ్ పరిధికి బయటనే ఉంది. వారిని ''ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్'' లోకి తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఐ.పి.పి.బి. అగ్రగామి కాగలదని ఆ ప్రకటన తెలిపింది.

విద్యుదుత్పాదనలో ఎన్.టి.పి.సి. రికార్డు

న్యూఢిల్లీ: ప్రభుత్వ యాజమాన్యంలోని జాతీయ తాప విద్యుదుత్పాదన సంస్థ (ఎన్.టి.పి.సి) అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో అత్యధికంగా 67,781 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పాదన చేసింది. 51,383 మెగావాట్ల ఉత్పాదన సామర్థ్యం కలిగిన ఎన్.టి.పి.సి. ఒక త్రైమాసికంలో ఇంత పెద్దయెత్తున విద్యుదుత్పాదన సాధించడం ఇదే మొదటిసారి. గత ఏడాది అదే కాలంలో 61,400 మిలియన్ యూనిట్ల ఉత్పాదన నమోదు చేసిన ఎన్.టి.పి.సి. 10.39 శాతం పెరుగుదలను కనబరుస్తూ 2017-18లో 67,781 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పాదనను సాధించింది. ప్రస్తుత సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో (2017 ఏప్రిల్-డిసెంబరు) ఎన్.టి.పి.సి. 4,415 మెగావాట్ల సామర్థ్య కమర్షియల్ డిక్లరేషన్ సాధించింది. భారత ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ఆ విధానాన్ని అనుసరించి కంపెనీ కూడా హరిత అడుగుజాడను పెంచుకుంటోంది. సౌర, పవన విద్యుత్ కేంద్రాల నుంచి ఈ సంవత్సరంలో ఇంతవరకు అది 912 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పాదన నమోదు చేసింది. గత ఏడాది అదే కాలంలో నమోదు చేసిన దానికన్నా అది దాదాపు 3 రెట్లు ఎక్కువ. ఇరవై గిగావాట్ల (ఒక గిగావాట్ వెయ్యి మెగావాట్లతో సమానం) విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని సంతరించుకునే పనులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయని కంపెనీ వెల్లడించింది. రానున్న సంవత్సరాలలో భారతదేశ వృద్ధికి శక్తినందించే పనిని ఎన్.టి.పి.సి. కొనసాగించనుంది.

గోనె సంచుల వాడకంపై నిబంధన పొడిగింపు

న్యూఢిల్లీ: ఆహార పదార్థాలు, చక్కెర ఉత్పత్తుల ప్యాకేజింగ్‌కు గోనె సంచులను వాడి తీరాలన్న నిబంధనను 2018 జూన్‌తో ముగిసే సంవత్సరానికి పొడిగిస్తున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ ఉప సంఘం (సి.సి.ఇ.ఏ) బుధవారం వెల్లడించింది. జనపనార రంగ కోర్ డిమాండ్‌ను నిలబెట్టేందుకు ఈ చర్య సహాయపడుతుంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశా, అసోం, ఆంధ్ర ప్రదేశ్, మేఘాలయ, త్రిపురలలో ఈ రంగంపై ఆధారపడుతున్న కార్మికులు, రైతుల జీవనోపాధికి ఊతం ఇస్తుంది. ''1987 నాటి జ్యూట్ ప్యాకేజింగ్ మెటీరియల్ (జె.పి.ఎం) చట్టం కింద మేండేటరీ ప్యాకేజింగ్ నిబంధనలను సి.సి.ఇ.ఏ పొడిగించింది'' అని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం, ఆహార ధాన్యాలలో 90 శాతం, చక్కెర ఉత్పత్తులలో 20 శాతం గోనె సంచులలో తప్పనిసరిగా ప్యాక్ చేయవలసి ఉంటుంది. మొత్తం ఆహార ధాన్యాలను గోనె సంచులలో మూటగట్టడానికే ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సి.సి.ఇ.ఏ నిర్ణయించింది. అవసరాలకు తగ్గట్లుగా జౌళి పరిశ్రమ సంచులను సరఫరా చేయగలిగితే, మొత్తం వాటినే ఉపయోగించవలసి ఉంటుంది. జౌళి పరిశ్రమ ప్రధానంగా ప్రభుత్వంపైనే ఆధారపడుతోంది. ప్రభుత్వం ఏటా రూ. 5,500 కోట్లకు పైగా విలువైన జనపనార ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. జీవనోపాధి కోసం దాదాపు 3.7 లక్షల మంది కార్మికులు, సుమారుగా 40 లక్షల మంది రైతులు జౌళి రంగంపై ఆధారపడుతున్నారు. ఈ రంగం అభివృద్ధికి సమన్వయంతో కూడిన ప్రయత్నాలు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జౌళి రంగంలో డిమాండ్‌ను పెంపొందించే లక్ష్యంతో బంగ్లాదేశ్, నేపాల్ నుంచి దిగుమతి చేసుకునే జనపనార వస్తువులపై 2017 జనవరి 5 నుంచి ప్రభుత్వం డెఫినిటివ్ యాంటీ డంపింగ్ సుంకాన్ని విధించింది. అది దేశీయ మార్కెట్‌లో భారతీయ జౌళి పరిశ్రమకు 2 లక్షల మిలియన్ టన్నుల జౌళి వస్తువులకు అదనపు డిమాండ్ కల్పించింది.




రవాణా మెరుగుదలకు బ్రిటన్‌తో ఎం.ఓ.యూ

న్యూఢిల్లీ: దేశంలో ప్రజా రవాణా సదుపాయాలను మెరుగుపరచేందుకు భారతదేశానికి, లండన్ ట్రాన్స్‌పోర్టేషన్ అథారిటీకి మధ్య కుదిరిన అవగాహనా పత్రాన్ని (ఎం.ఓ.యును) ప్రభుత్వం బుధవారం ఆమోదించింది. మొత్తంమీద ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ఎం.ఓ.యు. లక్ష్యం. పాసింజర్ సర్వీసులు మెరుగుపరచి, భారతదేశంలో హెచ్చు సామర్థ్యం కలిగిన బస్సుల వినియోగాన్ని ప్రోత్సహించాలని భావిస్తున్నారు. ''రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖకి, 1999 (యు.కె) నాటి గ్రేటర్ లండన్ అథారిటీ చట్టం కింద ఏర్పాటైన చట్టబద్ధమైన సంస్థ 'ట్రాన్స్‌పోర్ట్ ఫర్ లండన్'కి మధ్య కుదిరిన ఎం.ఓ.యుపై సంతకాలు, అమలుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు సాగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. భారతదేశంలో ప్రజా రవాణాను మెరుగుపరచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు'' అని ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. భారత్-బ్రిటన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టపరచడంలో, పెంపొందించడంలో ఇది దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని రోడ్డు రవాణా,హైవేల మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఎం.సి.ఏ. సవరణకు గ్రీన్ సిగ్నల్

పోర్టులలో పెట్టుబడుల వాతావరణాన్ని మెరుగుపరచే ప్రయత్నం



న్యూఢిల్లీ: పెట్టుబడుల వాతావరణాన్ని ఇన్వెస్టర్లకు మరింత స్నేహపూర్వకమైనదిగా మార్చేందుకు, ప్రధాన నౌకాశ్రయాల వద్ద ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పి.పి.పి) డిజైన్ ఆధారిత ప్రాజెక్టులకు సవరించిన నమూనా రాయితీ ఒప్పందాన్ని ప్రభుత్వం బుధవారం ఆమోదించింది. డెవలపర్లకు సవరించిన మోడల్ కన్సెషన్ ఒప్పందం (ఎం.సి.ఏ) ఒక నిష్క్రమణ మార్గాన్ని కల్పిస్తోంది. కమర్షియల్ ఆపరేషన్ తేదీ (సి.ఓ.డి) నుంచి రెండేళ్ళు పూర్తయిన తర్వాత, తమ ఈక్విటీని 100 శాతం ఉపసంహరించుకునే సౌలభ్యం వారికి ఒనగూడుతోంది. హైవేల రంగంలో ఏ విధమైన ఎం.సి.ఏ. నిబంధనలు అమలులో ఉన్నాయో వాటిని నౌకాశ్రయాలకు కూడా వర్తింపజేస్తున్నారు.''పోర్ట్ ప్రాజెక్టులను ఇన్వెస్టర్లకు మరింత స్నేహపూర్వకమైనవిగా మలచేందుకు, నౌకాశ్రయాల రంగంలో పెట్టుబడుల వాతావరణాన్ని మరింత ఆకర్షణీయమైనదిగా మార్చేందుకు మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్‌కు చేసిన సవరణలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం బుధవారం ఆమోదించింది'' అని నౌకాయాన మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. హైవేల రంగంలో అందుబాటులో ఉన్న విధంగానే, వివాదాల పరిష్కార యంత్రాంగం ఏర్పాటుకు ఎం.సి.ఏ.లో చేసిన సవరణలు వీలుకల్పిస్తున్నాయి. సొసైటీ ఫర్ ఎఫర్డబుల్ రిడ్రెసల్ ఆఫ్ డిస్ప్యూట్స్-పోర్ట్స్ ఏర్పాటు చేయనున్నారు. రాయితీ పొందుతున్న వ్యక్తికి అదనపు భూమి నిబంధన కింద, ప్రతిపాదిత అదనపు భూమికి వర్తించే రేట్ల స్కేలులో భూమి అద్దెను 200 శాతం నుంచి 120 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవహరించిన ప్రతి మిలియన్ టన్ను కార్గో/టి.ఇ.యు. ఆధారంగా కన్సెషనైర్ రాయితీ చెల్లిస్తాడని తెలిపారు. వార్షిక టోకు ధరల సూచి (డబ్ల్యు.పి.ఐ)లోని తారతమ్యాలకు అనుగుణంగా దాని ఇండెక్స్ రూపొందిస్తారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈ రాయల్టీ చెల్లింపు, బిడ్డింగ్ సమయంలో కోట్ చేసిన స్థూల రెవిన్యూ శాతానికి సమానంగా ఉంది. ప్రధాన పోర్టుల టారిఫ్ అథారిటీ (టి.ఏ.ఎం.పి) నిర్దేశించిన సాధారణ టారిఫ్ పరిమితి ఆధారంగా దాన్ని లెక్కిస్తున్నారు. ఈ పద్ధతి మారనుంది. ధర డిస్కౌంట్లను పక్కనపెట్టి, సీలింగ్ టారిఫ్ ననుసరించి రెవిన్యూ వాటా చెల్లించడంపై ప్రభుత్వ, ప్రైవేటు పార్టిసిపేషన్ (పి.పి.పి) ఆపరేటర్ల (దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న) సమస్యలను పరిష్కరించడంలో ఇది సహాయపడగలదని ప్రభుత్వం పేర్కొంది. టి.ఏ.ఎం.పి. స్టోరేజీ చార్జీలను నిర్ణయించడం, స్టోరేజీ చార్జీల రాబడి వాటా వసూలుకు సంబంధించిన సమస్యలు అనేక ప్రాజెక్టులను పీడిస్తున్నాయి. వాటినన్నింటినీ నిర్మూలించడానికి కూడా ఈ సవరణలు సహాయపడతాయి. హెచ్చు సామర్థ్యం కలిగిన పరికరాలు/సదుపాయాలు/టెక్నాలజీ వినియోగించుకునే స్వేచ్ఛ కన్సెషనైర్‌కు లభిస్తుంది. ఫలితంగా, హెచ్చు ఉత్పాదకతకు వాల్యూ ఇంజనీరింగ్ నిర్వహించడానికి, ప్రాజెక్టు ఆస్తులను మెరుగైన రీతిలో ఉపయోగించుకుని, వ్యయాలను ఆదా చేసుకునేందుకు వీలవుతుంది. కొత్త ఒప్పందంలో ''వాస్తవిక ప్రాజెక్టు వ్యయం'' స్థానాన్ని ''మొత్తం ప్రాజెక్టు వ్యయం'' ఆక్రమిస్తుంది. టి.ఏ.ఎం.పి. మార్గదర్శక సూత్రాలు/ఆదేశాలు,పర్యావరణపరమైన నిబంధనలు, కార్మిక చట్టాలు నిర్దేశించే ప్రమాణాలు, పరిస్థితులు కూడా ''చేంజ్ ఇన్ లా'' నూతన నిర్వచన పరిధిలోకి వస్తాయి. కొత్త పన్నులు విధించడం, ఉన్నవి పెంచడం, సుంకాలు వంటివి కన్సెషనైర్‌కు పరిహారం లెక్కగట్టడంలో పరిగణనకు వస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే/పెంచే ప్రత్యక్ష పన్నుకు మాత్రం దాని నుంచి మినహాయింపు నిచ్చారు.

ప్రయాణంలో... జీవితం!

బోరింగ్ రొటీన్ నుంచి బయటపడాలన్నా... ఒత్తిడికి, కాలుష్యానికి అందనంత దూరంలో ఉండాలన్నా... వెంటనే టూర్ ప్లాన్ చేయాల్సిందే. ఇటువంటి ప్రయాణాల్లో కళ్లకు విశ్రాంతినిచ్చే పచ్చదనం, మేనిని హాయిగా తాకే చల్లటి గాలులు... మనసును తేలికపరుస్తాయి. వీటివల్ల మేనికి, మనసుకి ఎంతో ప్రశాంతత లభిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఇదొక్కటే కాకుండా... కెరీర్ ఎదుగుదలకి కూడా ట్రావెల్ ఎంతో సాయపడుతుందంట. కొత్త ప్రదేశాలు, అక్కడి సంస్కృతులు మీకో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. కొత్త విషయాలు ఎదురుకావడంతో బుర్ర చురుకుగా ఆలోచించడం మొదలు పెడుతుంది. దాంతో సృజనాత్మక ఆలోచనలకి కొదవ ఉండదు. దీనివల్ల వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుదిద్దుకోవచ్చు కూడా. కొత్తగా నేర్చుకున్న భాష లేదా నైపుణ్యాలు కెరీర్‌గ్రాఫ్‌ను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. ప్రతిరోజూ ఇంటినుంచి ఆఫీసుకి, ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లడం విసుగ్గా అనిపిస్తుంది. దాన్నుంచి బయటపడేస్తాయి ప్రయాణాలు. కొన్ని రోజులపాటు రెగ్యులర్ పనికి దూరంగా ఉండి... తిరిగి మొదలుపెడితే నూతనోత్సాహంతో పనిచేస్తారు. ప్రయాణాల్లో కొత్త వ్యక్తులు పరిచయవ ఎవుతారు. కొత్త స్నేహాలు ఏర్పడతాయి. అదే స్నేహితులతో కలిసి ట్రావెల్ చేస్తే మీ స్నేహం ఇంకా బలపడుతుంది.



మనసుదోచే ముస్సోరి


'క్వీన్ ఆఫ్ హిల్స్'గా పేరున్న ముస్సోరిలో ప్రకృతి అందాలు పరవశింప చేస్తాయి. మాన్‌సూన్ సీజన్‌లో ప్రకృతి సోయగాలు చూడాలనుకునే వారికి ఇది ఫేవరేట్ స్పాట్. హనీమూన్ ప్లాన్ చేసుకుంటున్న జంటలకీ, ఫ్యామిలీతో కలిసి వెకేషన్ వెళ్లాలనుకుంటున్న వారికి ఉత్తరాఖండ్‌లో ఉన్న ముస్సోరి బెస్ట్ ఆప్షన్. ముస్సోరిలో ఎత్తైన ప్రదేశం ఇది. ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ స్టేషన్లను ఇక్కడ చూడొచ్చు. ఇక్కడ ఉన్న టవర్‌పై పురాతన టెలిస్కోప్ ఉంటుంది. అందులో నుంచి చూస్తే ముస్సోరి అందాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. ముస్సోరిలో రెండో ఎత్తైన ప్రదేశం ఇది. మాల్‌కు 400 అడుగుల ఎత్తులో ఉంటుంది. రోప్‌వే ద్వారా చేరుకోవచ్చు. ట్రెకింగ్ చేస్తూ వెళ్లొచ్చు. గన్‌హిల్‌కు చేరుకున్నాక టెలిస్కోప్‌లో చూస్తే ఆకాశాన్ని ముద్దాడుతున్నట్టుగా కనిపించే పర్వతాలు కనువిందు చేస్తాయి. 1857లో బ్రిటిష్ వాళ్లు ఇక్కడ పెద్ద ఫైరింగ్ గన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఇక్కడ గన్ పేలిస్తే, దాన్ని బట్టి అందరూ వాచ్‌లో సమయాన్ని మార్చుకునే వారట. అయితే 1970లో ఈ గన్‌ను తొలగించారు. నాలుగు కిలోమీటర్ల పొడవుంటుంది. ఇక్కడి రాళ్లు ఒంటె మూపురం మాదిరిగా ఉండటం వల్ల ఆ పేరు స్థిరపడింది. ఈ రోడ్డు రెండు ముఖ్యమైన ప్రదేశాలను కలుపుతుంది. ఇక్కడి నుంచి చుట్టుపక్కల విస్తరించి ఉన్న పర్వతాల అందాలు కనువిందు చేస్తాయి.



చెట్ల వేళ్లతో వంతెనలు!

సాధారణ క్రమానికి భిన్నంగా ఉన్నది ఏదైనా వింతే! అది ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన గుహలైనా.. మానవ నిర్మిత భవనాలైనా..! అలాంటి ప్రదేశం గురించే మనం ఇప్పుడు తెలుసుకోబోతున్నాం. మేఘాలయాలోని చిరపుంజిలో అడవిలో సాధారణంగా పెరిగే వృక్షాన్ని మానవ అవాసాలకు అనుగుణంగా మలచి ఓ ఆకర్షణీయమైన ప్రదేశంగా మార్చేశారు స్థానికులు. అంటే, సాధారణంగా మానవులు వంతెనలు నిర్మిస్తారు. కానీ ఈ వంతెనను మాత్రం ఇక్కడివారు పెంచి పెద్దచేశారు. జలపాతాలకు పేరుగాంచిన చిరపుంజి ప్రాంతంలో పెరిగిన రబ్బరు మొక్క కాండాలను వారు అందుకు ఉపయోగించుకున్నారు. వాటి నుంచి పెరిగిన వేళ్లను పక్కనే ఉన్న నదీ ప్రవాహాలను కాలినడకన దాటేందుకు అనువైన వంతెనలుగా మలిచారు. భూమిలోపలికి పెరగాల్సిన వేళ్లను స్థానికులు నదికి సమాంతరంగా వచ్చేలా అల్లికలు చేశారు. అవి కాలక్రమేణా పెద్దవై, గట్టిపడి నదిమీద వంతెనలా మారాయి. ఇక్కడ ఇలాంటి వంతెనలు అడుగడుగునా కనిపిస్తాయి. ఇవి ఎంత దృఢంగా ఉంటాయంటే, ఒకేసారి పదుల సంఖ్యలో సందర్శకులు ఫొటోలకు ఫోజులిచ్చినా చెక్కు చెదరవు. అంతేకాదు, ఆ లివింగ్ రూట్స్ బ్రిడ్జిలపై వేసే ప్రతి అడుగూ పర్యాటకులలో నూతనోత్సాహాన్ని అందిస్తుంది.






కాబిని పర్యాటకం అంటే, పచ్చని అడవి తోరణం.. మండు వేసవి సైతం చిన్నబోయే ఆహ్లాదకరమైన వాతావరణం! వన్యప్రాణులకు ఆవాసం!! అక్కడ వేసే ప్రతి అడుగూ ప్రకృతి ఆత్మీయ పలకరింపుల ఆహ్వానమనే చెప్పాలి. అభయా రణ్యంలో చేసే సఫారీలు జీవితంలో మరిచి పోలేని తీయని అనుభూతులను చేరువ చేస్తాయి. పరవళ్లు తొక్కే అక్కడి నదీ ప్రవాహం చూపే సహజసిద్ధ అందాలు ఓ సారి చూద్దాం...!

చూడచక్కని కాబిని!


బెంగళూరుకు 163 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాబిని ప్రాంతం వన్యప్రాణులకు ఆవాసంగా నిలుస్తోంది. అక్కడి అటవీ ప్రాంతానికి ఇది ఆగేయంగా ఉంది. ఈ ప్రాంతంలోనే కాబిని నది ప్రవహిస్తుండటంతో దీనిని కాబిని పర్యాటక స్థలంగా పిలుస్తున్నారు. సుమారు 55 ఎకరాల మేర విస్తరించి ఉన్న దట్టమైన అడవులు, ఎత్తు పల్లాల నేలలు, సరస్సులు, ప్రవాహాలు కలిగి ప్రకృతిసిద్ధమైన రమణీయ ప్రదేశంగా రూపుదిద్దుకుంది.


కాబిని నది

కాబిని డ్యామ్ కోసం ఇక్కడ ఓ పెద్ద సరస్సును కృత్రిమంగా ఏర్పాటు చేశారు. ఆ క్రమంలో ఈ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న 'మస్తిగుడి' అనే గ్రామం మునిగిపోయింది. దాంతో సరస్సుకు 'మస్తిగుడి' అని నామకరణం చేశారు. ఈ డ్యామ్ నాగర్‌హోల్ ప్రాంతాన్నీ, బండిపుర అటవీ ప్రాంతాన్నీ వేరు చేస్తుంది. ఈ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులు కాబిని నదిని తప్పకుండా చూడాలి. ఈ నది కేరళలోని వయనాడ్ జిల్లాలో పుడుతుంది. మనన్తవది నది, పనమారం నదుల సంగమమే కాబిని. కాబిని నదినే 'కపిల' నది అని కూడా అంటారు. కాబిని నది తర్వాతి దశలో తిరుమకుదలునరసిపుర వద్ద కావేరి నదితో కలసి ప్రవహిస్తుంది. 1974లో నదిపై నిర్మించిన కాబిని డ్యామ్‌ను టూరిస్టులు తప్పక చూడాల్సిందే. ఈ డ్యామ్ 2,284 అడుగులు (696 మీటర్లు) పొడవు, 190 అడుగులు (58 మీటర్లు) ఎత్తు ఉంటుంది.










నాగర్‌హోల్ నేషనల్ పార్క్

కాబిని నదికి వెళ్ళేమార్గంలోనే ఉన్న నాగర్‌హోల్ నేషనల్ పార్క్‌ను తప్పకుండా సందర్శించాలి. అందులోని ఆసియా ఏనుగు గుంపులను చూసి ఆనందించవచ్చు. నాగర్‌హోల్ అటవీ ప్రాంతం మొత్తం పెద్దపెద్ద వృక్షాలు, చిన్న చిన్న మొక్కలు తిని జీవించే జంతుజాలంతో నిండి ఉంటుంది. ఆకులు, పండ్లతో కూడిన ఆహారం ఎక్కువగా లభించడం వల్ల శాకాహారులు అయిన ఏనుగులు ఎక్కువగా తారసపడతాయి. ఆసియా ఏనుగులు అధికంగా ఉంటాయి. వాటితోపాటు లేడి, దుప్పి, జింకలు, సంభార్, అడవి పందులు, కోతులు ఇలా ఇక్కడ చూడవచ్చు. వాటిన్నింటిలో ఏనుగుల సముదాయాలు ప్రత్యేకమనే చెప్పాలి. వీటితోపాటు పులులు, చిరుత పులులు, వేట కుక్కలు వంటివి కూడా ఈ ప్రాంతంలో సంచరించటం వల్ల పర్యాటకులను అటవీశాఖవారు ఎప్పటికప్పుడు చేస్తూ ఉంటారు.



సఫారీ స్పెషల్

కాబినిలోని జంతుజాలాన్ని వీక్షించేందుకు జంగిల్ సఫారీ ఎంతో అనువుగా ఉంటుంది. ఇక్కడి సుందర సన్నివేశాలు అటవీ ప్రాంత పర్యావరణవేత్తలకు ఎంతో ఆసక్తి కలిగిస్తాయి. సరికొత్త వృక్షజాతులు, జీవ జాతులను జీపు ప్రయాణంలో చూసి ఆనందించవచ్చు. పచ్చని ఈ ప్రాంతంలో పర్యాటకులు కాలినడకను ఎక్కువగా ఆస్వాదిస్తూ కనిపిస్తారు. ఇక్కడి వాతావరణం వేసవిలో కాస్త అనుకూలంగా లేకపోయినప్పటికీ, ప్రకృతి అందాలు ఆ అలసటను దూరం చేస్తాయి. అడవిలో సఫారీపై వెళితే, అనేక జంతువులను దగ్గర నుంచి చూడొచ్చు. కాబినిలో సుమారు మూడువందల రకాల పక్షి జాతులు ఉన్నాయి. సుంకదకట్టలోని ఎలిఫెంట్ సఫారి, జీపులు సైతం వెళ్ళలేని ఎత్తయిన ప్రదేశాలను వీక్షించేందుకు, సాహస పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతంలోని సహజ అందాలు ఏనుగు సఫారీపై వీక్షించడం వల్ల ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయి. వణ్యప్రాణుల మధ్యగుండా ఏనుగు మెల్లగా అడుగులు వేస్తుంటే ఆ అనుభూతులు మాటల్లో చెప్పలేం. అందుకే, కాబినిలో ప్రధానాకర్షణ అంటే, జంగిల్ సఫారీ, ఏనుగుల సఫారీ అంటారు. అడవులలో నడక, ట్రెక్కింగ్, బోట్ విహారం, సైకిలింగ్, పక్షుల గమనం, రాత్రులలో చలిమంటలు, స్థానికగ్రామాల సందర్శనలతో ఎంతో ఆనందం పొందవచ్చు.

కురువా ద్వీప్

కాబిని నది వద్ద ఏర్పడిన డెల్టా (నదీ ముఖద్వారం వద్ద ఏర్పడే రెండు నదీ పాయల మధ్య ప్రదేశం) ప్రాంతమే కురువా ద్వీపం. ఎప్పుడూ పచ్చని చెట్లతో ఈ ద్వీపం కళకళ లాడుతుంది. వివిధ రకాల వృక్ష జంతు జాతులనూ ఇక్కడ గమనించవచ్చు. అరుదైన కొన్ని పక్షులకి ఈ కురువా ద్వీపం ఆవాస స్థలం. అసాధారణ మూలికలు, ఆర్కిడ్స్ పూలు ఈ ద్వీపంలో కనబడతాయి. ప్రకృతి అందాలను తనివితీరా చూడాలనుకునే పర్యాటకుల తాకిడితో ఈ ద్వీపం ఎంతో ప్రాచుర్యం పొందింది. కురువా ద్వీపంలో ఉన్న అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు ముగ్ధులవుతున్నారు. అద్దెకు తీసుకున్న ఫైబర్ బోట్స్, తెప్పల ద్వారా ఈ ద్వీపాన్ని సందర్శించే అవకాశం పర్యాటక శాఖ కల్పిస్తోంది. ఈ ద్వీపంలో ఉన్న సహజ సిద్ధమైన ప్రకృతి సౌందర్యాన్ని కాపాడేందుకు సంవత్సరంలో కొన్ని సమయాలలో మాత్రమే ఇక్కడికి ప్రవేశించేందుకు అనుమతి ఇస్తారు. ఈ ద్వీపంలోకి ప్రవేశించడానికి అటవీశాఖ అనుమతి తప్పనిసరి.


ఆడుతూ పాడుతూ పర్యటిస్తూ..!

మీకు టూర్లు వెళ్లడం ఇష్టమా? ఆ వ్యాపకాన్నే ఉపాధిగా మార్చుకుంటే.. ఇక తిరుగేముంది? బోర్ అన్న మాటకు తావేలేదు. అలాంటి ప్రకృతి ప్రియులకు ఇటువంటివి భలే నప్పుతాయి. కొన్నేళ్లు గడిచాక– ఉదయం నుంచి సాయంత్రం వరకు చేసే ఉద్యోగం బోర్ కొట్టవచ్చు. పర్యటక ప్రదేశాలకు వెళ్లడం మీకో సరదా. ఉద్యోగంతో ఆ ముచ్చట తీరడం లేదు. తిరగడమే మీ ఉద్యోగం అయితే.. ఎంత అద్భుతం! అందుకు అవకాశాలు బోలెడు. ఒక ఆసక్తికర పర్యటక ప్రదేశాన్ని ఎంచుకుని వీడియో రికార్డు చేయండి. దేశవ్యాప్తంగా ఉన్న పలు ఎంటర్‌టైన్‌మెంట్ ఛానళ్లు పర్యటక ప్రదేశాల ప్రదర్శనకు ప్రాముఖ్యం ఇస్తున్నాయి. మీకు చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. అలాగని కెమెరాను భుజాన వేసుకుని ఊళ్లు



తిరుగుతానంటే కుదరదు. అదొక ఉద్యోగమైతే అప్పుడు ఏ ఢోకా ఉండదు. అలాంటిదే ట్రావెల్ ఫొటోగ్రఫీ. మీరు పర్యటక ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఎంట్రీలెవెల్ కెమెరాతోనే ఫొటోలు తీయండి. లేదంటే మీ స్మార్ట్‌ఫోన్‌తోను క్లిక్ మనిపించవచ్చు. వాటిని నెట్‌లో పెట్టేయండి. ఆ అనుభవంతో ట్రావెల్ పబ్లికేషన్స్, ట్రావెల్ జర్నల్స్, వెబ్‌సైట్లలో ట్రావెల్ ఫొటోగ్రాఫర్‌గా అవతారం ఎత్తవచ్చు. ప్రకృ తి ఎంత సూార్తీమంతమైనదంటే.. మనం రోజూ చూసే ఆ పాత దృశ్యాన్నే ఒక అందమైన ఫొటోగా చిత్రీకరించవచ్చు. ఆ సృజన మీలో ఉంటే నేచర్ ఫొటోగ్రఫీ ఉండనే ఉంది. ప్రకృతి దృశ్యాలను కొత్తగా, ఇన్‌స్పైరింగ్‌గా ఫొటోలు తీసే సత్తా ఉంటే.. హాయిగా టూర్లు వెళుతూ ఫటాఫట్ ఫొటోలు కొడుతూ బతికేయొచ్చు. ఒకవైపు అభిరుచి. మరోవైపు ఉపాధి.. రెండూ వర్కవుట్ అవుతాయి.

ఫసిఫిక్ మహా సముద్రంలోని ఒక చిన్న భాగాన్ని దక్షిణ చైనా సముద్రంగా పిలుస్తారు. దీని విస్తీర్ణం. 14 లక్షల చ. మైళ్లు. లోతు 8 వేల అడుగులు. వియత్నాం, ఫిలిప్పీన్స్, మలే షియా, సింగపూర్‌లు ఈ సముద్రానికి తీరప్రాంత దేశాలు. పెరల్, మిన్, జ్యాలోంగ్, మేకంగ్ నదుల ప్రవాహాలు ఈ సముద్రంలో కలుస్తాయి. దక్షిణ చైనా సముద్రంలో 250 వరకు చిన్న దీవులున్నాయి. అపార మత్స్యసంపద, చమురు నిల్వలు ఉన్నాయి. సహజ వనరులతో పాటు ప్రపంచ జలరవాణాలో మూడోవంతు ఈ సముద్రం మీదుగానే జరుగుతుండటం లాంటి కారణాలతో ఈ సముద్రానికి వ్యూహాత్మక ప్రాధాన్యత పెరిగింది.




మనం స్పోర్ట్స్
గురువారం, 4 జనవరి, 2018
www.manamnews.com



కోహ్లీ, అనుష్కల రొమాంటిక్ సెల్ఫీ

కేప్‌టౌన్: సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లిన టీమిండియాలో నూతన దంపతులు విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ కూడా ఉన్నారు. గతంలో వీరిద్దరు ఎక్కడ కలిసినా మీడియా రచ్చ రచ్చ చేసేది. కానీ ఇప్పుడు వీరిద్దరూ అధికారికంగా చక్కట్లు కొడుతున్నారు.. బహిరంగంగా సెల్ఫీలు దిగుతున్నారు. సౌతాఫ్రికాలో ఉన్న ఈ నూతన దంపతులు బుధవారం తాజాగా సెల్ఫీ దిగి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కోహ్లీ, అనుష్కలకు చూసిన వాళ్ల దిష్టి తగులుతుందేమో అన్నంత అందంగా ఈ ఫొటో ఉంది. 2017 డిసెంబర్ 11న ఇటలీలో కోహ్లీ, అనుష్క వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.

అండర్-19 వరల్డ్ కప్‌కు భారత్ అంపైర్లు



దుబాయ్: అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత్‌కు చెందిన అంపైర్లు అనిల్ చౌదరి, సీకే నందన్ ఫీల్డ్ అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ విషయాన్ని ఐసీసీ బుధవారం ప్రకటించింది. అండర్-19 వరల్డ్ కప్ ఈ నెల 13న న్యూజిలాండ్‌లో ప్రారంభం కానుంది. ఈ టోర్నీ 14 మంది సభ్యుల బలమైన అంపైర్ల జాబితాను ఐసీసీ సిద్ధం చేసింది. ఇందులో భారత అంపైర్లతో పాటు రాబర్ట్ బైలే, గ్రెగరీ బ్రాత్‌వెయిట్, నిగెల్ డుగుయిడ్, షాన్ జార్జ్, షాన్ హెయిగ్, హార్క్ హాథోర్న్, రాన్‌మోర్ మార్టినెజ్, అహసాన్ రాజా, షోజాబ్ రాజా, తిమోథి రాబర్ట్ రాబిన్సన్, లాంగ్టన్ రుసెరె, పాల్ విల్సన్ ఉన్నారు. వీరి కాకుండా ఐసీసీ డెవలప్‌మెంట్ ప్యానెల్‌కు చెందిన డేవిడ్ ఒడియాంబో, బుద్ధి ప్రధాన్, ఇయాన్ రమగె కూడా ఈ టోర్నీలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఐసీసీ ఎమిరేట్ ఎలైట్ ప్యానెల్‌కు చెందిన మ్యాచ్ రెఫరీలు జెఫ్ క్రో, దేవ్‌దాస్ గోవింద్‌జీ, డేవిడ్ జూక్స్ కూడా తమ సేలను అందించనున్నారు. ఇండియా. ఆస్ట్రేలియా జట్లు మూడేసి సార్లు టైటిల్‌ను గెలిచాయి. కాగా ఇంగ్లండ్, సౌతాఫ్రికా జట్లు ఒక్కోసారి విజేతగా నిలిచాయి. ఈ టోర్నీలో పాల్గొంటున్న 16 జట్లలోని మిగతా జట్లలో ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, కెన్యా, నమీబియా, న్యూజిలాండ్, పపువా న్యూ జెనీవా, శ్రీలంక, జింబాబ్వే ఉన్నాయి.

సిరీస్ ఓడినా... టాప్ ర్యాంక్ పదిలం



కేప్‌టౌన్: టెస్టు సిరీస్‌లో సౌతాఫ్రికాలో చేతిలో ఓడిపోతే ఏం జరుగుతుందో అన్న భయం ఇక టీమిండియాకు లేదు. ఎందుకంటే ఒకవేళ సిరీస్ ఓడినా టీమిండియా టాప్ ర్యాంక్ పదిలంగానే ఉంటుంది. దీంతో ఈ సిరీస్‌లో కోహ్లీ సేన ధైర్యంగా ఆడే అవకాశముంది. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో సౌతాఫ్రికా ప్రస్తుతం కోహ్లీ సేన కంటే 13 పాయింట్లు వెనకబడివుంది. కోహ్లీ సేన 124 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఈ మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఫాఫ్ డు ప్లెసిస్ సేన క్లీన్ స్వీప్ చేసినా ఇరు జట్లూ 118 పాయింట్లతో నిలుస్తాయని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. దశాంశ బిందువు స్థానంలో పాయింట్లను లెక్కగడితే టీమిండియా 118.47 పాయింట్లతో, సౌతాఫ్రికా 117.53తో ఉంటాయి. నాణేనికి మరోవైపు చూస్తే ఇకవేళ టీమిండియా ఈ మూడు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంటే కోహ్లీ సేనకు 128 పాయింట్లు లభిస్తాయి. సౌతాఫ్రికా 107 పాయంట్లతో మరింత కిందికి దిగజారుతుంది.

ఇక టెస్టు బ్యాట్స్‌మెన్ విషయానికొస్తే.. కెరీర్‌లో తొలిసారి 900 పాయింట్ల మైలురాయిని ఈ సిరీస్‌లో కోహ్లీ దాటే అవకాశముంది. ఫామ్‌లో ఉన్న కోహ్లీ ప్రస్తుతం 893 పాయింట్లతో కొనసాగుతున్నాడు. కోహ్లీకి 20 పాయింట్ల దూరంలో చెటేశ్వర్ పుజారా మూడో స్థానంలో ఉన్నాడు. సౌతాఫ్రికాకు చెందిన మరో ప్లేయర్ హాషీం ఆమ్లా మాత్రమే టాప్-10లో (7వ ర్యాంక్) ఉన్నాడు. బౌలర్ల విషయానికొస్తే.. నంబర్ వన్ ర్యాంక్ కోసం సౌతాఫ్రికాకు చెందిన కగిసా రబాడ పోటీ పడుతున్నాడు. నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్న జేమ్స్ ఆండర్సన్‌కు 9 పాయింట్ల దూరంలో రబాడ ఉన్నాడు.



మేమేంటో నిరూపిస్తాం

సౌతాఫ్రికాతో సిరీస్‌పై చెటేశ్వర్ పుజారా

కేప్‌టౌన్: సౌతాఫ్రికాతో సిరీస్‌లో తామేంటో నిరూపించుకుంటామని డిపెండబుల్ బ్యాట్స్‌మన్ చెటేశ్వర్ పుజారా అన్నాడు. ఒకవేళ సౌతాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో సత్తా చాటితే భారత జట్లన్నింటిలోకి తమదే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందని పుజారా చెప్పాడు. 'ఇక్కడ, ఇంగ్లండ్‌లో, ఆస్ట్రేలియాతో సత్తా చాటే అవకాశం మాకు లభించింది. శ్రీలంకతో సిరీస్‌లో మేమేంటో నిరూపించాం. ఇదే సరైన సమయం. తప్పించుకునే కారణాలేవీ మాకు లేవు. మేము అనుభవజ్ఞులం. అత్యుత్తమ ఆటగాళ్లం. మేము గనుక సత్తా చాటితే మాది అత్యుత్తమ జట్టుగా నిలుస్తుంది' అని పుజారా చెప్పాడు. సౌతాఫ్రికాలో ఎలా రాణించాలని తామంతా అనుక్షణం చర్చించుకుంటున్నట్టు పుజారా తెలిపాడు. 'భారత్‌లో శ్రీలంకతో ఆడుతున్నప్పుడు మా మైండ్‌లో సౌతాఫ్రికా సిరీస్ మెదులుతూనే ఉంది. ఆ సమయంలోనే మేము కొన్ని విషయాలను ఆచరణలో పెట్టాం. సౌతాఫ్రికాతో సిరీస్‌కు సిద్ధపడేందుకు మాకు చాలినంత సమయం లభించింది' అని అన్నాడు. గతం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ముందున్న సవాళ్లపైనే తాము ఎక్కువగా దృష్టి పెట్టామని పుజారా అన్నాడు. 'ముఖ్యంగా విదేశీ గడ్డపై వీలైనన్ని ఎక్కువ బంతులను వదిలేయడమే మంచిది. ఆసియా ఖండం నుంచి బయటికి వచ్చాక బౌన్సీ పిచ్‌లను ఎదుర్కోవాల్సి వుంటుంది. అందుకే బాల్స్‌లను వదిలేయడమే మంచిదని చెబుతున్నాను. టెక్నికల్‌గా, మానసికంగా ఇదే మంచిది. మరో ఆనందించదగ్గ అంశమేంటంటే.. చాలా మంది ప్లేయర్స్ గతంలో ఇక్కడికి వచ్చారు. వ్యక్తిగతంగా నేను కూడా రెండుసార్లు (2010-11, 2013-14) ఇక్కడికి వచ్చాను. ఇక్కడి వాతారణం ఎలా వుంటుందో తెలుసు కాబట్టి దాని అనుగుణంగా మనలను మనం మలచుకుని ఆడాలి' అని చెప్పాడు. సౌతాఫ్రికాలో బౌన్సీ పిచ్‌ల గురించి పుజారా ఏమాత్రం కంగారు పడడం లేదు. 'అవును! ఇక్కడ బౌన్స్ కాస్త ఎక్కువగా ఉంటుంది. దాన్ని ఎదుర్కోవడం ఎల్లప్పుడూ సవాలే. కానీ ఈసారి మేము దానికి తగ్గట్టు సిద్ధపడ్డాం. గత నెలన్నర పాటు మేము ఏవైతే సిద్ధపడ్డామో వాటిని ఇక్కడ ఆచరణలో పెట్టగలగాలి' అని పుజారా వివరించాడు. అంతేకాదు ఇండియాలోని ఫ్లాట్ పిచ్‌లపై తమకు అండగా నిలిచిన భారత బౌలర్లు ఇక్కడ కూడా వికెట్లు తీయగలరని పుజారా విశ్వాసం వ్యక్తం చేశాడు. టెస్టు సిరీస్‌కు సిద్ధం చేస్తున్న పిచ్‌ల స్వభావం గురించి తాము ఆలోచించడం లేదని పుజారా అన్నాడు. 'టెస్టు సిరీస్‌కు సిద్ధం చేస్తున్న పిచ్‌ల గురించి బాధలేదు. మా ప్రణాళికలను ఆచరణలో పెట్టడంపై దృష్టి సారించాం. అది ఫ్లాట్ వికెట్ కావచ్చు లేదా గ్రాస్ వికెట్ కావచ్చు.. మాకు స్పష్టమైన గేమ్ ప్లాన్ ఉంది. పిచ్‌లను ఎలా తయారు చేయాలనుకుంటున్నారో అది సౌతాఫ్రికా ఇష్టం. ఆ జట్టులో ఎవరెవరు ఆడతారో వాళ్లిష్టం. ఒక జట్టుగా మేము బాగా సిద్ధమయ్యాం. ఈసారి మా పేస్ అటాక్ కూడా మెరుగ్గా ఉంది. ఈసారి మాకు పేస్ అటాక్ అడ్వాంటేజ్ అవుతుంది' అని పుజారా అన్నాడు.

ధావన్ ఫిట్.. జడేజాకు వైరల్ ఇన్‌ఫెక్షన్



ఇదిలావుంటే తొలి టెస్టుకు టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. రవీంద్ర జడేజా వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాడు. సౌతాఫ్రికా పర్యటనకు బయల్దేరకముందే మడమ గాయంతో బాధపడిన ధావన్ న్యూలాండ్స్‌లో జరగనున్న తొలి టెస్టులో మురళీ విజయ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. 'ఓపెనర్ శిఖర్ ధావన్ పూర్తి ఫిట్‌నెస్‌ను సాధించాడు. తొలి టెస్టుకు అతను అందుబాటులో ఉంటాడు. సౌతాఫ్రికాకు బయల్దేరకముందు కాలి మడమకు చెందిన చిన్న గాయంతో బాధపడ్డాడు' అని బీసీసీఐ ప్రకటనలో తెలిపింది.

మరోవైపు జడేజా తొలి గేమ్‌కు పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కాలానికి ఎదురీదుతున్నాడు. చికిత్స కోసం జడేజా ఆసుపత్రికి తీసుకెళ్లారు. 'గత రెండ్రోజులుగా టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. బీసీసీఐ వైద్య బృందం అతడిని నిశితంగా పరిశీలిస్తోంది. అంతేకాకుండా కేప్‌టౌన్‌లోని స్థానిక వైద్య బృందంతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతోంది. స్థానిక వైద్య బృందం సూచనల మేరకు చికిత్స కోసం జడేజాను బీసీసీఐ వైద్య బృందం ఆసుపత్రికి తీసుకెళ్లింది. రానున్న 48 గంటల్లో జడేజా పూర్తిగా కోలుకుంటాడని భావిస్తున్నాం. తొలి టెస్టుకు జడేజా పూర్తి ఫిట్‌గా ఉన్నాడో లేదో మ్యాచ్ తొలి రోజు ఉదయం నిర్ణయం తీసుకుంటాం' అని బీసీసీఐ ఆ ప్రకటనలో వివరించింది. తొలి మ్యాచ్‌లో టీమిండియా ముగ్గురు పేస్ బౌలర్లు, ఒక స్పిన్నర్‌తో బరిలోకి దిగే అవకాశముంది. దీంతో జడేజాకు బదులుగా రవిచంద్రన్ అశ్విన్‌కు తుది జట్టులో చోటు దక్కనుంది.

టీమిండియాను తక్కువ అంచనా వేయొద్దు

సౌతాఫ్రికా కోచ్

త్వరలో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టీమిండియా ఎదురు దాడికి దిగే అవకాశముందని సౌతాఫ్రికా జట్టు కోచ్ ఒట్టిస్ గిబ్సన్ తమ సహచరులను హెచ్చరించారు. 'వాళ్లు ప్రస్తుతం నంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్నారు. ఆ జట్టులో ప్రపంచ శ్రేణి ఆటగాళ్లు చాలా మందే



ఉన్నారు. ప్రపంచ శ్రేణి ఆటగాళ్లు అంటే వాళ్ల సొంత గడ్డపై మాత్రమే రాణించే వాళ్లని అర్థం కాదు. వాళ్లది మంచి జట్టు. మునుపటి కంటే ఇప్పుడు విదేశీ గడ్డపై టీమిండియా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే అవకాశముంది. ఈ సిరీస్ హోరా హోరీగా జరుగుతుందని భావిస్తున్నాను. గతంలో మాదిరిగా ఈసారి మాత్రం వాళ్లను తక్కువ అంచనా వేయ కండి' అని గిబ్సన్ అన్నారు. తొలి టెస్టు శుక్రవార మిక్కడ ప్రారంభం కానుంది. కేప్‌టౌన్ పిచ్‌పై పచ్చగడ్డి కనిపిస్తోంది. శుక్రవారానికి పిచ్‌పై పెద్దగా మార్పు ఉండకపోవచ్చని.. ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు పైచేయి సాధిస్తుందని గిబ్సన్ చెప్పారు.

2018 సీజన్‌కు హాకీ జట్టు ఎంపిక

బెంగళూరు: ఈ ఏడాది హాకీలో కామన్వెల్త్ గేమ్స్, చాంపియన్స్ ట్రోఫీ, ఆసియన్ గేమ్స్, ఆసియన్ చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలను దృష్టిలో పెట్టుకుని హాకీ ఇండియా (హెచ్ఐ) బుధవారం 33 మంది సభ్యుల జట్టును ఎంపిక చేసింది. చాలా కాలంగా గాయంతో బాధపడుతున్న గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ పూర్తి ఫిట్‌నెస్‌తో మళ్లీ జట్టులోకి వచ్చాడు. ఈ 33 మంది సభ్యుల జట్టుకు గురువారమిక్కడ శిక్షణ శిబిరం ప్రారంభం కానుంది. మోకాలి గాయం కారణంగా దాదాపు 8 నెలలు హాకీకి దూరమైన శ్రీజేశ్ మళ్లీ ఫామ్‌ను పుణికిపుచ్చుకునేందుకు చెమటోడ్చనున్నాడు. గతేడాది అజ్లాన్ షా టోర్నీలో శ్రీజేశ్ మోకాలి గాయానికి గురైన సంగతి తెలిసిందే. ఒడిషాలో జరిగిన హాకీ వరల్డ్ లీగ్ ఫైనల్లో కాంస్య పతకం గెలిచి 2017ను ముగించిన భారత జట్టు ఈ ఏడాది బిజీ హాకీ క్యాలెండర్ కోసం



ఇక్కడి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో 10 రోజుల శిక్షణ తీసుకోనుంది. 2016 జూనియర్ వరల్డ్ విజేత జట్టు గోల్ కీపర్ క్రిషన్ బి పాఠక్‌తో పాటు ఆకాశ్ అనిల్ చిక్టే, సూరజ్ కర్కెరాలకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. న్యూజిలాండ్‌లోని తౌరంగ, హామిల్టన్‌లలో జరగనున్న నాలుగు దేశాల ఇన్విటేషనల్ టోర్నీలో భారత జట్టు ఈ సీజన్‌ను ప్రారంభిస్తుంది. ఈ టోర్నీలో ఆతిథ్య న్యూజిలాండ్‌తో పాటు బెల్జియం, జపాన్ జట్లు పాల్గొంటాయి. 'ఇది చాలా తక్కువ రోజు శిక్షణ శిబిరం. న్యూజిలాండ్‌లో ఎనిమిది మ్యాచ్‌లు ఆడాల్సివుంటుంది. కనుక ఈ శిక్షణ శిబిరాన్ని చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుంది. గత టోర్నీల్లో గెలుపు ఓటములను ముందుగా విశ్లేషించుకోవాలి. వాళ్లకున్న అనుభవమేంటో తెలుసుకుని ఎక్కడ మెరుగు పరచుకోవాలో దానిపై దృష్టి పెట్టాలి. నావరకైతే హాకీ వరల్డ్ లీగ్ ఫైనల్ ఒక గుణపాఠాన్ని తెలియజేసింది. ఉన్నత ర్యాంక్ జట్లతో ఆడేటప్పుడు మనం మెరుగు పరచుకోవాల్సిన అంశాలేంటో ఈ టోర్నీలో తెలిశాయి' అని కోచ్ ఎస్‌జోర్డ్ మారిజ్నే అన్నారు.

వెస్టిండీస్‌కు వైట్‌వాష్

మన్రో రికార్డు సెంచరీ • టీ20 సిరీస్ కివీస్ వశం



మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌లో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వెస్టిండీస్ జట్టు వైట్‌వాష్‌కు గురైంది. బుధవారమిక్కడ జరిగిన చివరి, మూడో టీ20లో న్యూజిలాండ్ 119 పరుగుల భారీ తేడాతో గెలిచింది. అంతేకాకుండా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన కొలిన్ మన్రో రికార్డు సెంచరీతో రికార్డు బుక్కుల్లోకెక్కాడు. 47 బంతుల్లోనే సెంచరీ చేసిన మన్రో తర్వాత 104 పరుగులకు ఔవుటయ్యాడు. టీ20 క్రికెట్ చరిత్రలో మూడు సెంచరీలు సాధించిన తొలి క్రికెటర్‌గా మన్రో నిలిచాడు. మన్రో విధ్వంసకర బ్యాటింగ్ వల్ల తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. టీ20ల్లో న్యూజిలాండ్‌కు ఇది అత్యధిక స్కోరు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు పేలవంగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఓపెనర్లు చాడ్విక్ వాల్టన్, క్రిస్ గేల్ తొలి ఓవర్లో టిమ్ సౌథీ బౌలింగ్‌లో పరుగుల ఖాతా ప్రారంభించకుండానే పెవిలియన్ చేరుకున్నారు. ఫీల్డింగ్ సమయంలో గాయపడ్డ షాయ్ హోప్ బ్యాటింగ్‌కు రాలేదు. దీంతో 16.3 ఓవర్లలో వెస్టిండీస్ జట్టు 124 పరుగులకు (తొమ్మిది వికెట్లు) ఆలౌటైంది.

ఆమె 'నింజా' యోధురాలు

ఐ జు యింగ్‌పై ప్రణయ్ ప్రశంసలు



లక్నో: అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న తైవాన్ మహిళా షట్లర్, ప్రపంచ నంబర్ వన్ ఐ జు యింగ్‌ను 'నింజా యోధురాలు' (నింజా వారియర్)గా హైదరాబాద్ పురుష షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ అభివర్ణించాడు. దశాబ్ద కాలం ప్రాక్టీస్ చేసినా ఆమెతో సరిసమానంగా ఆడలేమని అన్నాడు. 'ఐ జు ఒక నింజా యోధురాలిలా ఆడుతుంది. ఆమె కొట్టే శాట్లను అందుకోవాలంటే బహుశా దశాబ్ద కాలం ప్రాక్టీస్ చేయాలేమో. అయినా ఆమెను నిలువరించడం కష్టమే. ఆమె చేతిలో ఏదో నమ్మశక్యం కాని శక్తి ఉంది. బ్యాడ్మింటన్‌ను ఎంజాయ్ చేయడమే ఆమె ప్రత్యేక లక్షణం. ఆమెతో కలిసి ఈ జట్టులో ఆడుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రాక్టీస్ సెషన్‌లో ఆమెతో ఆడుతుంటాను' అని ప్రణయ్ చెప్పాడు. వీరిద్దరు పీబీఎల్‌లో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌కు ఆడుతున్నారు. అవధె వారియర్స్ జట్టుతో మంగళవారం జరిగిన పోరులో ప్రణయ్, ఐ జు యింగ్ తమ తమ మ్యాచ్‌ల్లో గెలిచినప్పటికీ ఓవరాల్‌గా అహ్మదాబాద్ జట్టు ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ఐ జు ఐదు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచి అద్భుత ప్రతిభ కనబరిచింది. ప్రస్తుతం పీబీఎల్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి తిరుగులేని షట్లర్‌గా కొనసాగుతోంది. చివరి మ్యాచ్‌లో మంగళవారం అవధె వారియర్స్‌కు చెందిన సైనా నెహ్వాల్‌ను ఓడించింది. కోర్టులో గానీ, బయట గానీ ఆమె నుంచి నేర్చుకోవాల్సిన మంచి లక్షణాలు అనేకం ఉన్నాయని ప్రణయ్ అన్నాడు. 'ఆమె చేసే ప్రతి పనిని ఎంజాయ్ చేస్తుంది. అలా ఉండటం చాలా మంచిదని భావిస్తున్నాను. నాకు అది రాలేదు, ఇది రాలేదు అని ఆలోచించే బదులు మనం ఏ స్థితిలో ఉన్నామో దాంతో సంతృప్తి చెందాలి. ఐ జు నుంచి అనేక విషయాలు నేర్చుకున్నాను. ఆమెతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకుంటున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని ప్రణయ్ అన్నాడు.

'టాప్' అథ్లెట్లకు రూ. 3.14 కోట్లు విడుదల

క్రీడల మంత్రి రాథోడ్ ప్రకటన

న్యూఢిల్లీ: టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్) స్కీమ్ కింద 175 మంది అథ్లెట్లకు ఖర్చుల కోసం తమ ప్రభుత్వం రూ. 3.14 కోట్లు విడుదల చేసిందని బుధవారం కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ చెప్పారు. గతేడాది సెప్టెంబర్, డిసెంబర్ కాలానికి నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎన్ఎస్‌డీఎఫ్) కింద ఈ నిధులు విడుదల చేసినట్టు బుధవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాథోడ్ తెలిపారు. మరోవైపు దేశంలో డోపింగ్‌ను నిర్మూలించేందుకు ప్రాంతీయ అవగాహన కేంద్రాలను స్థాపించడంతో పాటు యాంటీ డోపింగ్‌పై కౌన్సిలింగ్‌ను ఇవ్వాలనుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.